గురువారం 18-1-2024


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 123



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ప్రజ్ఞానంద అద్భుతం


ఆనంద్‌ను దాటేసి భారత నంబర్ వన్‌గా టీనేజ్ గ్రాండ్ మాస్టర్ - 12లో



ఎన్‌పీసీఐతో గూగుల్ పే ఒప్పందం

భారత్ వెలుపల యూపీఐ చెల్లింపులకు అవకాశం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఓటర్ల మనసులు గెల్చుకోవాలి

కేరళలో ఓటర్ల మనసులు గెల్చుకోవాలని బీజేపీ నేతలు, కార్యకర్తలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు.

వివరాలు 6లో ▸



మణిపూర్‌లో కాల్పులు

మణిపూర్‌లోని మోరె పట్టణంలో భద్రతా బలగాలపై కుకీ మిలిటెంట్లు దాడి చేయడంతో.. పరస్పర కాల్పులు జరిగాయి.

వివరాలు 6లో ▸



పాక్ ఉగ్రస్థావరాలపై ఇరాన్ దాడి

పాకిస్తాన్‌లోని జైష్ అల్–అదిల్ ఉగ్రవాద సంస్థ స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులతో విరుచుకుపడింది.

వివరాలు 6లో ▸



థాయిలాండ్ ఫ్యాక్టరీలో పేలుడు

థాయిలాండ్‌లోని సుప్రాన్ బురీ ప్రావిన్స్‌లోని బాణసంచా ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడులో 23 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్



కమీషన్లు కాజేశాక చేతులెత్తేసింది మీ బాబే గురవిందా

- పోలవరంలో చంద్రబాబు పాపాలను సీఎం జగన్‌పై నెట్టడానికి పాడిందే పాడుతున్న రామోజీ
- కమీషన్ల కక్కుర్తితో నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న చంద్రబాబు
- పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు దండుకున్న చంద్రబాబు
- రూ.2,917 కోట్ల విలువైన పనులు రామోజీ వియ్యంకుడికి అప్పగింత
- చంద్రబాబు కమీషన్ల బాగోతాన్ని బయటపెట్టిన ట్రాన్స్‌ట్రాయ్ అధినేత

- వివరాలు 14లో

రేపటి నుంచి కులగణన

28 వరకు ప్రక్రియ.. అంబేడ్కర్ చూపిన మార్గంలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు

'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్'ని ఆవిష్కరిస్తున్న రోజే మరో చరిత్రాత్మక ఘట్టం

సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో పారదర్శకంగా ప్రక్రియ

పది రోజుల పాటు ఇళ్ల వద్దే కొనసాగనున్న కులగణన ప్రక్రియ

మిగిలిపోయిన వారి కోసం మరో 5 రోజులు సచివాలయాల్లో అవకాశం

సర్వే కోసం ప్రత్యేకంగా యాప్.. ఈ కేవైసీ

ఏడు సచివాలయాల పరిధిలో ప్రయోగాత్మకంగా పూర్తి

గత సర్వేల ప్రకారం రాష్ట్రంలో 1.67 కోట్ల కుటుంబాలు.. 4.89 కోట్ల జనాభా

3లో



"అణగారిన వర్గాల అభ్యున్నతికి కులగణన మరింత దోహదం చేస్తుంది. ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా చేయూత అందిస్తుంది. ప్రభుత్వ పథకాలు అందకుండా ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోయినా దీని ద్వారా తెలుస్తుంది. తద్వారా వారికీ లబ్ధి చేకూర్చేందుకు వీలుంటుంది. - ముఖ్యమంత్రి జగన్



విజయవాడలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన 'సామాజిక న్యాయ మహాశిల్పం'

చరిత్రాత్మకంగా చైతన్యమూర్తి



ఆకాశమంతటి వ్యక్తిత్వంతో దేశ గతిని మార్చిన బాబా సాహెబ్ అంబేడ్కర్: సీఎం వైఎస్ జగన్

పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చేలా 'సామాజికన్యాయ మహాశిల్పం'

అంబరాన్ని తాకేలా విజయవాడలో 206 అడుగులతో అతి పెద్ద విగ్రహం

19న స్వరాజ్య మైదానంలో విగ్రహావిష్కరణకు అంతా స్వచ్ఛందంగా తరలి రావాలని సీఎం సందేశం

5లో

నెలలోగా ఉమ్మడి ప్రాజెక్టులు కృష్ణా బోర్డు చేతికి

- కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ప్రతిపాదనకు ఏపీ, తెలంగాణ అంగీకారం
- శ్రీశైలం, సాగర్‌లో 15 అవుట్ లెట్స్‌ను నెలలోగా బోర్డుకు అప్పగించాలని స్పష్టీకరణ
- వారంలోగా ప్రాజెక్టుల అప్పగింత విధానాన్ని ఖరారు చేయాలని త్రిసభ్య కమిటీకి ఆదేశం

2లో

కుప్పం నేలపై కృష్ణమ్మ పరవళ్లు

27 ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ..

కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించిన కృష్ణా జలాలు

ఇచ్చిన మాటను నెరవేర్చిన సీఎం జగన్

10లో



రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

రోహిత్ సూపర్.. భారత్ 'డబుల్ సూపర్'..



పలు మలుపులు తిరిగిన చివరి టి20 మ్యాచ్‌లో భారత జట్టు రెండో సూపర్ ఓవర్‌లో అఫ్గానిస్తాన్ జట్టును ఓడించింది. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. రోహిత్ శర్మ (69 బంతుల్లో 121 నాటౌట్), రింకూ సింగ్ (39 బంతుల్లో 69 నాటౌట్) రాణించడంతో ముందుగా భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 212 పరుగులు చేసింది. అనంతరం అఫ్గానిస్తాన్ జట్టు కూడా 20 ఓవర్లలో 6 వికెట్లకు 212 పరుగులు చేయడంతో మ్యాచ్ 'టై' అయింది. దాంతో ఫలితం తేలడానికి 'సూపర్ ఓవర్' నిర్వహించారు. అయితే ఈ 'సూపర్ ఓవర్' కూడా 'టై' కావడంతో ఫలితం రావడానికి రెండో 'సూపర్ ఓవర్'ను ఆడించారు. ఇందులో భారత్ పైచేయి సాధించి సిరీస్‌ను 3–0తో దక్కించుకుంది.

12లో

ఇదండీ సంగతి



..ఎన్నికలు పెట్టుకుని ఎవరూ ఆ సాహసం చేయరు సార్!

ఇసుకపై అదే అక్కసు

ఇసుక మాఫియాకు చెక్ పెట్టి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేసిన సీఎం జగన్

ప్రభుత్వానికి ఆదాయం వస్తుండడం అక్రమమా?

సాక్షి, అమరావతి: ఒక నిజాన్ని అబద్ధం చేసేందుకు పదేపదే దాన్ని అబద్ధమని ప్రచారం చేయాలన్న గోబెల్స్ సిద్ధాంతాన్నే రాజగురువు రామోజీరావు నమ్ముకున్నారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలపై పదే పదే ప్రయోగిస్తున్నారు. ఇసుక తవ్వకాల్లో లేని అక్రమాలను ఉన్నట్లు చూపించేందుకు నిత్యం దానిపై విషం చిమ్మడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్రమ తవ్వకాలు జరిగిపోతున్నాయంటూ దాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి లింకు పెట్టి, ప్రజలను నమ్మించేందుకు కొంతకాలంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే 'ఇసుకలో కొత్త తోడు దొంగలు' పేరుతో కొత్త తప్పుడు ప్రచారాన్ని ఈనాడు అందుకుంది. బోడి గుండుకు మోకాలికి లింకు పెట్టినట్లు ఇసుక తవ్వకాలకు, సీఎం సోదరుడికి లింకు పెట్టి మరీ అబద్ధాలు అచ్చేసింది. పర్యావరణ అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారంటూ ప్రభుత్వంపై గుడ్డి వ్యతిరేకతతో అర్థం లేని రాతలు రాసింది. రాష్ట్రంలో ఇసుక ఆపరేషన్స్ కోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందిన మినీరత్న ఎంఎస్‌టీసీ ద్వారా గనుల శాఖ టెండర్లు నిర్వహించింది. అందులో ప్రతిమ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ప్యాకేజీ-1, ప్యాకేజీ-3 లోని 18 జిల్లాలకు, జీసీకేసీ ప్రాజెక్ట్స్–వర్కర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్యాకేజీ-2 లోని 8 జిల్లాల్లో ఇసుక ఆపరేషన్స్‌కు విజయవంతమైన బిడ్డర్లుగా ఎంపికయ్యాయి. నిబంధనల ప్రకారం ఆ రెండు సంస్థలు పర్యావరణ అనుమతులు ఉన్న రీచ్‌లలో ఇసుక ఆపరేషన్స్ ప్రారంభించాయి. సంబంధిత శాఖల అనుమతులతోనే రిజర్వాయర్లలో డీసిల్టింగ్ జరుగుతోంది. వాస్తవాలు ఇలా ఉంటే సీఎంవో పేరుని వాడుకుని తవ్వకాలు జరుపుతున్నారని, అంతా సీఎం సోదరుడి ఆధ్వర్యంలోనే జరుగుతోందని అభూత కల్పనల్ని ఈనాడు ప్రచారం చేస్తోంది. ఒకవైపు టెండర్ల ద్వారా ఎంపికైన సంస్థలు ఇసుక ఆపరేషన్లు చేపడితే బయట వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ తప్పుడు ఆరోపణలకు దిగింది. సీఎం సోదరుడికి, మరో వ్యక్తికి ఇసుక ఆపరేషన్లతో ఎటువంటి సంబంధం లేకపోయినా ఉన్నట్లు చిత్రీకరించేందుకు శత విధాలుగా అబద్ధాలు వల్లెవేస్తోంది. కావాలని ఇసుక ఆపరేషన్లను రాజకీయం చేయాలని దురుద్దేశంతో ఈ కథనం రాసినట్లు స్పష్టమవుతోంది.



టీడీపీ హయాంలో చంద్రబాబు ఇంటి వెనకాలే అక్రమ తవ్వకాలు

చంద్రబాబు హయాంలో ఇసుక మాఫియా కరాళ నృత్యం చేసినా రామోజీ పట్టించుకోలేదు. సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు నివాసానికి సమీపంలోనే ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. పెద్దఎత్తున ఇసుకను లారీల్లో తరలించారు. ఇక్కడే.. చంద్రబాబు ఇంటి పక్కనే జరిగిన అక్రమ ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ తీవ్రంగా స్పందించింది. ఏకంగా రూ.100 కోట్లు జరిమానా విధించింది. ఆనాడు ఇసుక అక్రమాలను అడ్డుకున్న అధికారులపైనా టీడీపీ నేతలు దాడులు చేశారు. ఎమ్మార్వో వనజాక్షిపై తెలుగుదేశం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాడి చేసిన సంగతి రాష్ట్ర ప్రజలంతా చూశారు. ఫోటోలు, వీడియోలతో సహా ఆధారాలు దొరికినా చంద్రబాబు దానికి కారకులైన వారిని శిక్షించలేదు. పంచాయతీ చేసి, ఒక మహిళా అధికారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారు. చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే ఇసుక విధానం అంటూ లేకుండా చేశారు. మొదట డ్వాక్రా మహిళలకు అని చెప్పి వారి పేరుతో ఇసుకను దోచేశారు. తర్వాత ఉచితం అంటూ దోపిడీకి గేట్లు ఎత్తేశారు. ఒక్క ఇసుక విధానంపైనే 19 జీవోలు తీసుకువచ్చారు. ప్రజల్లో అయోమయం సృష్టించి, చక్కగా దోపిడీకి పాల్పడ్డాడు. ఆనాడు కళ్లుండీ కబోదిలా వ్యవహరించిన రామోజీరావు ఇప్పుడు లేని అక్రమాలను ఉన్నట్లు చూపించేందుకు తన పత్రికేయాన్ని ఉపయోగిస్తున్నారు. చంద్రబాబు హయాంలో అక్రమాలు జరుగుతుంటే కళ్లు మూసుకున్నారు. ఉచిత ఇసుక ముసుగులో వేల కోట్లు కొల్లగొట్టినా సక్రమమే అయింది. అక్రమ తవ్వకాలను అడ్డుకున్న మహిళా ఎమ్మార్వోపై దాడిని మరిచిపోయారు. బాబు ఇంటి పక్కనే అక్రమ తవ్వకాలను ఎన్జీటీ నిర్ధారించిన విషయాన్నీ మరచిపోయారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ అంతా పారదర్శకంగా, పకడ్బందీగా ఇసుక తవ్వకాలు జరుగుతుంటే, సహించలేక విషం చిమ్ముతున్నారు.

మాఫియాకు సీఎం జగన్ చెక్

వాస్తవానికి వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఇసుక మాఫియాకు చెక్ పెట్టారు. నూతన ఇసుక విధానాన్ని తీసుకువచ్చారు. ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక లభించేలా చర్యలు తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు. ఇసుక టెండర్ల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.780 కోట్లు ఆదాయం వస్తోంది. అంటే అయిదేళ్ళలో రూ.4 వేల కోట్ల ఆదాయం. చంద్రబాబు పాలనలో ఇన్ని వేల కోట్లు ఎక్కడికి వెళ్లాయి? ఎవరి జేబుల్లోకి వెళ్ళాయి? చంద్రబాబు హయాంలో ఏ నియోజకవర్గంలోనైనా ఇసుక ఉచితంగా ప్రజలకు అందిందా? ఉచిత ఇసుక పేరుతో ఎక్కువ రేటుకు వినియోగదారులు కొనుక్కోవాల్సిన పరిస్థితి కల్పించారు.

అవాస్తవాలు పదేపదే రాస్తే నిజాలైపోవు..

గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి

ఉచిత ఇసుక విధానం పేరుతో గతంలో జరిగిన దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ సీఎం వైఎస్ జగన్ అత్యంత పారదర్శక విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దాని ప్రకారం టెండర్లు నిర్వహించి ఇసుక ఆపరేషన్స్‌కు ఏజెన్సీలను ఖరారు చేశాం. ఆపరేషన్స్ కూడా ప్రారంభించాం. ఈనాడు పత్రిక ఓర్వలేనితనంతో అభూతకల్పనలను, అవాస్తవాలను పోగు చేసి పదేపదే ఇసుకపై అవాస్తవాలతో కూడిన కథనాలను ప్రచురిస్తోంది. ఇసుక అక్రమాలు జరగకుండా నిఘా కోసం ఎస్ఈబీని ఏర్పాటు చేశాం. జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, గనులశాఖ అధికారులు కూడా ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి జిల్లాకు ఒక విజిలెన్స్ స్క్వాడ్ కూడా గనుల శాఖలో పనిచేస్తోంది. రాష్ట్ర సరిహద్దులతో పాటు కీలకమైన ప్రాంతాల్లో చెక్ పోస్టులు నిర్వహిస్తున్నాం. ఈ విభాగాల పనితీరును కూడా ఈనాడు ఆక్షేపించడం దారుణం. అక్రమాలకు ప్రోత్సహిస్తున్నారని, దాడులకు సంబంధించిన సమాచారం ముందే లీక్ చేస్తున్నారంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా అవాస్తవాలు రాస్తున్నారు.



అంబాజీపేట వారపు సంత..

'ముక్క'నుమ

- కనుమ రోజున కిటకిటలాడిన వారపు, రోజువారీ సంతలు
- కొండెక్కిన మాంసాహారం ధరలు
- 'కోజ'కు డిమాండ్ అంతాఇంతా కాదు

సాక్షి, అమలాపురం: గోదావరి జిల్లాల్లో అతిథ్యం గురించి తెలియని వారుండరు. సంక్రాంతి పండుగలో ఇక్కడ చేసే అతిథి మర్యాదలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. సంప్రదాయ వంటలే కాదు.. మాంసాహారానికి సైతం గోదావరి జిల్లా పెట్టింది పేరు. కోడి, నాటుకోడి, మేక మాంసంతో పాటు సీజన్‌లో దొరికే చేపలు.. రొయ్యలు.. పీతలు వంటి గోదావరి, సముద్రం, చెరువుల్లో దొరికే ఉత్పత్తుల రుచులు చూడాల్సిందే. వాటితో తయారు చేసే వివిధ రకాల వంటకాలతో గోదావరి జిల్లాల్లో వంటలు సంక్రాంతి పండుగలో నాలుగో రోజు కనుమ నాడు ప్రతి ఇంటా ఘుమఘుమలాడాయి. భోగి, సంక్రాంతి రోజుల్లో పిండి వంటలు, శాఖాహారానికి పరిమితమయ్యే మాంసహారులు కనుమ, ముక్కనుమ నాడు జిహ్వ చాపల్యానికి పదును పెట్టారు.

సముద్ర ఉత్పత్తుల్నీ రుచి చూశారు

సముద్రంలో లభ్యమయ్యే పండుగొప్ప, కొయ్యింగ, చందువా, కోన, బుమ్మిడి చుక్క, బొమ్మిడాయిలు, ఎర్ర గులిగింతలు, టైగర్ రొయ్యలు, నదీపాయలు, కాలువల్లో దొరికే శాక రొయ్య (తెల్ల రొయ్య), మండపీత, పచ్చ పీతకు డిమాండ్ పెరిగింది. వీటితో చేసే వేపుళ్లు, పులుసులు, కుర్మాలు, కూరగాయలు కలిపి చేసే ప్రత్యేక వంటకాలను అతిథులకు వడ్డించారు. కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఏలూరు వంటి ప్రధాన మార్కెట్‌లతోపాటు అంబాజీపేట, మురమళ్ల వంటి వారపు సంతలు, వివిధ ప్రాంతాల్లోని రోజువారీ సంతలు మాంసహార కొనుగోలుదారులతో మంగళ, బుధవారాలు పోటెత్తాయి. ఈ డిమాండ్ చూసి అమ్మకందారులు సైతం రేట్లు రెట్టింపు చేశారు. సాధారణ రోజుల్లో కిలో రూ.600 నుంచి రూ.700 వరకూ పలికే చందువా చేప రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకూ పలికింది. కొయ్యింగల ధర రూ.250 నుంచి రూ.600కి పెరిగింది. పండగొప్ప కిలో రూ.450 నుంచి రూ.600 వరకూ ఉండగా.. ఇప్పుడు రూ.700 నుంచి రూ.900 వరకూ ఉంది. కిలో రూ.400 ఉండే టైగర్ రొయ్య రూ.600 వరకూ పెరిగింది. గోదావరి రొయ్యలు కిలో రూ.300 వరకూ ఉండగా.. ఇప్పుడు రూ.500 పలికింది. రెండు రోజులపాటు ఇక్కడ తినడమే కాదు.. వెంట తీసుకెళ్లేందుకు సైతం అధికంగా మాంసాహారాలు కొనుగోలు చేశారు. భీమవరం, తణుకు, ఆత్రేయపురం, అమలాపురం, అల్లవరం ప్రాంతాలలో దొరికే మాంసాహార పచ్చళ్లకు సైతం గిరాకీ ఏర్పడింది.

'కోజ'కు మరింత డిమాండ్

పందేల్లో చనిపోయిన పందెం కోడి పుంజు (కోజ)లకు డిమాండ్ ఏర్పడింది. ఏడాదిపాటు మటన్, గుడ్డు, బాదం, ఎండు ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్‌తోపాటు చోళ్లు, గంట్లు వంటి వాటితో మేపడం వల్ల వీటికి ప్రత్యేక రుచి వస్తోంది. దీనివల్ల కోజ మాంసానికి మంచి డిమాండ్ ఉంది. చిన్న చిన్న పందేలు జరిగేచోట చనిపోయిన కోజ ధర కిలో రూ.1,500 నుంచి రూ.3 వేల వరకూ పలికింది. భీమవరం, మలికిపురం, మురమళ్ల వంటి పెద్ద బరులు ఉన్నచోట ప్రత్యేకంగా మేత, శిక్షణ ఇచ్చి కోజ ధర రూ.ఐదారు వేల వరకూ ఉంది. కోజ మాంసంతో వేపుడు, కూరలతోపాటు ప్రత్యేకంగా బిర్యానీలు కూడా చేసి అమ్మకాలు చేసే హోటళ్లు గోదావరి జిల్లాలో ఉన్నాయి.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పేదల ప్రాణానికి పెద్ద దన్ను



ఆటోయే మా జీవనాధారం. మన్యం జిల్లా పార్వతీపురంలో నేను ఆటో నడపడం ద్వారా వచ్చిన ఆదాయంతో పాటు నా భార్య టైలరింగ్ చేయడం ద్వారా కొంత సంపాదిస్తోంది. దాంతో కుటుంబాన్ని గుట్టుగా పోషించుకుంటున్నాం. వచ్చిన ఆదాయంలోనే ఒక వైపు ఇన్సూరెన్స్, వివిధ మరమ్మతు పనులు వంటివి కూడా చేసుకోవాలి. మిగిలిన దాంతో జీవించాలి. ఇంతలో పులిమీద పుట్రలా 2019లో ఒకరోజు ఉన్నట్టుండి ఛాతిలో నొప్పి రావడంతో వైద్యులను సంప్రదించాను. గుండెలో మూడు రక్తనాళాలు మూసుకుపోయినట్లు గుర్తించారు. బైపాస్ సర్జరీ తప్పనిసరిగా చేయాలని చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్న నాకు సర్జరీ అంటే భయం వేసింది. ఇక బతకనేమోనన్న భయం పట్టుకుంది. నా కుటుంబం గురించి ఆలోచించే సరికి ప్రాణం విలవిలలాడింది. ఆ సమయంలో స్నేహితుల సలహాతో విశాఖ మెడికవర్ ఆస్పత్రికి వెళ్లగా.. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రెండున్నర లక్షల రూపాయల ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు. ఏడాదికి సరిపడా మందులు ఇచ్చి కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ఆ సమయంలో కుటుంబ పోషణ నిమిత్తం రెండు నెలలకు రూ.10,000 అందజేశారు. నెమ్మదిగా కోలుకున్నాను. ఇప్పుడు మళ్లీ ఆటో నడుపుకోగలుగుతున్నా. ఏటా నాకు వాహన మిత్ర ద్వారా రూ.10 వేలు అందుతోంది. నా కుమార్తె హిమబిందు నాలుగో తరగతి చదువుతోంది. ఆమెకు అమ్మ ఒడి పథకం వర్తించింది. ఏటా రూ.15 వేలు వంతున నా భార్య ఖాతాలో నగదు జమవుతోంది. టైలరింగ్ చేస్తుండటం వల్ల ఆమెకు చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10 వేలు అందుతోంది. మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. నిర్మాణం పురోగతిలో ఉంది. మాలాంటి పేద బతుకులకు ఈ ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

– పొందూరు విజయ్‌కుమార్, పార్వతీపురం
(ఆశపు జయంత్‌కుమార్, విలేకరి, పార్వతీపురం రూరల్)

అప్పు చేయకుండా చేపల వ్యాపారం



మేం మత్స్యకారులం. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం పశువుల్లంక గ్రామంలో చేపలతోపాటు ఎండు చేపలు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. జగన్ వచ్చిన తర్వాత నాకు ఏటా క్రమం తప్పకుండా చేయూత పథకం ద్వారా డబ్బులొస్తున్నాయి. ఏడాదికి రూ.18,750 చొప్పున ఇంత వరకు రూ.56,250 వచ్చింది. ఆ డబ్బునే పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేస్తున్నా. రేవు వద్ద చేపలుకొని మార్కెట్‌లో అమ్ముకుంటున్నా. పెట్టుబడికి అప్పులు చేయాల్సిన అవసరం లేదు. గతంలో మూడు రూపాయల వడ్డీకి తెచ్చుకొని చేపలు కొనుక్కుని, అమ్ముకునే వాళ్లం. లాభం చాలా వరకు వడ్డీలకే వెళ్లిపోయేది. ఇప్పుడు వడ్డీ బాధ లేదు. పేదల కోసం ఆలోచించే వ్యక్తి జగన్. అందుకే మా లాంటి వాళ్లం సంతోషంగా ఉంటున్నాం. వైఎస్సార్ ఆసరా కింద రూ.60 వేలు వచ్చింది. మా ఆయనకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. దీంతో మా కుటుంబం హాయిగా జీవిస్తోంది.

– ఓలేటి మంగాయమ్మ, పశువుల్లంక
(డీవీవీ సుబ్బారావు, విలేకరి, ఐ పోలవరం)

మాలాంటోళ్లకు ఈ ప్రభుత్వమే దిక్కు



మాది చాలా పేద కుటుంబం. నా వయసు 66 సంవత్సరాలు. విశాఖపట్నం మురళీనగర్‌లోని ఎన్‌జీవోస్ కాలనీలో ఉంటున్నాము. నేను గతంలో రజక వృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించే వాడిని. నాకు ఐదారేళ్ల కిందట కీళ్ల సమస్య రావడంతో కదలలేని పరిస్థితి ఏర్పడింది. మంచాన పడ్డ నన్ను ఎవరైనా లేవదీసి కూర్చోబెట్టినా ఒక్క నిమిషం కూడా ఉండలేకపోతున్నాను. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా రాలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక నా దీనస్థితిని తెలుసుకున్న వలంటీర్ ఇంటికి వచ్చి మరీ పింఛన్‌కు దరఖాస్తు చేయించారు. వెంటనే మంజూరైంది. ప్రస్తుతం నాకు ప్రతి నెలా ఒకటో తారీఖునే పింఛను వస్తోంది. ఈ నెల నుంచి రూ.3 వేలు ఇస్తున్నారు. ఈ సొమ్ము మా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంది. నా భార్య నారాయణమ్మ ఇళ్లల్లో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. పెళ్లీడుకు వచ్చిన కూతురు మంగమ్మ ఉంది. మాకు ఆర్థిక స్తోమత లేక, ఆమె మానసిక పరిస్థితి బాగోలేక పెళ్లి చేయలేకపోయాం. ఆరోగ్యశ్రీ కార్డు కూడా వచ్చింది. పైసా ఖర్చు లేకుండా చికిత్స చేయించుకోగలుగుతున్నాం. రేషన్ కార్డుపై ఉచితంగా బియ్యం ఇస్తున్నారు. మా లాంటి వారి కోసం శ్రద్ధ తీసుకుంటున్న ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– గుమ్మిడి కనకం, విశాఖపట్నం
(కసిరెడ్డి సూర్యకుమారి వెంకట్, విలేకరి, మురళీనగర్)

సీఎంతో జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ భేటీ



సీఎం వైఎస్ జగన్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో జాతీయ ఎస్సీ కమిషన్ వైస్‌చైర్మన్ అరుణ్ హల్దర్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా అరుణ్‌ను సీఎం జగన్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న హల్దర్ మర్యాదపూర్వకంగా సీఎంతో భేటీ అయ్యారు.
- సాక్షి,అమరావతి

నేడు హైదరాబాద్‌కు సీఎం జగన్

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం హైదరాబాద్ వెళ్లనున్నారు. సోదరి షర్మిల కుమారుడి వివాహ నిశ్చితార్థ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. సాయంత్రం 6.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకుంటారు, అక్కడ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో జరిగే నిశ్చితార్థ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం రాత్రికి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల నిర్ధారణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాలు, పదోన్నతుల్లో మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు, క్రీడాకారుల రిజర్వేషన్లు నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏపీ సబార్డినేట్ సర్వీస్ నిబంధనల్లో సవరణలు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) కార్యదర్శి సిఫారసుతో దివ్యాంగులకు కేటాయించిన 4 శాతం క్షితిజ సమాంతర (హారిజాంటల్) రిజర్వేషన్‌లో ఒక్క శాతాన్ని అంధత్వం, తక్కువ దృష్టి ఉన్నవారు, చెవుడు, సెరిబ్రల్ పాల్సీ, లెప్రసీ నయమైన వారు, మరుగుజ్జు, యాసిడ్ దాడి బాధితులు, కండరాల బలహీనత ఉన్న వారు, ఆటిజం, మేధో వైకల్యం, నిర్దిష్ట అభ్యాస వైకల్యం, మానసిక అనారోగ్యం ఉన్నవారికి కేటాయించారు. ఈ రిజర్వేషన్లు 2023 ఆగస్టు 2 నుంచి వర్తించనున్నాయి. ఓపెన్ కేటగిరీల్లో ఇబ్బందులు తలెత్తకుండా సర్వీస్ నిబంధనల్లో సవరణలు చేసినట్టు పేర్కొన్నారు.

పేద అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్

- నేడు ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్
- తొలి దఫా 4,07,323 మందికి రూ.46.90 కోట్లు...



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదింటి అక్క చెల్లెమ్మలకు తోబుట్టువుగా వారి సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రికార్డు స్థాయిలో నివేశన స్థలాలను పంపిణీ చేయడంతోపాటు ఇళ్లను మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయడంతోపాటు రాయితీపై సామగ్రి అందిస్తున్నారు. ఇళ్ల లబ్ధిదారులు బ్యాంకు నుంచి పొందిన రుణాలకు వడ్డీని కూడా రీయింబర్స్‌మెంట్ చేయనున్నారు. తొలి విడత లబ్ధిదారులకు వడ్డీని గురువారం రీయింబర్స్‌మెంట్ చేయనున్నారు.

పేదలకు పావలా వడ్డీ.. ఆపై భారం భరిస్తున్న ప్రభుత్వం

సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 71,811.50 ఎకరాల విస్తీర్ణంలో 31లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మల పేరిట పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు చొప్పున ఇవ్వడమే కాకుండా, ఉచితంగా ఇసుక సరఫరా ద్వారా రూ.15 వేలు, సిమెంట్, స్టీలు, మెటల్ ఫ్రేమ్స్, ఇతర నిర్మాణ సామగ్రిని తక్కువ ధరకే అందించడంతో మరో రూ.40 వేల మేర లబ్ధి కల్పిస్తున్నారు. పావలా వడ్డీకే రూ.35వేలు చొప్పున బ్యాంకు రుణం అందిస్తున్నారు. ఇలా మొత్తంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.2.70 లక్షలు చొప్పున లబ్ధి చేకూరుస్తున్నారు. దీనికి అదనంగా మరో రూ.లక్షకు పైగా ప్రతి ఇంటిపై మౌలిక వసతులకు ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతుండగా, ఇప్పటికే 8.6 లక్షలకు పైగా ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించింది. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కాగా, ఇప్పటి వరకు 12.77 లక్షల మంది లబ్ధిదారులకు రూ.4,500.19 కోట్లు బ్యాంకు రుణాల ద్వారా అందించారు. బ్యాంకులు 9 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్నాయి. అయినా అక్కచెల్లెమ్మలపై భారం పడకుండా పావలా వడ్డీకే రుణాలు అందిస్తూ ఆపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దఫా అర్హులైన 4,07,323 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.46.90 కోట్లను గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇలా సంవత్సరంలో రెండు పర్యాయాలు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందించనుంది.

నెలలోగా ఉమ్మడి ప్రాజెక్టులు

కృష్ణా బోర్డు చేతికి

కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ప్రతిపాదనకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అంగీకారం

- వారంలోగా ప్రాజెక్టుల అప్పగింత విధానాన్ని ఖరారు చేయాలని త్రిసభ్య కమిటీకి ఆదేశం
- 15 రోజుల్లోగా రెండు రాష్ట్రాల కార్యదర్శులతో సమీక్షిస్తానని దేబశ్రీ ముఖర్జీ వెల్లడి
- శ్రీశైలం, సాగర్‌లో 15 అవుట్‌లెట్స్‌ను నెలలోగా బోర్డుకు అప్పగించాలని ఆదేశం
- కేంద్ర జల్ శక్తి శాఖ ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం
- నవంబర్ 29కి ముందు సాగర్‌లో ఉన్న యథాస్థితిని కొనసాగించాలన్న తెలంగాణ ప్రతిపాదనకు తిరస్కరణ



సాక్షి, అమరావతి: కృష్ణా నదిపై ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌ను నెలలోగా కృష్ణా బోర్డుకు అప్పగించాలని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ చేసిన ప్రతిపాదనకు రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు అంగీకరించారు. ఈ రెండు ప్రాజెక్టుల్లో ఏపీ భూభాగంలోని 6, తెలంగాణ భూభాగంలోని 9 అవుట్‌లెట్లను బోర్డుకు అప్పగించే విధానం (హ్యాండింగ్ ఓవర్ ప్రోటోకాల్)ను వారంలోగా ఖరారు చేయాలని కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే, రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు సభ్యులుగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీకి దేబశ్రీ ముఖర్జీ చెప్పారు. త్రిసభ్య కమిటీ ఖరారు చేసిన విధానంపై 15 రోజుల్లోగా రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ముఖ్య కార్యదర్శులతో సమీక్షించి, ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈమేరకు బుధవారం ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ బల్లా ఆదేశాల మేరకు కృష్ణా జలాల వివాదానికి తెరదించేందుకు దేబశ్రీ ముఖర్జీ ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ మురళీధర్, కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్ కుమార్, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం ఆదేశాల మేరకు డిసెంబర్ 1 నుంచి సీఆర్పీఎఫ్ పహారాలో సాగర్‌ను నిర్వహిస్తున్నామని, ఈ నెలలో కుడి కాలువ ద్వారా ఏపీకి 5 టీఎంసీలు విడుదల చేశామని కృష్ణా బోర్డు చైర్మన్ శివన్‌నందన్ కుమార్ వివరించారు.

వెనకడుగు కాదు.. ముందడుగే

కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశించే వరకూ శ్రీశైలం నిర్వహణను ఏపీకి, సాగర్ నిర్వహణను తమకు అప్పగించారని తెలంగాణ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా చెప్పారు. ఏపీ భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను నవంబర్ 30న అక్రమంగా ఆ రాష్ట్ర అధికారులు స్వాధీనం చేసుకున్నారని, సాగర్‌పై నవంబర్ 29 నాటికి ఉన్న యథాస్థితిని కొనసాగించాలని కోరారు. దీనిపై రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తమ నిర్వహణలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని 2014లో అధీనంలోకి తీసుకున్నప్పటి నుంచి నవంబర్ 30 వరకూ తొమ్మిదేళ్లపాటు తెలంగాణ సర్కారు తమ హక్కులను కాలరాసిందని, హక్కుల పరిరక్షణ కోసమే మా భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగం, కుడి హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు. దీనిపై దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ వెనకడుగు కాదు ముందడుగు వేస్తామని స్పష్టం చేశారు. తొలుత సాగర్ నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగిస్తామని, ఆ తర్వాత ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై నిర్ణయం తీసుకుంటామంటూ చేసిన ప్రతిపాదనను ఏపీ అధికారులు సున్నితంగా తోసిపుచ్చారు. సాగర్‌ను మాత్రమే బోర్డుకు అప్పగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. సాగర్, శ్రీశైలంను ఒకేసారి కృష్ణా బోర్డుకు అప్పగిస్తేనే రెండు రాష్ట్రాల హక్కులను పరిరక్షించవచ్చునని సూచించారు. ఇందుకు తెలంగాణ అధికారులు కూడా అంగీకరించారు. దాంతో శ్రీశైలం, సాగర్‌ను కృష్ణా బోర్డుకు ఒకే సారి అప్పగించడానికి కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అంగీకరించారు.

రూ.8.5 కోట్లు అధికంగా ఇచ్చిన రాష్ట్రం

కృష్ణా బోర్డు నిర్వహణకు రెండు రాష్ట్రాలు నిధులు విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నాయని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శికి బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ వివరించారు. దీనిపై ఏపీ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ స్పందిస్తూ.. తెలంగాణకంటే తాము రూ.8.5 కోట్లు అధికంగా ఇచ్చామని చెప్పారు. తెలంగాణ వాటా నిధులు ఇచ్చాకే తాము కూడా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. తక్షణమే వాటా నిధులు విడుదల చేయాలని తెలంగాణ అధికారులను దేబశ్రీ ముఖర్జీ ఆదేశించారు.

అప్పగింత తర్వాత నిర్వహణ నియమావళి

కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ రెండున్నరేళ్లైనా అమల్లోకి రాకపోవడంపై దేబశ్రీ ముఖర్జీ అసహనం వ్యక్తంచేశారు. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి, రెండు రాష్ట్రాల ఈఎన్‌సీల నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ వారంలోగా శ్రీశైలం, సాగర్‌లలోని 15 అవుట్‌లెట్లను బోర్డుకు అప్పగించే విధానాన్ని ఖరారు చేయాలని ఆదేశించారు. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయనందున, ప్రాజెక్టుల నిర్వహణ నియమావళి (ఆపరేషన్ ప్రోటోకాల్)ని ఖరారు చేయలేమని తెలంగాణ అధికారులు చెప్పారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చాక ఆపరేషన్ ప్రోటోకాల్‌ను ఖరారు చేయాలని వారు చేసిన సూచనను సీడబ్ల్యూసీ చైర్మన్ వ్యతిరేకించారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు కేటాయింపుల ఆధారంగానే 2015లో రెండు రాష్ట్రాలకు నీటిని పంపిణీ చేస్తూ తాత్కాలిక సర్దుబాటు చేశామని, వాటికి అనుగుణంగానే శ్రీశైలం, సాగర్ ఆపరేషన్ ప్రోటోకాల్ ముసాయిదా రూపొందించామని వివరించారు. దీనిపై దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ.. ప్రాజెక్టుల అప్పగింత తర్వాత ఆపరేషన్ ప్రోటోకాల్ ఖరారుపై నిర్ణయం తీసుకుందామని చెప్పారు.

కృష్ణా జలాలపై హక్కుల పరిరక్షణలో..

ఫలించిన సీఎం జగన్ కృషి

ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగింతకు కేంద్రం నిర్ణయం.. తెలంగాణ అక్రమ నీటి వినియోగానికి అడ్డుకట్ట

- రెండు రాష్ట్రాల హక్కులు పరిరక్షణ.. ఇరు రాష్ట్రాలకు ప్రయోజనం
- హక్కులను నాడు చంద్రబాబు తెలంగాణ సర్కార్‌కు తాకట్టు
- ఓటుకు కోట్లు కేసు, తెలంగాణలో పార్టీ కోసం నాడు రాష్ట్ర ప్రయోజనాలు గాలికి
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిరక్షించారంటూ నిపుణుల ప్రశంసలు



సాక్షి, అమరావతి: కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా చేస్తున్న పోరాటం, కృషి ఫలించాయి. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను నెలలోగా కృష్ణా బోర్డుకు అప్పగించాలని కేంద్రం నిర్ణయించింది. దాంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తెలంగాణ ప్రభుత్వ అక్రమ నీటి వినియోగానికి అడ్డుకట్ట పడుతుంది. దీనివల్ల మన రాష్ట్రానికే కాదు.. తెలంగాణకూ ప్రయోజనమే. రెండు రాష్ట్రాల హక్కులకు విఘాతం కలగదు. కృష్ణా జలాలపై హక్కుల పరిరక్షణలో సీఎం వైఎస్ జగన్ చూపిన చొరవ, పట్టుదలను నీటి పారుదల రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఆనాడు ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకోవడం, రెండు కళ్ల సిద్ధాంతంతో కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను చంద్రబాబు తెలంగాణ సర్కార్‌కు తాకట్టు పెట్టారని, నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిరక్షించారని నిపుణులు కొనియాడుతున్నారు.

హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టిన చంద్రబాబు

రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చేసేందుకు విభజన చట్టం ద్వారా 2014లో కేంద్రం కృష్ణా బోర్డును ఏర్పాటుచేసింది. బోర్డు పరిధిని నోటిఫై చేసే దాకా ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలంను ఏపీ, నాగార్జునసాగర్‌ను తెలంగాణ నిర్వహించాలని నిర్దేశించింది. దాంతో తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్‌ను 2014–15లో పూర్తిగా ఆధీనంలోకి తీసుకుంది. శ్రీశైలంలో మాత్రం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం తెలంగాణలో ఉందనే సాకు చూపి దాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. అదే సాకు చూపి పులిచింతల విద్యుత్ కేంద్రాన్ని కూడా ఆధీనంలోకి తీసుకుంది. అయినా సరే.. ఆనాటి ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కనీస ప్రయత్నం చేయలేదు. ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకోవడం, తెలంగాణలోనూ టీడీపీని బతికించుకోవాలన్న స్వార్థంతో రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెట్టేశారు.

- శ్రీశైలం ప్రాజెక్టులో 881 అడుగుల స్థాయిలో నీటి మట్టం ఉన్నప్పుడు మాత్రమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కుల నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు తరలించవచ్చు. నీటి మట్టం 854 అడుగుల స్థాయిలో ఉంటే ఆరేడు వేల క్యూసెక్కులే తరలించడానికి సాధ్యమవుతుంది. అంతకంటే నీటి మట్టం తగ్గితే శ్రీశైలంలో నీటి కోటా ఉన్నా సరే సీమ అవసరాలకు నీటిని వినియోగించలేని దుస్థితి. శ్రీశైలం ప్రాజెక్టులో 796 అడుగుల నుంచే రోజుకు 4 టీఎంసీలను తరలించే సామర్థ్యం తెలంగాణకు ఉంది. తెలంగాణకు దిగువన నీటి అవసరాలు లేకపోయినా కృష్ణా బోర్డు అనుమతి తీసుకోకుండానే ఎడమ గట్టు కేంద్రం నుంచి విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలంలో నీటిమట్టం తగ్గేలా ఆ ప్రభుత్వం చేస్తోంది. తద్వారా శ్రీశైలంలో ఏపీ వాటా జలాలు వినియోగించుకోకుండా చేస్తోంది.
- 2015లో ఇదే రీతిలో శ్రీశైలం నుంచి సాగర్‌కు తెలంగాణ తరలించిన నీటిని.. కుడి కాలువ కింద సాగు అవసరాల కోసం విడుదల చేయాలని అప్పటి రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ చేసిన విజ్ఞప్తిని తెలంగాణ తోసిపుచ్చింది. దాంతో రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో 13 గేట్లతోపాటు కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకుని, రాష్ట్ర హక్కులను పరిరక్షించడానికి 2015, ఫిబ్రవరి 13న పోలీసులతో కలిసి ఆదిత్యనాథ్ దాస్ నాగార్జునసాగర్‌కు వచ్చారు. అయితే ఆనాటి సీఎం చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతంతో రాజకీయంగా లబ్ధి పొందాలనే లక్ష్యంతో.. వాటిని స్వాధీనం చేసుకోకుండా తక్షణమే వెనక్కి రావాలని ఆదిత్యనాథ్‌ను ఆదేశించారు. తద్వారా కృష్ణా జలాలపై రాష్ట్రం హక్కులు కోల్పోయేలా చేశారు.
- శ్రీశైలం నుంచి 800 అడుగుల నుంచే రోజుకు 2 టీఎంసీలు తరలించేలా పాలమూరు, డిండి ఎత్తిపోతలతోపాటు కల్వకుర్తి, నెట్టెంపాడు సామర్థ్యం పెంచి.. సుంకేశుల బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో తుమ్మిళ్ల ఎత్తిపోతల, భక్తరామదాస ఎత్తిపోతలను తెలంగాణ సర్కార్ అక్రమంగా చేపట్టింది. వీటి ద్వారా కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణ హరించివేస్తున్నా ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకోవడం కోసం నాటి సీఎం చంద్రబాబు పట్టించుకోలేదు.

హక్కుల పరిరక్షణ కోసం సీఎం జగన్ రాజీలేని పోరాటం

వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తున్నారు. కృష్ణాపై తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టులను నిలిపేయాలని కేంద్రానికి ఫిర్యాదు చేశారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాల సాగు, తాగు నీటి అవసరాలు తీర్చడానికి తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల స్థాయిలో నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌లోకి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసేలా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. దీనిపై ఇరు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తింది. దీన్ని పరిష్కరించడానికి 2020 అక్టోబర్ 6న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రానికి హక్కుగా దక్కిన నీటిని వినియోగించుకోవడం కోసమే రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టామని సీఎం జగన్ చెప్పారు. తెలంగాణ చేపట్టిన అక్రమ ప్రాజెక్టులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలను నిలిపివేసేలా తెలంగాణను ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

- 2021లో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద ప్రవాహం ప్రారంభం కాకుండానే తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి ప్రారంభించింది. ఇక్కడి నుంచి నీటిని సాగర్‌కు తరలిస్తోంది. ఇలా శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేస్తూ రాష్ట్ర హక్కులను హరిస్తుండటంతో సీఎం వైఎస్ జగన్ న్యాయపోరాటానికి దిగారు. కృష్ణా బోర్డు పరిధిని నోటిఫై చేయడం ద్వారా అక్రమంగా విద్యుదుత్పత్తి చేయకుండా తెలంగాణను కట్టడి చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దాంతో కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్ర జల్ శక్తి శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి ప్రాజెక్టులను ఏడాదిలోగా బోర్డుకు అప్పగించాలని కేంద్రం ఆదేశించింది. శ్రీశైలం, సాగర్‌లో రాష్ట్ర భూభాగం పరిధిలోని ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైనా, తెలంగాణ సర్కారు తన భూభాగంలోని ప్రాజెక్టులను అప్పగించేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వే 13 గేట్లతోపాటు కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను రాష్ట్రానికి అప్పగించాలని, లేదంటే ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.
- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గతేడాది అక్టోబర్ 6న కృష్ణా బోర్డు ఏపీకి కేటాయించిన 30 టీఎంసీల్లో 17 టీఎంసీలను ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ నాగార్జున సాగర్‌కు తెలంగాణ తరలించింది. ఆ 17 టీఎంసీలను గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాలకు సాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేయాలని రాష్ట్ర అధికారుల విజ్ఞప్తులను తెలంగాణ పట్టించుకోలేదు. ఇదే అంశాన్ని సీఎం జగన్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు వివరించారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత కేంద్రం రాష్ట్రానికి అప్పగిస్తే.. తమ భూభాగంలో ఉందని ఎడమ గట్టు విద్యుత్కేంద్రాన్ని తెలంగాణ తన ఆధీనంలోకి తీసుకుందని.. అదే తరహాలో రాష్ట్ర భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్ స్పిల్ వే 13 గేట్లతోసహా కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఆధీనంలోకి తీసుకుని, నీటిని విడుదల చేయాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశించారు. దాంతో నవంబర్ 30 తెల్లవారుజామున సీఈ మురళీనాథ్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర పోలీసులు, జలవనరుల అధికారులు రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగాన్ని, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాగునీటి అవసరాల కోసం కుడి కాలువకు 2,300 క్యూసెక్కులు విడుదల చేశారు. దీనిపై సర్కారు కేంద్రానికి ఫిర్యాదు చేసింది. దాంతో సీఎం జగన్ ఆది నుంచి చేస్తున్న డిమాండ్ మేరకు ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు కేంద్రం అంగీకరించింది.

అప్పుడన్నీ అగచాట్లు.. ఇప్పుడన్నీ ఉన్న ఊళ్లోనే..

నాడు

- విత్తనాలు, ఎరువుల కోసం అన్నదాతలకు అన్నీ ఇక్కట్లే
- పనులు మానుకొని ముందు రోజు పంపిణీ కేంద్రానికి పయనం
- ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పడిగాపులు
- టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికి, కాస్త పలుకుబడి ఉన్న వారికే పెద్దపీట
- పెద్దోళ్లకు ఇవ్వగా మిగిలితేనే అరకొరగా సన్న, చిన్నకారు రైతులకు ఇచ్చేవారు
- సీజన్‌లో కనీసం నాలుగైదు సార్లు తిరగాల్సిన దుస్థితి
- వెళ్లిన ప్రతిసారి దూరాబారాన్ని బట్టి తక్కువలో తక్కువగా రూ.200 ఖర్చు
- దొరికితే ఎరువుల కట్ట(బస్తా) గ్రామానికి తెచ్చేందుకు అదనంగా రూ.20–30 ఖర్చు
- అవసరం లేకున్నా వారు చెప్పిన పురుగుల మందులు కొనాల్సిందే
- మండుటెండకు పలువురికి అస్వస్థత.. మృత్యువాత
- పర్లాంగుల కొద్దీ క్యూ.. తొక్కిసలాట.. లాఠీచార్జి
- టీడీపీ ప్రభుత్వ ఐదేళ్లలో రూ.1,230 కోట్ల విలువైన 47.64 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ


2019 మే నెలలో వైఎస్సార్ జిల్లాలోని ఓ సొసైటీ వద్ద శనగ విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

నేడు

- ఎండకు మాడిపోవాల్సిన పని లేదు.. వానకు తడవాల్సిన అవసరం లేదు
- గ్రామ స్థాయిలో 10,778 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు
- అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, ఆక్వా ఫీడ్, పశు గ్రాసం, సంపూర్ణ మిశ్రమ దాణా.. ఇలా ఏది కావాలన్నా బుక్ చేసుకున్న 24 గంటల్లోనే ఆర్బీకేల ద్వారా సరఫరా


సీజన్ ప్రారంభానికి ముందే ఆర్‌బీకే ద్వారా పంపిణీ చేస్తున్న శనగ విత్తనాలు

- సీజన్‌కు ముందుగానే అగ్రి ల్యాబ్స్‌లో సర్టిఫై చేసి మరీ పంపిణీ
- సీజన్‌లో విత్తనాలు, ఎరువులు దొరుకుతాయో లేదోననే బెంగేలేదు
- నకిలీల ఊసు లేదు.. నాసిరకం మాట లేదు.. బ్లాక్‌మార్కెటింగ్ జాడ లేదు..
- ఏ ఊళ్లో చూద్దామన్నా మచ్చుకైనా కనిపించని రైతుల క్యూ
- 70.88 లక్షల మంది రైతులకు 41.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ
- ఏకంగా రూ.1,209 కోట్ల రాయితీ
- అందుబాటులో వరి, అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, పచ్చిరొట్ట విత్తనాలు.. పత్తి, మిరప వంటి నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా
- 30 వేల మందికి సర్టిఫైడ్ పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, సజ్జ, సోయాబీన్ వంటి నాన్ సబ్సిడీ విత్తనాలు
- 31.54 లక్షల మంది రైతులకు రూ.1,312 కోట్ల విలువైన 11.88 లక్షల టన్నుల ఎరువులు
- ఉన్న ఊళ్లోనే ఇవ్వడంతో ఒక్కో బస్తాపై రూ.20–30 ఖర్చు ఆదా.. మొత్తంగా రైతులకు రూ.200 కోట్ల వరకు లబ్ధి. రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ, మార్కెట్ సమాచారం

మూడు ఇండిగో విమానాలు రద్దు



గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): వాతావరణం అనుకూలించకపోవడంతో మూడు ఇండిగో విమాన సర్వీసులను విమానయాన సంస్థ బుధవారం రద్దు చేసింది. ఇండిగో విమాన యాన సంస్థకు చెందిన 6ఈ 6336/5309 నంబర్ గల బెంగళూరు–విశాఖ–బెంగళూరు విమానం, 6ఈ 626/783 నంబర్ గల హైదరాబాద్–విశాఖ–హైదరాబాద్ విమానం, 6ఈ 5176/2776 నంబర్ గల ఢిల్లీ–విశాఖ–ఢిల్లీ విమానం రద్దు అయిన వాటిలో ఉన్నాయి.

ఏప్రిల్ నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

- నేటి నుంచి 20వ తేదీ వరకు ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్
- షెడ్యూల్ ప్రకటించిన టీటీడీ



తిరుమల: శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం ఏప్రిల్ నెల తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను టీటీడీ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏప్రిల్ నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం గురువారం ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు రుసుం చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవా టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. శ్రీవారి వార్షిక వసంతోత్సవం ఏప్రిల్ 21 నుంచి 23వ తేదీ వరకు జరుగనుంది. దీనికి సంబంధించిన సేవా టికెట్లను ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం, గదుల కోటాను ఉదయం 11 గంటలకు, వృద్ధులు, దివ్యాంగులకు దర్శన టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటాను ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో వసతి గదుల బుకింగ్ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. ఏప్రిల్ నెలకు సంబంధించి ఈ నెల 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతికి చెందిన శ్రీవారి సేవ కోటాను, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను, మధ్యాహ్నం ఒంటి గంటకు పరకామణి సేవ కోటాను విడుదల చేయనున్నారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి


గృహ నిర్మాణ సంస్థ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రులు

సాక్షి, అమరావతి: మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషి మరువలేనిదని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. ఇటీవల చైర్‌పర్సన్‌గా నియమితులైన ఆమె విజయవాడలోని సంస్థ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. షర్మిలారెడ్డికి మంత్రులు జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, సంస్థ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎండీ లక్ష్మీశా, జేఎండీ శివప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపటి నుంచి కులగణన

సాక్షి, అమరావతి: బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక, రాజకీయ సాధికారత కల్పిస్తూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ బాటలో నడుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే రోజు రెండు చరిత్రాత్మక ఘట్టాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల 19వ తేదీన విజయవాడ నగర నడిబొడ్డున ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్'ని ఆవిష్కరిస్తున్న రోజే రాష్ట్రంలో సంపూర్ణ కుల గణనకూ నాంది పలుకుతున్నారు. తద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అందించడం ద్వారా సంతృప్త స్థాయిలో ప్రయోజనం చేకూర్చేలా అడుగులు వేస్తున్నారు. బాబా సాహెబ్ ఆశయాలను నెరవేరుస్తూ చిత్తశుద్ధిని చాటుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ గతంలో వలంటీర్ల ద్వారా సేకరించిన డేటా ప్రకారం రాష్ట్రంలో గ్రామాల్లో 1,23,40,422 కుటుంబాలకు చెందిన 3,56,62,251 మంది నివాసం ఉంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో 44,44,887 కుటుంబాలలో 1,33,16,091 మంది నివసిస్తున్నారు. మొత్తం 1.67 కోట్ల కుటుంబాలకు సంబంధించి 4.89 కోట్ల మంది ఉన్నారు. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు శుక్రవారం నుంచి ఉమ్మడిగా వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి పది రోజులు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంబంధించిన వివరాలను కులాల వారీగా ఈనెల 28వతేదీ వరకు పది రోజుల పాటు సేకరించనున్నారు. ఇంటింటి కులగణన ప్రక్రియలో వివిధ కారణాలతో నమోదు చేసుకోకుండా మిగిలిన వారి కోసం ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు సంబంధిత కుటుంబాలకు చెందిన వారు ఎవరైనా ఒకరు వెళ్లి వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ, బీసీ, సాంఘిక సంక్షేమ శాఖలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల శాఖలు ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో కులగణన కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నాయి. కుల గణనకు సంబంధించి ఇప్పటికే వివిధ కుల సంఘాల ప్రతినిధులతో జిల్లాల వారీగా ప్రభుత్వం ప్రత్యేకంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించింది.

7 సచివాలయాల పరిధిలో పైలెట్ పూర్తి

రాష్ట్ర స్థాయి కులగణన నేపథ్యంలో ఆరు జిల్లాల్లో 7 సచివాలయాల పరిధిలో పైలెట్‌గా కులగణన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. 3,323 కుటుంబాలకు సంబంధించి 7,195 మంది వివరాలను నమోదు చేశారు. శ్రీకాకుళం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఎన్టీఆర్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడపతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొన్ని సచివాలయాల పరిధిలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో యాప్‌లో వివరాల నమోదుకు సిగ్నళ్లు లేనిచోట్ల ఆఫ్‌లైన్ విధానంలో సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగా 300–400 వరకు మారుమూల ప్రాంతాల్లో ఇలా సేకరించాల్సి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

726 కులాలు.. ప్రత్యేక యాప్

కులగణన ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. దాదాపు 723 కులాల జాబితాలను ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీల వారీగా వర్గీకరించి మొబైల్ యాప్‌లో అనుసంధానించారు. ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ సమయంలో ఆయా కుటుంబం ఏ కేటగిరిలోకి వస్తుందో యాప్‌లో సెలెక్ట్ చేయగానే కులాల జాబితా కనిపిస్తుంది. వారు వెల్లడించే వివరాల ప్రకారం కులగణన సిబ్బంది దాన్ని నమోదు చేస్తారు. ఓసీ, బీసీ, ఎస్టీ, ఎస్సీ కేటగిరీలో పేర్కొన్న 723 కులాలకు అదనంగా మరో మూడు కులాలు బేడ జంగం లేదా బుడగ జంగం, పిరమలై కల్లర్ (తేవర్), యలవ కులాలకు సంబంధించిన వారి వివరాలను వేరుగా అదర్స్ కేటగిరిలో సేకరించనున్నారు. వీటితో పాటు నో– క్యాస్ట్ కేటగిరీని కూడ కులగణన ప్రక్రియలో ఉపయోగించనున్నారు. కులగణన ప్రక్రియలో అత్యంత పారదర్శకంగా వివరాల నమోదు అనంతరం ఆ కుటుంబంలో ఎవరైనా ఒక వ్యక్తి నుంచి ఆధార్‌తో కూడిన ఈ–కేవైసీ తీసుకోనున్నారు. ఈ ప్రక్రియలో బయోమెట్రిక్, ఐరిస్ తదితర విధానాలకు అవకాశం కల్పించారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు సీజే


ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

తిరుమల: తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో తమిళనాడు మంత్రి స్వామినాథన్, ఏపీ ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులు, సినీ నటుడు శ్యామ్ తదితరులు ఉన్నారు.

అవినీతి అనకొండ బాబును జైల్లో పెట్టాలి

బహుజన నేతల డిమాండ్


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: వ్యవస్థలను తప్పుదారి పట్టిస్తూ.. బహుజనులకు తీరని ద్రోహం చేసిన గజదొంగ చంద్రబాబును వెంటనే అరెస్టు చేసి మళ్లీ జైల్లో పెట్టాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 1,207వ రోజుకు చేరాయి. పలువురు నేతలు మాటాడుతూ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న చంద్రబాబు ఆధారాలతో సహా దొరికినా.. తనపై తప్పుడు కేసు పెట్టారంటూ సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ వేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పల్లె బాబు, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో మైనారిటీలకు పెద్దపీట

'జగన్ పాలన–మైనారిటీల స్పందన' రాష్ట్ర ప్రజాస్థాయి సదస్సులో వక్తలు వెల్లడి


మాట్లాడుతున్న వీవీఆర్ కృష్ణంరాజు

నగరంపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని మైనారిటీలకు పెద్దపీట వేసినట్లు గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు అన్నారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన గుంటూరులోని తాలుకా పెన్షనర్స్ హాల్‌లో బుధవారం 'జగన్ పాలన–మైనారిటీల స్పందన' పేరిట రాష్ట్ర స్థాయి ప్రజా సదస్సు నిర్వహించారు. ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ 56 నెలల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం వివిధ పథకాల రూపంలో మైనారిటీలకు సుమారు రూ.26వేల కోట్ల నగదు బదిలీ చేసినట్లు చెప్పారు. వీటితోపాటు వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను కూడా మైనారిటీలకు అందించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మైనారిటీలది కీలకపాత్ర అని పేర్కొన్నారు. బెటర్ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, అయినా సమాజాన్ని తప్పుదోవపట్టించేందుకు ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. అంజుమన్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ మొయినుద్దీన్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి గొప్ప మేలు చేశారని కొనియాడారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఆచార్యులు శరత్ జ్యోత్స్నారాణి, రెవరెండ్ నవకుమార్, ఆంధ్రా అడ్వొకేట్స్ ఫోరం కన్వీనర్ బి.అశోక్ కుమార్, పొన్నూరు మసీదు కమిటీ ప్రచార కార్యదర్శి షేక్ అబ్దుల్ నాజర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కరిముల్లా తదితరులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఈ సదస్సులో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మేడిద జాన్సన్, రిటైర్డ్ ఎమ్మార్వో విక్టర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ అవయవాలు దానం

- రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా ఆనందపురం యువకుడి మృతి
- అవయవాలు దానం చేసిన రవికుమార్ తల్లిదండ్రులు
- విశాఖలోని కిమ్స్ ఐకాన్‌కు లివర్, కిడ్నీ, శ్రీకాకుళంలోని జెమ్స్‌కు మరో కిడ్నీ


జీవన్‌దాన్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రతినిధులు


రోణంకి రవికుమార్(ఫైల్)

శ్రీకాకుళం రూరల్/కాశీబుగ్గ: రోడ్డు ప్రమాదంలో చేతికి అందివచ్చిన బిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు పుట్టెడు దుఃఖంలోనూ అవయవదానానికి ముందుకొచ్చారు. మరో నలుగురికి జీవితాన్ని ప్రసాదించి ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే... శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం ఆనందపురం గ్రామానికి చెందిన రోణంకి రవికుమార్(28) వెల్డర్‌గా పనిచేసేవాడు. ఈ నెల 10న పలాసలోని బెండిగేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెదడులో నరాలు చిట్లిపోవడంతో ఈ నెల 15న కోమాలోకి వెళ్లిపోయాడు. ఇక బతకడం కష్టమని వైద్యులు తేల్చిచెప్పడంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా జెమ్స్ ఆస్పత్రిలోనే అవయవాలు ఇచ్చేందుకు తల్లిదండ్రులు నారాయణరావు, నారాయణమ్మ అంగీకరించారు. దీంతో రవికుమార్‌కు బుధవారం ఆపరేషన్ చేసి విజయవంతంగా అవయవాలను వేరుచేశారు. లివర్, కిడ్నీని విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి, మరో కిడ్నీని శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో వేరే వ్యక్తికి అమర్చారు. నేత్రాలను రెడ్‌క్రాస్‌కు తరలించారు. ఈ సందర్భంగా జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యం రవికుమార్ భౌతికకాయానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఐదోసారి అవయవదానానికి జెమ్స్ ఆస్పత్రి వేదికగా నిలిచిందని డైరెక్టర్ డాక్టర్ సుధీర్ తెలిపారు.

రానున్నది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- వైఎస్సార్‌సీపీతో పోలిస్తే టీడీపీ బలం 10 శాతం కూడా లేదు
- విజయవాడ ఎంపీ కేశినేని నాని



మాట్లాడుతున్న కేశినేని నాని. చిత్రంలో దేవినేని అవినాష్ తదితరులు

పటమట (విజయవాడ తూర్పు): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీనే అత్యంత మెజార్టీతో విజయం సాధించి తీరుతుందని విజయవాడ ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ ఉద్ఘాటించారు. బుధవారం విజయవాడ గురునానక్ నగర్‌లోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. కేశినేని నాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీకి ఉన్న బలంలో 10 శాతం కూడా టీడీపీకి లేదని, సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నాయని అన్నారు. భారీ మెజార్టీతో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా మళ్లీ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. చంద్రబాబుకు విజయవాడ పట్ల చిత్తశుద్ధి లేదని, రూ.వంద కోట్లు కూడా బెజవాడకు కేటాయించలేదని ధ్వజమెత్తారు. చెన్నై తరహాలో ఫ్లై ఓవర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఇస్తే బెంజి సర్కిల్ ఫ్లైఓవర్‌ను చంద్రబాబు చెడగొట్టారని, నేషనల్ హైవే అథారిటీస్ రికార్డుల్లో కూడా ఈ విషయం ఉందని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ కోసం రూ.460 కోట్లు కేటాయిస్తే అప్పటి మంత్రి నారాయణతో చెప్పి ప్రజారోగ్య విభాగానికి మళ్లించి విజయవాడకు అన్యాయం చేశారని అన్నారు. తామంతా విజయవాడ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజలకు ఏం కావాలన్నా సహకరిస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమకు హామీ ఇచ్చారన్నారు. నటనను చంద్రబాబు దగ్గర చూస్తే.. నిజాయితీని సీఎం వైఎస్ జగన్ దగ్గర చూశామన్నారు. బొప్పన భవకుమార్‌కు ఎప్పుడూ తాము అండగానే ఉన్నామని, తమతో ఆయనకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాశ్ మాట్లాడుతూ.. కేవలం పార్థసారథితో ఉన్న వ్యక్తిగత పరిచయాల కారణంగానే బొప్పన పార్టీని వీడారని పేర్కొన్నారు.

చిరుత దాడి.. రైతుకు స్వల్ప గాయాలు

అనంతపురం జిల్లాలో ఘటన


రాము వీపుపై చిరుత గాట్లు


గాయపడిన రైతు రాము

కళ్యాణదుర్గం: పొదలమాటున పొంచి ఉన్న చిరుత దాడిచేసిన ఘటనలో ఓ రైతు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. కుర్లపల్లికి చెందిన రాము తన పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. పంటకు స్ప్రింక్లర్లతో నీరు పెడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున పొలంలోకి వెళ్లి పైపులు మారుస్తున్నాడు. అప్పటికే పొదల మాటున పొంచి ఉన్న ఓ చిరుత వెనుక వైపునుంచి అకస్మాత్తుగా రాముపై దాడి చేసింది. వీపుపై గోర్లతో రక్కడంతో.. అతను బిగ్గరగా కేకలు వేస్తూ పరుగులు తీశాడు. సమీప పొలాల రైతులు కూడా పెద్దఎత్తున అరుపులు, కేకలు వేయడంతో చిరుత పొదల్లోకి వెళ్లిపోయింది. స్వల్పంగా గాయపడిన రైతును కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ షాన్‌వాజ్ బాధిత రైతును పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందితో కలిసి కుర్లపల్లి వద్ద చిరుత సంచరించిన ఆనవాళ్లను సేకరించారు. రాత్రి పూట రైతులు అప్రమత్తంగా ఉండాలని, తాము సిబ్బందితో గస్తీ నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

పోట్లగిత్తలతో పోటీపడ్డ యువత


దోర్నకంబాలలో దూసుకొస్తున్న ఎద్దు

చంద్రగిరి/పెనుమూరు/వెదురుకుప్పం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా చివరిరోజు పశువుల పండుగ కోలాహలంగా జరిగింది. గ్రామాల్లో ఎద్ద పందేలు హోరెత్తించాయి. పరుగులు తీస్తోన్న పోట్ల గిత్తలను లొంగదీసుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. తిరుపతి జిల్లాలోని దోర్నకంబాల, మండపం పల్లి, మల్లయ్యపల్లి గ్రామాల్లో బుధవారం పశువుల పండుగ జరిగింది. చిత్తూరు జిల్లాలోని ఎర్రమట్టిపల్లి, కురివికుప్పం, బ్రాహ్మణపల్లెలో పరుష పందేలు నిర్వహించారు. కోడెగిత్తల కొమ్ములకు కానుకలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. జనాన్ని చీల్చుకుంటూ పరుగులు తీస్తోన్న పోట్ల గిత్తల వేగాన్ని కట్టడి చేసి యువత బహుమతులను అందుకుని తమ వీరత్వాన్ని చాటుకున్నారు.

మహిళకు ఉచితంగా రూ.10 లక్షల విలువైన వైద్యం

ఆరోగ్య శ్రీ కింద చేసిన మెడికవర్ వైద్యులు


మాట్లాడుతున్న డాక్టర్లు రంగనామన్, బిందురెడ్డి

నెల్లూరు సిటీ: ఓ మహిళకు వైద్యులు రూ.10 లక్షల విలువైన వైద్యాన్ని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశారు. మహిళకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్లో విజయవంతంగా నిర్వహించినట్లు అంకాలజిస్ట్ డాక్టర్ రంగనామన్, మెడికల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి తెలిపారు. హాస్పిటల్లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..బోన్ కేన్సర్‌తో బాధపడుతున్న కర్నూలు జిల్లాకు చెందిన గోవిందమ్మ చికిత్స నిమిత్తం మెడికవర్ హాస్పిటల్లో చేరినట్లు చెప్పారు. ఆమెకు వైద్య పరీక్షలు చేసి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని కుటుంబ సభ్యులకు తెలిపామన్నారు. దీనికి రూ.8 లక్షల– రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని, వారి ఆర్థికస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా సర్జరీ చేశామన్నారు. మహిళ కోలుకుంటున్నట్లు చెప్పారు. రోగి కుటుంబసభ్యులు వైద్యులు, హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉదయం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. యాగశాలలో చండీశ్వరస్వామికి విశేష పూజలు చేసి పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించారు. చండీశ్వర స్వామికి సరస్వ పుష్కరిణిలో అర్చకులు, అధికారులు, పాలకవర్గ సభ్యులు శాస్త్రోక్తంగా అవబృథస్నానం నిర్వహించారు. ఉత్సవాల మొదటి రోజు బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా ఆలయ ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేశారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు గురువారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు అశ్వ వాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవ నిర్వహించనున్నారు.



కలం అనేది మనసు యొక్క నాలుక.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 18 జనవరి 2024

దారితప్పిన మాల్దీవులు

ఏదో యథాలాపంగా, ఎంతో యాదృచ్ఛికంగా మొదలైనట్టు కనబడిన మాల్దీవుల పంచాయితీ ఆంతర్యం మన దేశానికి దూరం జరగటమేనని తాజా పరిణామాలు మరింత తేటతెల్లం చేస్తున్నాయి. భారత వ్యతిరేకతే అస్త్రంగా ఎన్నికల్లో ప్రచారం చేసి మొన్న నవంబర్‌లో అధికారంలో కొచ్చిన అధ్యక్షుడు మహమ్మద్ మెయిజ్జూ ఇప్పటికీ అదే పోకడలు పోతున్నారు. లక్షద్వీప్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఒక ఛాయాచిత్రాన్ని పోస్టు చేసినప్పుడు ముగ్గురు మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలపై రాజుకున్న రగడ తర్వాత ఆ దేశం ఒకటొకటిగా చర్యలు మొదలుపెట్టింది. మన దేశం బహుమతిగా ఇచ్చిన రెండు తేలికపాటి అధునాతన ధ్రువ హెలికాప్టర్లు వెనక్కు తీసుకోవాలని కోరటంతో పాటు వచ్చే మార్చి 15లోపు దేశంలోవున్న భారత సైనిక దళాలను ఉపసంహరించాలని తుదిగడువు విధించారు. కేవలం 88 మంది సైనికుల వల్ల తమ దేశానికి ముప్పు ముంచుకొస్తుందంటూ హడావిడి చేస్తున్నారు. అధికారంలోకొచ్చిన వెంటనే భారత పర్యటనకొచ్చే సంప్రదాయాన్ని పక్కనబెట్టి మెయిజ్జూ టర్కీని ఎంచుకున్నారు. ఆ తర్వాత యూఏఈలో జరిగే కాప్–28 సదస్సుకెళ్లారు. తాజాగా ఈ నెల 8 నుంచి 12 వరకూ చైనాలో పర్యటించారు. 'భౌగోళికంగా ఆకారంలో చిన్నదైనంత మాత్రాన మాల్దీవులు ఎవరి బెదిరింపులకూ లొంగద'ని హెచ్చరించారు. వీటన్నిటి వెనుకా ఉన్నదెవరో సులభంగానే పోల్చుకోవచ్చు.

మనకూ, మాల్దీవులకూ వున్న బంధం చాలా పాతది. అలాగని భారత్‌పై విద్వేషాన్ని వెళ్లగక్కే శక్తులకు అక్కడ కొదవేమీ లేదు. దేశ ప్రజానీకంలోవున్న భారత్ అనుకూలతను ఎలాగైనా పరిమార్చాలని చాలామంది రాజకీయ నాయకులు ప్రయత్నించారు. ప్రత్యర్థుల విధానాలనూ, వారి కార్యాచరణనూ తప్పుబట్టడానికి సందు దొరకని ప్రతిసారీ భారత్ ప్రసక్తి తీసుకొచ్చి విమర్శించటం అక్కడ పరిపాటి. గతంలో అబ్దుల్లా యామీన్ సైతం మూడు దశాబ్దాల తన ఏలుబడిలో భారత్ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుని, చైనాతో అంటకాగి దేశాన్ని నిండా ముంచారు. ప్రశ్నించినవారిని ఖైదు చేశారు. ఇది సరికాదంటూ తీర్పునిచ్చిన ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీలను జైలుకు పంపారు. ఆయన నిర్వాకంలో ఆ దేశం చైనా నుంచి భారీగా రుణాలు తీసుకుంది. పెట్టుబడులను ఆహ్వానించింది. వీటివల్ల చెల్లించాల్సిన వడ్డీలే అపరిమితంగా పెరిగిపోయాయి. 2013లో రెండోసారి అధికారంలోకొచ్చాక కూడా యామీన్ తీరు మారలేదు. చివరకు ఆయన విధానాలతో విసిగిన జనం 2018లో ఇబ్రహీం మహ్మద్ సోలిహ్‌ను గద్దెనెక్కించారు. నియంతృత్వ పోకడలకు పోలేదన్న మాటేగానీ... అవినీతిని అంతమొందిస్తానన్న వాగ్దానాన్ని సోలిహ్ నిలుపుకోలేకపోయారు. ఒక అవినీతి కేసులో యామీన్‌కు 11 ఏళ్ల జైలు శిక్ష పడిన మాట వాస్తవమే అయినా, అది మినహా అవినీతి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోలేకపోయారు. ఉపాధి కల్పనలోనూ సొంత మనుషులకే ప్రాధాన్యమిచ్చారన్న ఆరోపణలు వినబడ్డాయి. ఈ అసంతృప్తిని ప్రస్తుత అధ్యక్షుడు మెయిజ్జూ ఆసరాగా తీసుకుని అధికారానికి రాగలిగారు. అయిదున్నర లక్షలమంది జనాభాగల మాల్దీవుల్లో మూడులక్షలమంది సున్నీ ముస్లిమ్‌లు. మతం పేరుతో వీరిలో అత్యధికులను తనవైపు తిప్పుకోవాలని, జాతీయవాదాన్ని రెచ్చగొట్టాలని అంతక్రితం యామీన్ ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. కాకపోతే ఈ రాజకీయ క్రీడ చివరకు సెక్యులర్ పార్టీల వైఫల్యంగా మారి మతతత్వ శక్తుల ప్రాబల్యం పెరుగుతుందా అన్న సందేహాలు చాలామందిలో ఉన్నాయి. మెయిజ్జూ అయినా, మరొకరైనా దేశాభివృద్ధిలో భారత్ కీలకపాత్రను తోసిపుచ్చలేరు. ప్రస్తుతం దేశ దిగుమతుల్లో అత్యధిక వాటా భారత్‌దే. దీన్ని తగ్గించుకుందామని ప్రయత్నిస్తే వ్యయం పెరగటం మినహా ప్రయోజనం శూన్యం. ఇక మాల్దీవుల విదేశీ రుణాల్లోనూ సింహభాగం మన దేశానిదే. గతంలో చైనాతో సాన్నిహిత్యం పెంచుకుని ఎడాపెడా రుణాలు తీసుకుని శ్రీలంక ఆర్థికంగా ఎంత నష్టపోయిందో, ఎలా దివాలా తీసిందో అక్కడి పరిణామాలే తేటతెల్లం చేశాయి.

అధికారంలోకొచ్చిన నాటి నుంచీ మెయిజ్జూ పాలనపై దృష్టి నిలపడానికి బదులు చైనాను సంతుష్టిపరచటానికి సమయం వెచ్చిస్తున్నారు. అన్ని దేశాల్లోనూ ఒకే తరహా వ్యవస్థలు, రాజకీయ భావాలుండటం సాధ్యం కాదు. ఎన్నికలప్పుడు ఏం మాట్లాడినా అధికారంలో కొచ్చాక బాధ్యతగా మెలగాలి. దేశ గరిష్ఠ ప్రయోజనాలు గీటురాయిగా ఉండాలి తప్ప, మూర్ఖత్వంతో అవతలివారిని నొప్పించటమే ధ్యేయం కాకూడదు. మెయిజ్జూకు ఎన్నికల జాతరలో తలకెక్కిన మత్తు ఇంకా దిగినట్టు లేదు. లోగడ పాలించిన యామీన్‌కు చైనాతో ఉన్న సాన్నిహిత్యం, ఇటీవల గద్దె దిగిన సోలిహ్ భారత్ అనుకూల ధోరణి జగద్విదితమే అయినా వారిద్దరూ ఇరు దేశాలకూ సమాన దూరంలో మెలుగుతామని ప్రకటించేవారు. విధానాల రూపకల్పనలో, నిర్ణయాల్లో ఎంతోకొంత దాన్ని చేసిచూపేవారు. మెయిజ్జూకు ఆ పరిణతి లేదని ఆయన చర్యలు స్పష్టం చేస్తున్నాయి. అది చాలదన్నట్టు ఇటీవల తైవాన్‌లో చైనాను గట్టిగా వ్యతిరేకించే పక్షమే తిరిగి అధికారంలోకి రాగా, తగుదునమ్మా అంటూ తమది 'వన్ చైనా' విధానమేనంటూ ప్రకటించారు. భౌగోళికంగా చూస్తే మాల్దీవులు 1,190 పగడపు దిబ్బల సముదాయం. కానీ అందులో నివాస యోగ్యమైనవి కేవలం 185 దీవులు మాత్రమే. మన దేశానికి 400 కిలోమీటర్ల దూరంలోవుంటూ మన భద్రత రీత్యా హిందూ మహా సముద్రంలో కీలక ప్రాంతంలో ఉన్న మాల్దీవులు భారత్ – చైనాల మధ్య సాగే పందెంలో తలదూర్చి బొప్పి కట్టించుకునే చేష్టలకు దూరంగా ఉండటం అన్నివిధాలా దానికే శ్రేయస్కరం.

ప్రత్యామ్నాయ సాంస్కృతిక శిఖరం

సందర్భం



కత్తి పద్మారావు

ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అరుదైన భారతీయుడు డా॥ బీఆర్ అంబేడ్కర్. అమానవీయ పరిస్థితులను ఎదుర్కొంటూ, విద్యను ఆయుధంగా ఎంచి ఎన్నో ఉన్నత డిగ్రీలు పొంది దేశానికి రాజ్యాంగ రచనలో దీపధారి అయ్యారు. దళితులూ, ఆదివాసీలూ, మహిళలూ, ఇతర అణగారిన వర్గాలకు ఆయన ఒక ధైర్య వచనం. తన కాలంలోనే గాక, ఆ తరువాత కాలాన్నీ వెలిగించడానికి అక్షర సముచ్చయాన్ని నిర్మించిన మేధావి. భారత ఉపఖండంలో తన సౌజన్యం ద్వారా రక్తపాతాన్ని నివారించి, నిర్మాణాత్మక సామాజిక విప్లవాన్ని నడిపిన ప్రత్యామ్నాయ సాంస్కృతిక శిఖరం ఆయన. ఆ మహానుభావుడి జ్ఞాపకార్థం 125 అడుగుల భారీ విగ్రహాన్నీ, ఓ స్మృతి వనాన్నీ నిర్మించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజారాశుల ఆదరణను చూరగొంటోంది.

జనవరి 19వ తేదీన విజయవాడ 'అంబేడ్కర్ నగర్'గా వెలుగొందుతుంది. ప్రత్యామ్నాయ సంస్కృతీ నిర్మాణంలో స్వాతంత్ర్యం తర్వాత కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు వెలుగొందిన అంబేడ్కర్ శిల్ప నిర్మాణం అత్యున్నతమైంది, విస్తృతమైంది. దక్షిణ భారతదేశానికి నడిబొడ్డున ఉన్న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, ఆవిష్కరణ, స్మృతివన వికాసం చెరపలేని సంఘటనలు. అశోకుని సాంచీ స్తూపానికి ఎంత పేరు వస్తుందో విజయవాడలోని స్మృతివనానికీ అంతే పేరు వస్తుందనడం అతిశయోక్తి కాదు. బౌద్ధమతాన్ని స్వీకరించి బౌద్ధునిగా మహాపరినిర్వాణం పొందిన అంబేడ్కర్ జ్ఞాపకార్థం నిర్మించిన ఈ విగ్రహం కానీ, స్మృతివనం కానీ ప్రపంచ బౌద్ధ పర్యాటకులను ఆకర్షించడం తథ్యం.

నిజానికి బౌద్ధానికి ఈ ప్రాంతం కొత్తేమీ కాదు. అశోకుని కాలంలోనే ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతానికి బౌద్ధం విస్తరించింది. అమరావతి స్తూపం మొదటి దశ నిర్మాణాలు మౌర్యుల వాస్తు నిర్మాణాలనే పోలి ఉండటం, అనేక విద్ధాంక నాణెములు (పంచ్ మార్క్‌డ్ కాయిన్స్) లభించడం, అశోకుని కాలపు నాటి బ్రాహ్మీ లిపిలోనే కొన్ని శాసనాలు లభించడాన్ని బట్టి ఆయన కాలంలోనే బౌద్ధం ఇక్కడికి వ్యాపించిందని చెప్పవచ్చు. అలాగే అప్పట్లోనే ఇవ్వాళ దళితులుగా వ్యవహరించబడుతున్న జన సమూహాలు బౌద్ధాన్ని అవలంబించాయి. అమరావతి స్తూపంపై ఉన్న... ఓ చర్మకారుడు స్తూపానికి ఇచ్చిన దానాన్ని తెలియచేసే శాసనం ఇందుకు మంచి ఉదాహరణ. దళితులు, కులవృత్తులవారే ఆ నాటి స్తూప నిర్మాణానికి రాళ్లు, మట్టినీ మోశారు. అద్భుత శిల్పాలను మలిచారు. అందుకే భారతదేశ చరిత్రలో మొదటి సాంస్కృతిక విప్లవం బౌద్ధం నుండే ప్రారంభమైందని చెప్పవచ్చు. హిందూ మతోన్మాదం బౌద్ధ శిల్పాలను, స్తూపాలను, చైత్యాలను, ఆశ్రమాలను హింసాత్మకంగా కూల్చివేసింది. కానీ మళ్లీ డా॥ బీఆర్ అంబేడ్కర్ శిల్పంలో ఒక ప్రత్యామ్నాయ ప్రకాశిత, విభాసిత శిల్ప కాంతులు వెల్లివిరుస్తున్నాయి.

అంబేడ్కర్ విగ్రహమే ఒక విశ్వవిద్యాలయంలా ఉంటుంది. ఆయన వేలు ఒక ప్రశ్నోపనిషత్తు. ఆయన విగ్రహం విద్యా వికాసానికి నిలువెత్తు నిదర్శనం. ఆయన ప్రపంచ మానవుడు. లండన్ హౌస్ ఆఫ్ కామన్స్ ముందు డా॥ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం భారత దేశ వ్యక్తిత్వాన్ని ప్రకాశింపచేస్తుంది. లండన్ మ్యూజియం లైబ్రరీలో ఆయన చిత్రపటం ప్రపంచ మేధావుల పంక్తిలో మెరుస్తుంది. లండన్ ఇండియన్ హౌస్‌లో ఆయన బంగారు విగ్రహం ఆయన జీవన సాఫల్యానికి గుర్తుగా వుంది. అంబేడ్కర్ పోరాటం ద్వారానే అధికార ప్రతిష్ఠ జరుగుతుందని నొక్కి వక్కాణించాడు. దళితులను దేవుడిపైన లేక సూపర్ మ్యాన్ పైన ఆధారపడవద్దని హెచ్చరించాడు.



'మీపై మీరు విశ్వాసం ఉంచుకొని నడవండి. ఎవరిపైనా ఆధారపడకండి. నిజాయితీగా ఉండండి. ఎప్పుడూ సత్యాన్ని ఆశ్రయించండి. దేనికీ లోబడకండి. ఎవరికీ తలవంచకండి' అని అంబేడ్కర్ పిలుపునిచ్చాడు. అంబేడ్కర్ ఒక ప్రవక్త, దార్శనికుడు. ఆయన ఒక జీవన వ్యవస్థల నిర్మాత. అణగారిన ప్రజల గుండె దివ్వెలు వెలిగించిన భానుడు. ఆయన జీవించిన కాలంలోనే గాక ఆ తరువాత కాలాన్నీ వెలిగించడానికి అక్షర సముచ్చయాన్ని నిర్మించిన మేధావి. జాన్‌డ్యూయిని అధ్యయనం చేసిన అంబేడ్కర్ ప్రజాస్వామ్య లౌకికవాది. భారత ఉపఖండంలో తన సౌజన్యం ద్వారా, రక్తపాతాన్ని నివారించి, నిర్మాణాత్మక సామాజిక విప్లవాన్ని ఆయన నడిపించారు.

ఇకపోతే అంబేడ్కర్ పార్కును మాయావతి గవర్నమెంట్ 125 కోట్ల బడ్జెట్‌తో రూపొందించింది. ప్రత్యామ్నాయ సంస్కృతిని ఆ పార్కు విస్తరించింది. అంబేడ్కర్, మహాత్మాపూలే, పెరియార్, నారాయణ్ గురూ, సాహూ మహరాజ్ వంటి వారినే కాకుండా ఉత్తర ప్రదేశ్‌లో ఉన్న ఎందరో పోరాట వీరుల విగ్రహాలను ఆ పార్క్‌లో ఆవిష్కరించారు. ప్రత్యామ్నాయ సంస్కృతికి ఆ పార్కు నిలువెత్తు సాక్ష్యంగా నిలబడింది. వ్యక్తిత్వ నిర్మాణానికి సాంస్కృతిక విప్లవ పునరుజ్జీవానికి సాహిత్యంతోపాటు శిల్పసంపద కూడా ఎంతో ఉపయుక్తం. కొన్ని శిల్పాలు మానవ మస్తిష్కాన్ని ప్రజ్వలింపచేస్తాయి. భారతదేశంలోని ఆర్కిటెక్చర్ ప్రపంచ దేశాల్లో ఉన్న ఆర్కిటెక్చర్‌లను సమన్వయం చేసుకుంది. భారతదేశానికి వలస వచ్చిన కుషానులు, అరబ్బులు, తురుష్కులు, పారసీకులు ఎందరో భారతీయ శిల్ప సౌందర్యానికి మురిసిపోయారు. వారి శిల్పనైపుణ్యాలు, భారతీయ శిల్ప నైపుణ్యానికి సమన్వయించారు. 'గాంధార శిల్పం' వంటివి రూపుదిద్దుకున్నాయి. మన అమరావతి శిల్పం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. భారతదేశంలో ఈనాడు ప్రత్యామ్నాయ శిల్పసంపద అభివృద్ధి చెందుతోంది.

లండన్ హౌస్ ఆఫ్ కామన్స్ ముందు ఉన్న డా॥ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం స్ఫూర్తితో ప్రతి ఊరిలో అంబేడ్కర్ విగ్రహం ఉండాలని 'ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ' కృషి చేసింది. అనేక గ్రామాలకు ఆ మహానుభావుడి విగ్రహాలను అందించింది కూడా! ఈ సందర్భంగానే అంబేడ్కర్ 150 అడుగుల విగ్రహాన్ని ఉమ్మడి రాష్ట్ర సచివాలయం ముందు నిలపాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోరాటం చేసింది. 40 రోజులు సచివాలయం ముందు ధర్నా చేసింది. అంబేడ్కర్ యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, అన్ని పార్టీలూ సపోర్ట్ చేశాయి. అయితే అంబేడ్కర్ వ్యతిరేక భావవాది, అగ్రవర్ణ కుల అహంకారి, రాజకీయ కపటి, మానవ వనరుల విధ్వంసకుడు, ప్రకృతి వనరుల దోపిడీదారు, నేర రాజకీయ కోవిదుడు, దళిత ద్రోహి నారా చంద్రబాబు నాయుడు అంబేడ్కర్ విగ్రహానికి బదులు మహాత్మాగాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ తెలంగాణ సచివాలయం ముందే అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించారు. ఏపీలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహానికి పూనుకొని నిర్మించింది. జనవరి 19వ తేదీన ఈ విగ్రహ ఆవిష్కరణ జరగడం ఒక చరిత్రాత్మక సంఘటన. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంతో విజయవాడకు ప్రత్యామ్నాయ సంస్కృతి ప్రజ్వలనం వస్తుంది. అంతేగాకుండా చైనా, టిబెట్, థాయ్‌లాండ్, జపాన్, జర్మనీ, బర్మా, శ్రీలంక దేశాల నుండి యాత్రికులు వస్తారు. ఇక విజయవాడ భారతదేశానికే తలమానికమైన నగరంగా వెలుగొందుతుంది. కుల, మత, జాతి, లింగ భేదాలు తరమబడతాయి. ప్రపంచంలో పేరెన్నికగన్న నగరాల్లో ఒకటిగా కీర్తించబడుతుంది. విద్యావ్యాప్తి పెరుగుతుంది. 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే అంబేడ్కర్ నినాదాన్ని ఈ నిలువెత్తు విగ్రహం పదే పదే గుర్తుచేసి ప్రజారాశులను చైతన్యవంతం చేస్తుంది.

అంబేడ్కర్ స్మృతివనం ఏమి చెప్తుందంటే పిల్లల్ని విద్యావంతులు చేసుకోండి. కుల, మత భేదాలు లేని సమసమాజాన్ని నిర్మించుకోండి. హింసలేని కరుణ, ప్రజ్ఞ, నీతి, ఆత్మీయత, అనుబంధం కలిగిన భారత రాజ్యాంగ సూత్ర నిబద్ధమైన ఒక సమాజాన్ని నిర్మించుకోండని ఎలుగెత్తి చాటుతుంది. ఇక విజయవాడ అంబేడ్కర్ నగర్ అవుతుంది. ప్రపంచ కీర్తిని పొందుతుంది. అంబేడ్కర్ స్మృతివనంలోని లైబ్రరీ, అంబేడ్కర్ చిత్రపటాల దృశ్య మాలిక సందర్శనం, అంబేడ్కర్ సమావేశ మందిరం ప్రపంచ పర్యాటకులకు దృశ్యమాన సౌందర్యం. జ్ఞానభాండాగార సదృశం. బహుముఖ వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రపంచ పటంలో ఓ వెలుగుతున్న ప్రత్యామ్నాయ వెలుగుల సంద్రం. ఆ వెలుగుల తరంగాలలో మనమూ ప్రకాశిద్దాం. ప్రజ్వరిల్లుదాం, ప్రమోదిద్దాం. ఇక పదండి ముందుకు అంబేడ్కర్ ఆశయాలతో...

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

(రేపు విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏంటి స్పందన?



పాకిస్తాన్ సరిహద్దు అంచుల్లో ఉన్న జైశ్ అదల్ తీవ్రవాద గ్రూపు మీద ఇరాన్ క్షిపణులతో దాడి చేయడం సాహసోపేతమైన ఎత్తుగడ. ఇప్పుడు పాకిస్తాన్ సైనికాధిపతుల మనోభావాలను నేను ఊహించగలను.

– అమ్రుల్లా సలేహ్
అఫ్గానిస్తాన్ తిరుగుబాటు నేత

పొంగిన ఉత్సవం



చెన్నైకి వచ్చి అపార్ట్‌మెంట్లలో నివసించేదాకా, అందరూ (తమిళ హిందువులు, క్రైస్తవులు) మాలాగే (తమిళ ముస్లింలు) 16 శాకాహార వంటలతో పొంగల్ జరుపుకొంటారని అనుకునేవాడిని. కొన్ని తరాలుగా మా కుటుంబంలో ఇది సాగుతోంది. కానీ ప్రతి సమాజానికీ ప్రాంతాన్ని బట్టి తమదైన పద్ధతి ఉందని నెమ్మదిగా తెలిసింది. ఈసారి మాత్రం మా ఇంట్లోవాళ్లు భారీగా 24 వంటకాలు చేశారు. పొంగలో పొంగల్!

– సయ్యద్ అన్వర్, రచయిత

అలా మొదలు



హాలీవుడ్ సినిమాలతో ఒక చెడ్డ ధోరణి మొదలైంది. నేరస్థులు, భూమిని లాక్కునేవాళ్లను కూల్ కౌబాయ్స్ గానూ, చట్టాన్ని నడిపేవారిగానూ చూపించారు. అక్కడి మూలవాసులను చంపడాన్ని న్యాయమైనదిగానూ, గొప్పవిషయంగానూ చిత్రించారు.

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

పునర్జన్మ భావన



భారతదేశంలో పుట్టిన అన్ని మతాలూ పునర్జన్మను విశ్వసిస్తాయి. వైదిక సంప్రదాయం నుంచి వచ్చిన బౌద్ధం కానీ, జైనం కానీ, అన్నీ దీన్ని నమ్ముతాయి. బౌద్ధంలో ఉన్నట్టుగా బుద్ధుడే ఎన్నో జన్మలు ఎత్తాడు. చివరగా బుద్ధుడు అయ్యాడని చెప్పే కథ కూడా ఒకటి ఉంటుంది.

– ఎస్.ఎల్. భైరప్ప, రచయిత

అంతా రాతే!



ఎడిటింగ్ కూడా రచనలో భాగమేనని మరిచిపోవద్దు. చదవడం కూడా రాయడంలో భాగమేనని మరిచిపోవద్దు. నేల మీద బోర్లా పడుకోవడం, పక్కనున్నవారు ఆందోళన పడేలా చేయడం కూడా రాయడంలో భాగమే.

– నీల్ రెనిక్, పరిశోధకుడు

ఇన్ బాక్స్

సామాజిక న్యాయానికి స్ఫూర్తిప్రదాత

ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం స్థాపించడం ద్వారా రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ యోధుడు బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తగిన నివాళి అర్పించినట్లయింది. విజయవాడలో ఈ నెల 19న గౌరవ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా జాతికి అంకితం చేయబడుతున్న ఈ విగ్రహం, విగ్రహం చుట్టూ 18 ఎకరాల్లో నిర్మితమైన సుందరమైన స్మృతివనం ప్రపంచ స్థాయి పర్యాటక స్థలాల్లో ఒకటిగా మారగలదు. ఈ భారీ విగ్రహ స్థాపన ద్వారా జగన్, సామాజిక న్యాయ భావనపై తన అనురక్తినీ, అంబేడ్కర్ సిద్ధాంతాల పట్ల అచంచల విశ్వాసాన్నీ తెలియజేయడమే కాకుండా, ముందు తరాలకు అంబేడ్కర్ చూపిన మార్గం ఎంత అనుసరణీయమో చెప్పకనే చెబుతున్నారు.

బాబా సాహెబ్ జీవితమే కాదు, ఆయన చేసిన ప్రతీ ఒక్క బోధన, రాసిన ప్రతీ మాట కూడా మెరుగైన సమాజ నిర్మాణానికి దారి చూపుతాయి. ఆయన జీవితంలో అధ్య యనానికి ఎంత పాత్ర ఉందో, ఉద్యమ నిర్మాణానికి కూడా అంతే పాత్ర ఉంది. ఒక వైపు ప్రజల్లో ఉండి ఉద్యమ నాయకత్వం వహిస్తూనే, మరోవైపు అత్యున్నత పాలనాయంత్రాంగంతో సిద్ధాంత రీత్యా పోరాడారు. ఒకే సమయంలో ఇటు మహద్ పోరాటం, నాసిక్‌లో కాలారామ్ ఆలయ ప్రవేశ పోరాటం దళితులతో పాటు చేస్తూనే, అటు అత్యున్నత రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటూ దేశానికీ, దళితులకీ నాయకత్వం వహించారు. నమ్మిన సిద్ధాంతం కోసం మహాత్మా గాంధీతోనూ విభేదించారు. స్వాతంత్ర్యం రాక ముందే, 1943లో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ముందు చూపుతో దళితులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ లాంటి విధానాలు ప్రవేశపెట్టి స్వాతంత్ర్యానంతర దేశాన్ని సామాజిక న్యాయ మార్గం వైపు మళ్లించారు. రాజ్యాంగ నిర్మాతగా ఆ మార్గాన్ని మరింత గట్టిపరచారు.



ప్రభుత్వాలు రాజ్యాంగం చూపిన మార్గంలో యథాలాపంగా నడవడం వేరు, మార్గాన్ని నమ్మి మరింత బలంగా అడుగులు వేయడం వేరు. యథాలాపంగా నడిస్తే సామాజిక న్యాయం దిశగా రాజ్యాంగం ప్రకారం చెయ్యాల్సిన కనీస స్థాయి ప్రయత్నాలు జరుగుతాయి. నమ్మి అడుగులు వేస్తే ఆ స్ఫూర్తితో గరిష్ఠంగా ఎంత మేలు చెయ్యొచ్చు అన్నది ముఖ్యమవుతుంది. వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వం అలా స్ఫూర్తిదాయకమైన అడుగులే వేస్తున్నట్లు పాలనలో ప్రారంభ దశ నుండే అవగతమైంది. ప్రతీ పథకంలో, అధికార పదవుల కూర్పులో, ఎంపిక ద్వారా కేటాయించే పనుల్లో సైతం సామాజిక న్యాయం, సంతృప్త స్థాయిలో సాధికారత కల్పించడం గీటురాళ్లుగా తీసుకోవడం జరిగింది. విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పనలకు పెద్దపీట వేయడం ద్వారా సమసమాజానికి బాటలు పడ్డాయి. ఈ స్ఫూర్తికి ఆలంబన అంబేడ్కర్ మహాశయుడు. ఆయన ఎత్తైన విగ్రహం ఇప్పుడు విజయవాడ నడిబొడ్డున నిల్చి దేశానికి సరైన మార్గం చూపించనుంది.

– డా॥ డి.వి.జి. శంకరరావు
మాజీ ఎంపీ, ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ । 94408 36931

డిజిటల్ కరెన్సీని సులభతరం చేయాలి!

అభిప్రాయం



బి. నర్సన్

భారతదేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రజలు డిజిటల్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. 2010లో ఈ రంగంలోకి దిగిన గూగుల్ పే, అదే సంవత్సరం మొదలైన పేటీఎం, 2015లో ప్రవేశించిన ఫోన్ పే ఒకదానికొకటి పోటీ పడుతూ వచ్చాయి. ఫోన్ పే ఇప్పుడు అగ్రస్థానంలో ఉంది. 2022–23లో ఫోన్ పే ఆదాయం రూ. 2914 కోట్లు. ఒకే సంవత్సరంలో దాని లాభం 77 శాతం పెరిగింది. మార్కెట్‌లో 47 శాతం భాగస్వామ్యం దీనిదే. 28 కోట్ల మంది వాడుతుండగా ఏడాదికి 10 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. వీటిపై వచ్చే కమిషనే దీని ఆదాయవనరు. ఫోన్ రీఛార్జ్ ఒక్కింటికి రూ. 2 కమిషన్ రూపంలో లభిస్తాయి. ఇలా బీమా తదితర కంపెనీల ద్వారా వీటికి వచ్చే రాబడి కూడా ఎక్కువే.

ఇన్నాళ్లకు ఇలాంటి ఎలక్ట్రానిక్ చెల్లింపుల విధానంపై రిజర్వ్ బ్యాంకు కన్నుపడింది. 2021 ఆగస్టు 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రవేశపెట్టిన డిజిటల్ కరెన్సీ నేడు కొన్ని నగరాల వినియోగదారుల అవసరాలు తీర్చే దశకు చేరుకుంది. గత ఏడాది నుండి ప్రయోగాత్మకంగా, దశలవారీగా ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ వాడకాన్ని విస్తరిస్తోంది. ఎస్‌బీఐతో పాటు మరో నాలుగు ప్రయివేటు బ్యాంకుల ద్వారా మొదటి దశ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించింది. ఇంకా పైలెట్ స్థాయిలోనే ఉన్న డిజిటల్ ఇండియన్ కరెన్సీ దేశంలోని 14 బ్యాంకుల్లో చలామణీలో ఉంది. వీటిలో 5 ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి. ప్రస్తుతం ఈ సౌకర్యం గల ప్రధాన నగరాల్లో హైదరాబాద్ కూడా ఉంది.

ఇప్పటికే ఉన్న ప్రయివేట్ ఆన్‌లైన్ చెల్లింపుల యాప్‌లకు తోడుగా ప్రభుత్వ నిర్వహణలో నడిచే ఒక ధన మార్పిడి ద్వారం తెరుచుకోవడం ఆర్బీఐ చరిత్రలో విశేషమే. కాగితపు నోట్లు ముద్రించే ఆ బ్యాంక్ ఇప్పుడు ఎలక్ట్రానిక్ నోట్ల పంపిణీ చేస్తోంది. మొబైల్ తెరపై ఇవి కరెన్సీ నోట్ల రూపంలో కనబడతాయి. 2,000, 500, 200, 100, 50, 20, 10, 5, 2 రూపాయల డినామినేషన్లలో ఉంటాయి. కాగితపు నోటుపై ఉన్నట్లే వీటిపై కూడా వరుస సంఖ్య ఉంటుంది. బ్యాంకుకు వెళ్లి లేదా ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేసుకున్నట్లు మన ఖాతాలో ఉన్న సొమ్ములోంచి అవసరమైన నోట్ల బొమ్మలను ముందుగా డిజిటల్ రూపీ వాలెట్‌లోకి లోడ్ చేయాలి. మొబైల్ వాలెట్‌లోని డిజిటల్ నోట్ల ద్వారా జమలు, చెల్లింపులు జరుగుతాయి. నోట్లను తిరిగి బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసే రిడీమ్ సదుపాయం కూడా ఉంది. నోట్ల బొమ్మల పైన వాలెట్‌లో ఏ నోట్లు ఎన్ని ఉన్నాయో తెలిపే సంఖ్య ఉంటుంది. చెల్లింపులు చేస్తే ఆ నంబర్ తగ్గుతుంది. జమ చేస్తే పెరుగుతుంది.



ఆర్బీఐ విడుదల చేసిన డిజిటల్ కరెన్సీ


గూగుల్ పే లాంటి ఇతర యాప్‌ల ద్వారా డైరెక్టుగా బ్యాంకు ఖాతా నుంచి చెల్లింపులు జరిగితే ఆర్బీఐ డిజిటల్ రూపీ విధానంలో కేవలం వాలెట్ ద్వారా జరుగుతాయి. మొబైల్ నంబర్‌కు కాని, క్యూఆర్ కోడ్ ద్వారా కాని చెల్లింపు చేయాలనుకున్నప్పుడు వాలెట్‌లో జమ అయ్యి ఉన్న నోట్లలోంచి అవసరమున్న డినామినేషన్‌ను ఎంచుకోవాలి. ఇది వాడకందారులకు అదనపు శ్రమగానే భావించాలి. 45 గ్రాముల కొత్తిమీర కట్టకు 19.65 రూపాయల బిల్లు వచ్చినా నేరుగా పేమెంట్ చేసే అవకాశం ఇతర యాప్‌లు ఇస్తున్నప్పుడు ఇందులో డిజిటల్ రూపీలను ఎంపిక చేసుకొని పేమెంట్ చెయ్యాలి. క్యూ ఆర్ కోడ్ పై చెల్లింపు చేసినా నోట్ల ఎంపిక తప్పదు. పైన పేర్కొన్నట్లు 19.65 రూపాయలు చెల్లించాలనుకుంటే రూ. 20ని ఎంపిక చేసుకొని చిల్లర వదులుకోవాలి. ఎవరికైనా మొబైల్ యాప్ ద్వారా రూ. 50 వేలు ట్రాన్స్‌ఫర్ చేయాలంటే ఆ సంఖ్యను పే కాలమ్‌లో మార్చితే సరిపోతుంది. డిజిటల్ రూపీ యాప్‌లోనైతే ముందు బ్యాంక్ బ్యాలెన్స్ నుండి రూ. 2 వేల డినామినేషన్ బొమ్మను 25 సార్లు స్వైప్ చేస్తూ వాలెట్‌లో వాటిని పెంచుకోవాలి. ఆ తర్వాత పే చేసే నంబర్ ఎంచుకొని వాటిని అందులోకి లోడ్ చేయాలి. ఇదంతా అనవసర శ్రమతో కూడుకున్న పని.

ఇలా ఆర్బీఐ సృష్టించిన డిజిటల్ రూపీ వల్ల కొత్త చిక్కులు వచ్చే అవకాశముంది. దేశీయ కరెన్సీ ముద్రణ బాధ్యత మోస్తున్నందువల్ల ఆర్బీఐ మనీ ట్రాన్స్‌ఫర్ యాప్‌లో కూడా రూపాయల బొమ్మలుంచడం చాదస్తమే. ప్రస్తుతం ఈ పథకం పైలెట్ రూపంలోనే ఉన్నందువల్ల కష్టమర్ల సమస్యలను తీర్చే మార్గాలు రావచ్చు. మిగతా యాప్‌ల మాదిరే ఆదాయాన్ని ఆశిస్తే చాలా మార్పుల అవసరం ఉంది. ప్రభుత్వ రంగ బ్యాంకు ఖాతాదారులనైనా తమవైపు తిప్పు కోవడంలో సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ రూపీ ఎంత విజయం సాధిస్తుందో చూడాలి.

వ్యాసకర్త ప్రభుత్వ బ్యాంకు విశ్రాంత అధికారి
మొబైల్: 9440128169

దేవుణ్ణి కోరే ముందు...

మనుషులు దేవుణ్ణి ఆరాధించడానికి ప్రధాన కారణం ఆయన వారి కోర్కెలను తీరుస్తాడని నమ్మడమే! భౌతిక సంపదల నుంచి ఇహలోకం నుంచి విముక్తి వరకూ... అనేక రకాల కోర్కెలు మానవ కోర్కెల జాబితాలో ఉంటాయి. కొందరు మేము వ్యవసాయదారులం వర్షం కురిపించమని పూజలూ, యజ్ఞాలూ చేస్తారు. అదే సమయంలో ఇంకొందరు తాము కుండలు తయారు చేసుకుని బతికేవాళ్ళమనీ, వర్షం కురవకుండా చూడమని వేడుకుంటారు. ఎన్నికల్లో పోటీచేసే ప్రతి ఒక్కరూ తాము గెలిచేలా కరుణించమని పూజలు చేస్తారు. దొంగతనానికి వెళ్ళేవారు కూడా దేవుడి వద్దకు వచ్చి తామనుకున్న దోపిడీ సవ్యంగా జరిగేటట్టు అనుగ్రహించాలని కోరు కుంటారు. ఏ ఆటంకం లేకుండా దోపిడీ సాగిపోతే... దోచుకున్న దాంట్లో కొంత ఇస్తామని దేవునికి మొక్కుకుంటారు.



జ్యోతిర్మయం

ఇక్కడ ఎవరికి వారు నిజాయతీతో, భక్తితో దేవునికి తమ కోర్కెలు విన్నవించుకున్నవారే. దేవుడు నిజంగా భక్తవల్లభుడే అయితే వీరందరి కోర్కెలూ తీర్చవలసిందే. కానీ అలా తీర్చడం సాధ్యం కాదు. వర్షం కావాలని ఒకరంటే, వద్దని మరొకరంటున్నారు. మరి ఎవరి కోరిక తీర్చాలి?

నిజానికి మనిషి కోరిన కోరికలను దేవుడు తీర్చడం అసాధ్యం. కోరికలు అనంతం కాబట్టి అవి ఊరుతూనే ఉంటాయి. ఎప్పటికీ మనిషి సంతృప్తి చెందడు. అయితే దేవుణ్ణి ఏమయితే కోరతారో ఆ కోరిక హేతుబద్ధంగా ఉండేలా చూడాలి. దాన్ని పొందడంలో తమ కృషి తాము చేయాలి. మండు వేసవిలో వర్షాన్ని కురిపించాలని దేవుణ్ణి కోరడం న్యాయమేనా? ఏమీ చదవకుండా పరీక్షల్లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలనుకోవడం సరైన ఆలోచనేనా?

'నువ్వు చెయ్యవలసిన పని నువ్వు చెయ్యి. ఫలితం అదే వస్తుంది' అన్న 'గీతా' సారాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని దేవుని ముందు కోర్కెల చిట్టా విప్పుతాడు సరైన భక్తుడు. అప్పుడే అతడు తగిన ఫలితాన్ని పొందగలుగుతాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.అష్టమి రా.1.06 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** రేవతి ఉ.8.29 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** తె.3.28 నుండి 4.56 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.10.18 నుండి 11.06 వరకు, తదుపరి ప.2.48 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.11 నుండి 7.43 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.43.

చరిత్రాత్మకంగా చైతన్యమూర్తి

ఆకాశమంతటి వ్యక్తిత్వంతో దేశ గతిని మార్చిన బాబా సాహెబ్ అంబేడ్కర్: సీఎం జగన్

పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చేలా 'సామాజిక న్యాయ మహా శిల్పం'

అంబరాన్ని తాకేలా విజయవాడలో 206 అడుగులతో అతి పెద్ద విగ్రహం

19న స్వరాజ్య మైదానంలో విగ్రహావిష్కరణకు అంతా స్వచ్ఛందంగా తరలి రావాలని సీఎం సందేశం

సాక్షి, అమరావతి: అంబరాన్ని తాకేలా విజయవాడలో మనం ఏర్పాటు చేసుకుంటున్న రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోవటమే కాకుండా శతాబ్దాల పాటు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. అది 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' (సామాజిక న్యాయ మహా శిల్పం) అని అభివర్ణించారు. మన సమాజ గతిని సమతా భావాల వైపు మరల్చటానికి, సంఘ సంస్కరణలకు, పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు, రాజ్యాధికారంలో పేదల స్థానాన్ని సుస్థిరం చేసేందుకు ఆ మహా శిల్పం నిరంతరం స్ఫూర్తినిస్తుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని చారిత్రక స్వరాజ్య మైదానంలో ఈ నెల 19వ తేదీన ఆవిష్కరించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్దదన్నారు. అంబేడ్కర్ మహా శిల్పాన్ని ఆవిష్కరించనున్న సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ బుధవారం రాష్ట్ర ప్రజలకు ఈమేరకు సందేశం ఇచ్చారు. 'అది 81 అడుగుల వేదికపై ఏర్పాటు చేసిన 125 అడుగుల మహా శిల్పం. అంటే.. 206 అడుగుల ఎత్తైన విగ్రహం. ఆ మహానుభావుడి ఆకాశమంతటి వ్యక్తిత్వం, దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, మహిళా చరిత్రను మార్చేలా దాదాపు 100 ఏళ్ల క్రితమే ఆయన వ్యక్తం చేసిన భావాలు కలకాలం మన దేశాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆయన భావాల పట్ల అచంచల విశ్వాసంతో, బాధ్యతతో వాటిని మన నవరత్నాల్లో అనుసరిస్తున్న ప్రభుత్వంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా 19వ తేదీన అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతున్నా' అని తన సందేశంలో సీఎం జగన్ పేర్కొన్నారు.

దేశానికే తలమానికం



- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: విజయవాడలో మనందరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పం రాష్ట్రానికే కాదు.. దేశానికే తలమానికం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. చరిత్రను తిరగరాసేలా మరెందరికో వందల ఏళ్ల పాటు 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ నెల 19వతేదీన విజయవాడలో బాబా సాహెబ్ అంబేడ్కర్ మహా శిల్పం విగ్రహావిష్కరణకు అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

నిరంతరం కాపాడే మహాశక్తి

- ఆయన.. అణగారిన వర్గాలకు చదువులు చేరువ చేసిన మహనీయుడు!
- అంటరానితనం, ఆధిపత్య భావజాలంపై తిరుగుబాటు చేసిన మహానుభావుడు!
- సమ సమాజ భావాలకు నిలువెత్తు రూపం!
- రాజ్యాంగం, రాజ్యాంగ హక్కుల ద్వారా నిరంతరం మనల్ని కాపాడే ఓ మహాశక్తి!
- ప్రతి వాడలో ఉన్న ఆయన విగ్రహం అణగారిన వర్గాలకు నిరంతరం ధైర్యాన్ని, అండని ప్రసాదించే ఓ మహా స్ఫూర్తి!
- దళితులతో పాటు కులాలు, మతాలకు అతీతంగా పేదలందరి జీవితాల్లో ఈ 77 ఏళ్లలో వచ్చిన అనేక మార్పులకు మూలం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలే!

విగ్రహావిష్కరణకు కుల, మతాలకతీతంగా తరలిరావాలి..

మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ జేఏసీ పిలుపు



బైక్ ర్యాలీ చేస్తున్న నందిగం సురేశ్ తదితరులు

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రజలు తరలిరావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు, ఏపీ ఎంఆర్‌పీఎస్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మేదర సురేష్‌కుమార్ సంయుక్తంగా పిలుపునిచ్చారు. విజయవాడలో 19న సీఎం జగన్ చేతుల మీదుగా అంబేడ్కర్ 'సామాజిక న్యాయ మహాశిల్పం' ఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభలు స్వరాజ్ మైదానంలో జరగనున్న నేపథ్యంలో, వీటిని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాల మహానాడు, ఏపీ ఎంఆర్‌పీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రారంభించారు. ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అడపా శేషు, కాకుమాను రాజశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పూలసాగు పరిశోధనా సలహా మండలి చైర్మన్‌గా జానకీరామ్



సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం: పూల సాగుపై జాతీయ స్థాయిలో జరిగే వివిధ పరిశోధనల కోసం ఏర్పాటు చేసిన సలహా మండలి(ఆర్‌ఏసీ) చైర్మన్‌గా పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2024 నుంచి 2027 వరకు మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఐసీఏఆర్‌కు అనుబంధంగా పూణేలోని పూలసాగు సంచాలకుల పరిశోధనా కార్యాలయం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పూలసాగుపై జరుగుతున్న పరిశోధనలను డాక్టర్ జానకీరామ్ సమన్వయం చేయనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జానకీరామ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు సమీక్షించడం ద్వారా రాష్ట్రంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ద్వారా మరిన్ని పరిశోధనలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పూల రైతులకు, నర్సరీలకు ప్రయోజనకరమైన అత్యుత్తమ పద్ధతులను పరిచయం చేసే అవకాశం ఉంటుందన్నారు.

ఆంధ్రా పర్యటనలో అంబేడ్కర్‌కు అరుదైన గౌరవం

గుడివాడలో 53 ఎడ్ల బండ్లపై ఊరేగింపు

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన సమయంలో అరుదైన స్వాగతం లభించింది. బ్రిటిష్ వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా 1944 సెప్టెంబర్ 30న అంబేడ్కర్ గుడివాడ వచ్చారు. అప్పుడాయన వయసు 53 ఏళ్లు. ఆయన వయసుకు సూచనగా.. 53 ఎడ్ల బండ్లతో గుడివాడ రైల్వే స్టేషన్ నుంచి తట్టివర్రు గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతకుముందు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోనూ 53 ఎడ్ల బండ్లతో ఆయనను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆ సంవత్సరం సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు విశాఖపట్నం, అనకాపల్లి, తుని, రాజమండ్రి, రామచంద్రాపురం, కాకినాడ, పాలకొల్లు, ఏలూరు, గుడివాడ ప్రాంతాల్లో అంబేడ్కర్ పర్యటించారు. షెడ్యూల్డ్ కులాలకు విద్యావకాశాలు, మౌలిక సదుపాయాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అప్పట్లో ఆయన పర్యటించిన అన్ని ప్రాంతాల్లోనూ ఘన స్వాగతం లభించడం విశేషం.

విజయవాడలో రేపు ట్రాఫిక్ మళ్లింపు

విజయవాడ ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి వెల్లడి

విజయవాడ స్పోర్ట్స్: సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 19వ తేదీన విజయవాడ నగర పరిసరాల్లో వాహనాల రాకపోకలు దారి మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.చక్రవర్తి తెలిపారు. వాహన చోదకుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు బుధవారం వెల్లడించారు. 19న ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వద్ద 1.35 లక్షల మందితో భారీ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో బెంజి సర్కిల్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ వరకు బందరు రోడ్డుపై, ఐదో నెంబర్ రూట్‌పై, ఏలూరు రోడ్డు సీతారామపురం జంక్షన్ నుంచి రెడ్ సర్కిల్ వరకు, శిఖామణి సెంటర్ నుంచి వాటర్ ట్యాంక్ రోడ్డు వరకు అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవానికి వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తామని, ఇతర వాహనాలను అనుమతించమని స్పష్టం చేశారు.

ఆంగ్లం అవసరమే.. మాతృభాషనూ మరువద్దు

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు తదితరులు

నరసరావుపేట రూరల్: ప్రస్తుత తరుణంలో ఆంగ్లం అవసరమేనని.. అయితే మాతృభాష తెలుగునూ మరువద్దని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. పల్నాడు జిల్లా జొన్నలగడ్డ సమీపంలో బుధవారం జరిగిన కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన మాట్లాడారు. గుడి ఎంత పవిత్రమైనదో బడి కూడా అంతే పవిత్రమైందని, విద్యార్థులు మొబైల్ వినియోగాన్ని అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యాసంస్థలు వ్యాపార ధోరణి వీడి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఏ ప్రభుత్వం అయినా ఉచితంగా ఏదీ ఇవ్వకూడదని, విద్య, వైద్యాన్ని ఉచితంగా అందజేసి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్రకుమార్, జీవీ ఆంజనేయులు, బీసీ జనార్దన్‌రెడ్డి, మద్రాసు ఫెర్టిలైజర్స్ డైరెక్టర్ ఎస్.వెంకట్రావు, స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ నడిబొడ్డున.. 'సోషల్ జస్టిస్ స్ఫూర్తి కుడు'



సాక్షి, అమరావతి: బెజవాడ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చేది కొండపై కొలువైన దుర్గమ్మ. అదే బెజవాడకు మరో ప్రత్యేక మణిహారంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కరుడు నిలవనున్నారు. నగరం నడిబొడ్డున గొప్ప చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకున్న స్వరాజ్ మైదానంలో రూపుదిద్దుకున్న బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం దేశంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత సంకల్పంతో నిర్మించిన 'సామాజిక న్యాయ మహా శిల్పం' దర్శనీయ ప్రాంతంగా మారనుంది. విజయవాడలో నిర్మించింది అంబేడ్కర్ స్మృతివనం మాత్రమే కాదు.. భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శాలు, ఆలోచనలను అందించే గొప్ప ప్రయత్నం కూడా. దానికి సంబంధించిన మరికొన్ని విశేషాలు..

- స్వరాజ్ మైదానంలో 81 అడుగుల పెడస్టల్‌పై 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుతో మొత్తం 206 అడుగుల ఎత్తు వస్తుంది.
- కాంస్య విగ్రహాన్ని ఢిల్లీలో తయారు చేయించారు. దాన్ని భాగాలుగా విజయవాడకు తరలించి స్మృతివనంలో క్రమ పద్ధతిలో అతికించి అద్భుతంగా తీర్చిదిద్దారు. విగ్రహం తయారీలో షూ దగ్గర్నుంచి బెల్ట్ వరకు హనుమాన్ జంక్షన్ వద్ద శిల్పి ప్రసాద్ ఆధ్వర్యంలో కాస్టింగ్ చేశారు.
- ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతతో తుది దశ పనులు చేస్తున్నారు.
- అంబేడ్కర్ విగ్రహం బేస్(పెడస్టల్)లో గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లున్నాయి.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు హాళ్లుండగా.. ఒక్కోటి నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటాయి. అందులో ఒకటి సినిమా హాలు, మిగిలిన మూడు హాళ్లలో ఆయన చరిత్రను తెలిపే డిజిటల్ మ్యూజియం ఉంటుంది.
- మొదటి అంతస్తు(ఫస్ట్ ఫ్లోర్)లో 2,250 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన నాలుగు హాళ్లుంటాయి. ఒక హాల్లో.. అంబేడ్కర్‌కు దక్షిణాదితో ఉన్న అనుబంధాన్ని చిత్రాలతో డిస్‌ప్లే చేస్తారు.
- రెండో అంతస్తు(సెకండ్ ఫ్లోర్) వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు హాళ్లుంటాయి.
- అంబేడ్కర్ స్మృతివనంలో విగ్రహం ఉన్న ప్రాంతానికి ఒక వైపు నుంచి వెళ్లి.. మరో వైపు నుంచి తిరిగి వచ్చేలా విశాలమైన హాలు మాదిరిగా నిర్మాణాలను పూర్తి చేశారు. వాటి గోడలకు అంబేడ్కర్ జీవిత విశేషాలు, ఆయన చరిత్రకు సంబంధించిన ఘట్టాల శిల్పాలను అద్దారు.
- లోపలి భాగంలోని హాళ్లలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అంబేడ్కర్ పాల్గొన్న సమావేశాలు, సభలకు సంబంధించిన పాత చిత్రాలను భారీ చిత్రాలుగా డిజిటలైజ్ చేసి డిస్‌ప్లే చేశారు. ఆయన రాసిన కీలకమైన లేఖలు, ఉపన్యాసాలను ఆయా ఘట్టాలకు అనుగుణంగా ఫొటోలతో పాటు డిస్‌ప్లే చేశారు.
- అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలు, సందేశాలను సైతం క్లుప్తంగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో డిజిటల్ బోర్డులపై డిస్‌ప్లే చేశారు. 'చదువు.. సమీకరించు.. బోధించు' వంటి ప్రధానమైన సందేశాలను ప్రముఖంగా ఏర్పాటు చేశారు.
- స్మృతివనం ఆవరణను పచ్చని తివాచీ పరిచినట్టు గరిక, మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు. అంబేడ్కర్ విగ్రహానికి ముందు ఏర్పాటు చేసిన నెమళ్ల ప్రతిరూపాలు ఆకట్టుకుంటున్నాయి.
- మ్యూజిక్‌కు అనుగుణంగా ప్రవహించే వాటర్ ఫౌంటెయిన్‌లను ఏర్పాటు చేశారు. పెడస్టల్ చుట్టూ ఉన్న ప్రాంతంలో వాటర్ కొలను మాదిరిగా ఫౌంటేయిన్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా మరెన్నో ప్రత్యేకతలు ఈ స్మృతివనంలో దర్శనమిస్తాయి.

అంబేడ్కర్ బాటలో సంక్షేమ సారథి

బాబా సాహెబ్ ఆశయాలను నెరవేరుస్తున్న సీఎం జగన్: విజయసాయిరెడ్డి

సామాజిక న్యాయ మహాశిల్పం, సామాజిక సమతా సంకల్ప సభ కార్యక్రమాల పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయసాయిరెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుస్తూ సంక్షేమ పాలనతో దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. దేశ గతి, దిశను మార్చిన ఘనత బాబా సాహెబ్‌కే దక్కుతుందన్నారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో 'సామాజిక న్యాయ మహా శిల్పం' 'సామాజిక సమతా సంకల్పం' సభ కార్యక్రమాల పోస్టర్లను మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్, పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు మొండితోక అరుణ్ కుమార్, జూపూడి ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, లిడ్ క్యాప్ చైర్మన్ కె.రాజశేఖర్ తదితరులతో కలసి ఆయన ఆవిష్కరించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, పార్టీ నాయకులు పెరికె ప్రసాద్‌రావు, పి.ఓబులేశు, మనోహర్ నాయుడు, నారాయణ మూర్తి తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం సమ సమాజాన్ని నిర్మించిందని, దేశ భవిష్యత్తుకు దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న కుల జాడ్యం, అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన కృషి మరవలేనిదన్నారు. ఆ మహానుభావుడి స్ఫూర్తిని రగిల్చేలా ఈ నెల 19వ తేదీన విజయవాడలో ఆవిష్కరిస్తున్న 'సామాజిక న్యాయ మహా శిల్పం' ద్వారా సీఎం జగన్ చరిత్రలో నిలుస్తారని చెప్పారు.

నాడు ముళ్ల పొదల్లో..

నాడు చంద్రబాబు సర్కారు ముళ్ల పొదల్లో అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పుతున్నట్లు ప్రకటించి చివరకు అది కూడా ఏర్పాటు చేయలేకపోయింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంబేడ్కర్ భావజాలాన్ని, సిద్ధాంతాలను అమలు చేస్తున్నారు. విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పిన సీఎం జగన్ వెంటే దళితులంతా నడుస్తారు.

– మేరుగు నాగార్జున, మంత్రి

ఇష్టారాజ్యంగా వాడుకున్నారు

స్వరాజ్య మైదానాన్ని గత పాలకులు ఇష్టారాజ్యంగా వాడుకున్నారు. ఆ స్థలం ప్రైవేట్ పరం చేసి షాపింగ్ మాల్ కట్టాలని భావించారు. ఇప్పుడు అదే స్థలంలో అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ నెలకొల్పారు. బాబా సాహెబ్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ విగ్రహావిష్కరణలో అందరూ పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం.

– ఆదిమూలపు సురేష్, మంత్రి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

గత పాలకులు అంబేడ్కర్‌ని ఓట్ల కోసమే వాడుకున్నారు. ఆయన సిద్ధాంతాలను అమలు చేయలేదు. దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– నందిగం సురేష్, ఎంపీ

సమాజ భావాలకు నిలువెత్తు రూపం

దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, మహిళా చరిత్రను మార్చేలా 100 ఏళ్ల క్రితమే అంబేడ్కర్ వ్యక్తం చేసిన భావాలు కలకాలం ప్రభావితం చేస్తూనే ఉంటాయి. సమ సమాజ భావాలకు ఆయన నిలువెత్తు రూపం. అంబేడ్కర్ భావాల పట్ల అచంచల విశ్వాసంతో సీఎం జగన్ వాటిని నవరత్నాల్లో పొందుపరిచారు. ఈనెల 19వ తేదీన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కులమతాలు, పార్టీలకు అతీతంగా అంతా స్వచ్ఛందంగా తరలి రావాలి.

– మొండితోక అరుణ్ కుమార్, ఎమ్మెల్సీ

ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

సీఎం జగన్ ప్రభుత్వం దళితుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌ని గెలిపించుకుని మరోసారి అధికారంలోకి తెచ్చుకుందాం.

– జూపూడి ప్రభాకరరావు

'మహా శిల్పం' జగన్ సంకల్పం

మాట నిలబెట్టుకుంటూ విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్మృతివనాన్ని రాజధాని అమరావతిలో నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన నాటి సీఎం చంద్రబాబు తుప్పల్లో స్థలం కేటాయించి కంటి తుడుపుగా జీవో జారీ చేశారు. మారుమూల జన సంచారం లేని ప్రాంతంలో స్మృతి వనానికి 2016లో జీవో జారీ చేశారు. 2017 ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజు ఐనవోలు సమీపంలో శంకుస్థాపనతో సరిపుచ్చి ఆ తర్వాత కన్నెత్తి చూడలేదు. కనీసం ఓ సిమ్మెంట్ విగ్రహం ఏర్పాటు చేయటానికి కూడా ఆయనకు మనసు రాలేదు. స్మృతివనాన్ని నిర్మించి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత సంఘాలు ఎన్నిసార్లు మొత్తుకున్నా, ప్రదర్శనలు నిర్వహించినా ఆలకించలేదు. తన నిర్వాకాలను కప్పి పుచ్చేందుకు హైదరాబాద్‌లోని అంబేడ్కర్ స్మృతి వనంతో స్వరాజ్య మైదానాన్ని పోలుస్తూ చంద్రబాబు బృందం నీచ రాజకీయాలకు దిగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 2020 జూలై 8న అత్యంత ఎత్తైన అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. 2023 ఆగస్టులోనే విగ్రహ ఏర్పాటు పూర్తైనప్పటికీ మొత్తం పనులను పూర్తి చేసి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అడ్డంకులను అధిగమించి అద్భుతంగా..

అంబేడ్కర్ విగ్రహాన్ని స్వరాజ్య మైదానంలో నెలకొల్పాలన్న సీఎం జగన్ నిర్ణయం కార్యరూపం దాల్చడానికి పెద్ద కసరత్తే చేయాల్సి వచ్చింది. దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో అప్పటికే ఉన్న నిర్మాణాలు, కార్యాలయాలు తరలించేందుకు పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీన్ని అడ్డుకునేందుకు విపక్షాలు చేయని ప్రయత్నాలు లేవు. పనులు వేగంగా జరిగేలా సాంఘిక సంక్షేమ మంత్రి అధ్యక్షతన పురపాలక, దేవదాయ, గృహ నిర్మాణ, విద్యా శాఖల మంత్రులతో మంత్రివర్గ ఉప సంఘాన్ని నిర్మించి సీఎం జగన్ స్వయంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడలేదు.

హరియాణాలో తయారీ..

పలు నమూనాలను పరిశీలించిన అనంతరం నిపుణుల సూచనలతో హర్యానాలో 125 అడుగుల విగ్రహాన్ని తయారు చేశారు. అక్కడ రూపొందించిన అంబేడ్కర్ విగ్రహ భాగాలను భద్రంగా విజయవాడకు తరలించి స్వరాజ్య మైదానంలో ఆకాశాన్ని తాకేలా తీర్చిదిద్దారు.

అంబేడ్కర్ ఆలోచన.. సీఎం జగన్ ఆచరణ

అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణంపై సర్వత్రా హర్షం

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అట్టడుగు వర్గాలకు సైతం రాజ్యాంగం ద్వారా అనేక అవకాశాలు కల్పించగా.. వాటి ఫలాలను ఆచరణలో అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. అంబేడ్కర్ ప్రతిపాదించిన సామాజిక న్యాయం అమల్లో సీఎం జగన్ దేశంలోనే చరిత్ర సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. రాజ్యాంగం ప్రకారం దక్కిన వాటా కంటే అధికంగానే అందించి అట్టడుగు వర్గాలకు అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం(సామాజిక న్యాయ మహా శిల్పం) ప్రారంభోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌లు బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్న జగన్



అంబేడ్కర్ మహనీయుడు అందరి వాడు. ఆయన ఆశయాలు అమలు చేస్తున్న సీఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహం దేశంలోనే అతి ఎత్తయిన విగ్రహంగా చరిత్రలో నిలుస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దళితులకు ప్రాధాన్యం కల్పించేందుకు అంబేడ్కర్ చేసిన కృషిని సీఎం జగన్ కొనసాగిస్తున్నారు. నాలుగేళ్ల ఎనిమిది నెలల కాలంలో దళిత, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి జగన్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేయడం అభినందనీయం.

– మారుమూడి విక్టర్ ప్రసాద్, ఎస్సీ కమిషన్ చైర్మన్

అంబేడ్కర్ ఆలోచనలకనుగుణంగా సీఎం జగన్ పాలన



అంబేడ్కర్ ఆలోచనలకనుగుణంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారు. పేద వర్గాలకు చేయందించి అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో సీఎం పనిచేస్తున్నారు. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా నవరత్నాలు వంటి సంక్షేమ పథకాల కార్యక్రమాలు రూపొందించి సుపరిపాలన అందిస్తున్నారు. అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు, ధీశాలి. ఆయన జీవితకాలమంతా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం, సమాజంలో వివక్షను తొలగించడానికే కృషి చేశారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం జగన్ ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించారు.

– డీవీజీ శంకరరావు, ఎస్టీ కమిషన్ చైర్మన్

సామాజిక న్యాయం దిశగా సీఎం జగన్ పాలన

ప్రపంచం గర్వించేలా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

- అంబేడ్కర్ భావజాలంతో పరిపాలన
- అంబేడ్కర్ స్మృతివనం.. సీఎం సామాజిక స్పృహకు నిదర్శనం
- మంత్రులు మేరుగు, ఆదిమూలపు



అంబేడ్కర్, బుద్ధుడి విగ్రహాల వద్ద మంత్రులు మేరుగు, ఆదిమూలపు, మల్లాది, జూపూడి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం, సాధికారత దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం స్టేట్ కాంక్లేవ్ ఆన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మేరుగు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ రీతిలో అంబేడ్కర్ విగ్రహం మన రాష్ట్రంలో ఏర్పాటైందని చెప్పారు. ఈ నెల 19న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంబేడ్కర్ భావజాలం, ఆలోచనలతో పాలన చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో నిలిచిపోతారని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

సీఎం జగన్ సామాజిక స్పృహకు నిదర్శనం

ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రాత్మక ఘటనగా మరో మంత్రి ఆదిమూలపు సురేష్ అభివర్ణించారు. విజయవాడ నడిబొడ్డున ఉన్న స్వరాజ్య మైదానానికి సంబంధించి గత పాలకులు వ్యాపార ధోరణితో ఆలోచిస్తే.. ఆ స్థలంలో అంబేడ్కర్ స్మృతివనాన్ని ఏర్పాటు చేయడం సీఎం జగన్ సామాజిక స్పృహకు నిదర్శనమని కొనియాడారు. పేదరికం విద్యకు అడ్డు కాకూడదనే సీఎం జగన్ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని.. అందుకే యువతకు నేనిచ్చే ఆస్తి విద్య మాత్రమేనని సీఎం జగన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. జవాబుదారీతనం, పారదర్శకత, అవినీతి రహితం తదితరాలు తమ ప్రభుత్వ మూలసూత్రాలుగా చెప్పారు. అణగారిన వర్గాలు కూడా గౌరవప్రదమైన జీవితం గడపాలన్న లక్ష్యంతో 70 శాతం మంత్రి పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్పించి సామాజిక న్యాయం పాటించిన నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఛాయా చిత్రాలమాలికను పలువురు ఆసక్తిగా తిలకించారు. సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సోషల్ జస్టిస్ అడ్వైజర్ జూపూడి ప్రభాకర్, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్య, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం అంశాలపై సదస్సు

కార్యక్రమం సెకండ్ సెషన్‌లో భాగంగా హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సెక్రటరీ సునీత మోడరేటర్‌గా వ్యవహరించిన 'విద్య' అంశంపై ఉన్నత విద్య మాజీ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం, ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ కొలకలూరి ఇనాక్, ఏఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్, సెంటర్ ఫర్ మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి ప్రసంగించారు. అనంతరం స్కూల్ ఎడ్యుకేషన్ మిడ్డే మీల్, శానిటేషన్ డైరెక్టర్ శోభిక మోడరేటర్‌గా వ్యవహరించి నిర్వహించిన 'సామాజిక న్యాయం' అంశంపై ప్రముఖ రచయిత కంచె ఐలయ్య, ఆకునూరి మురళి, దళిత స్త్రీ శక్తి నేషనల్ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, సీనియర్ ప్రొఫెసర్ ఎస్.ఆర్మ్‌స్ట్రాంగ్‌లు, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ వీరపాండ్యన్ మోడరేటర్‌గా వ్యవహరించి నిర్వహించిన 'సౌభ్రాతృత్వం' అంశంపై గంటా చక్రపాణి, సఫాయి కర్మచారి ఆందోళన్ వ్యవస్థాపకులు బెజవాడ విల్సన్, ప్రొఫెసర్ ఎంఎం వినోదిని, బుద్ధ వనం, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లక్ష్మయ్యలు ప్రసంగించారు. తొలుత మయన్మార్ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


అయోధ్య వీధుల్లో సూర్యస్తంభ్ సోలార్ దీపాల వెలుగులు


సరయూ నదీ జలాలతో కూడిన కలశాలను తీసుకొస్తున్న భక్తులు


గర్భగుడిలో విగ్రహం ప్రతిష్ఠించే పవిత్రప్రదేశం


బుధవారం గర్భగుడిలో ప్రత్యేక పూజలు

అయోధ్యలో కలశ పూజ

రెండో రోజుకు చేరిన ప్రత్యేక క్రతువులు

సరయూ జలాలను కలశాల్లో నింపిన ఆచార్యులు

అయోధ్య: అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కోసం ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. పూజరులు నిర్వహిస్తున్న ప్రత్యేక క్రతువులు రెండో రోజుకు చేరాయి. బుధవారం కలశ పూజ చేపట్టారు. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా దంపతులు 'యజమానులుగా' సరయూ నది తీరంలో కలశ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాలను సరయూ నదీ జలాలలో నింపి పూజలు చేశారు. రామ్‌లల్లా ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రధాన ఆలయ ప్రాంగణంలోకి ఈ కలశాలను తీసుకెళ్లారు. ప్రతిష్ఠాపన కంటే ముందు ఈ జలాలతో పూజలు చేస్తారు. మొత్తం 121 మంది ఆచార్యులు క్రతువుల్లో పాల్గొంటున్నారు. లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన ఆచార్యుడిగా వ్యవహరిస్తున్నారు. గురువారం గణేశ్ అంబికా పూజ, వరుణ పూజ, మాత్రికా పూజ, వాస్తు పూజ నిర్వహిస్తారు. మంగళవారం ప్రారంభమైన ఈ క్రతువులు ఈ నెల 21వ తేదీ దాకా నిరంతరాయంగా కొనసాగుతాయని ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు.

అయోధ్యకు చేరుకున్న 'రామ్‌లల్లా'

భవ్య మందిరంలో ప్రతిష్ఠించబోయే రామ్ లల్లా విగ్రహం బుధవారం అయోధ్యకు చేరుకుంది. భక్తుల జయజయ ధ్వానాల మధ్య వాహనంలో ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. గర్భాలయంలోని వేదికపైకి చేర్చారు. కళ్లకు గంతలు కట్టి ఉన్న ఈ విగ్రహం చిత్రాలను తీర్థ క్షేత్ర ట్రస్టు విడుదల చేయలేదు. ఈ నెల 22న ఇదే విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయబోతున్నారు. ప్రాణప్రతిష్ఠ తర్వాతే రామ్‌లల్లా చిత్రాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, రామ్‌లల్లా ప్రతీకాత్మక (సింబాలిక్) విగ్రహం బుధవారం ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.


రామ్‌లల్లా ప్రతీకాత్మక విగ్రహాన్ని రామమందిరానికి తీసుకొస్తున్న దృశ్యం

ప్రాణప్రతిష్ఠకు 'ప్రధాన యజమాని' ప్రధాని మోదీ

అయోధ్య: రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ప్రధాన యజమాని'గా వ్యవహరిస్తారని ప్రధాన ఆచార్యుడు పండిత లక్ష్మీకాంత్ దీక్షిత్ చెప్పారు. మొదట రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రాను ప్రధాన యజమానిగా ఖరారు చేశారు. కానీ, ఈ విషయంలో మార్పు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. గర్భాలయంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠతోపాటు కీలకమైన పూజలను ప్రధాన యజమాని తన చేతుల మీదుగా నిర్వహిస్తారు.

19 నుంచి 'అఖండ్ పథ్'

అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన కోసం హిందువులతో పాటు ఇతర మతాల ప్రజలు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ మూడు రోజులపాటు 'అఖండ్ పథ్' నిర్వహించేందుకు సిక్కు మతస్థులు సిద్ధమవుతున్నారు. అయోధ్యలోని గురుద్వారా బ్రహ్మకుండ్ సాహిబ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నారు. రామాలయ ప్రాణప్రతిష్ఠ సజావుగా జరగాలని ఆకాంక్షిస్తూ అఖండ్ పథ్ నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సిక్కులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు. అయోధ్య శ్రీరాముడితో సిక్కులకు చరిత్రాత్మక అనుబంధం ఉందని వివరించారు. 1510లో గురునానక్ అయోధ్యను దర్శించుకున్నారని గుర్తుచేశారు. 1858లో సిక్కు మత పెద్దలు అయోధ్య రామాలయంలో పూజలు చేశారని, గోడలపై రామ్ అని రాశారని చెప్పారు. సిక్కు మత ఆచారాలు, సంప్రదాయాల్లో అఖండ్ పథ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. పవిత్ర గురుగ్రంథ సాహిబ్‌ను నిరంతరాయంగా భక్తితో పఠించడమే అఖండ్ పథ్. ఇందుకు 48 గంటలకుపైగా సమయం పడుతుంది. సిక్కుల పవిత్ర గ్రంథమైన గురుగ్రంథ సాహిబ్‌లో 'రామ్' అనే పదం 2,533 సార్లు ఉందని ఆర్‌పీ సింగ్ వెల్లడించారు.

రామ భక్తులపై మోసాల వల

సైబర్ నేరగాళ్లు అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని కూడా అక్రమ సంపాదనకు వాడుకుంటున్నారు. అయోధ్య నుంచి రామమందిర ప్రసాదం పంపిస్తామంటూ భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. అమెజాన్ వంటి ఆన్‌లైన్ మార్కెట్ సైట్లలో ఇలాంటి ప్రసాదం కనిపిస్తోంది. డెలివరీ చార్జీల కింద కేవలం రూ.51 ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే చాలు ఈ నెల 22వ తేదీ నాటికి ఉచితంగా ప్రసాదం పంపిస్తామంటూ మరికొందరు నేరగాళ్లు వల విసురుతున్నారు. నిజానికి దీనికి, అయోధ్య రామమందిరానికి ఎలాంటి సంబంధం లేదు. అదంతా నకిలీ ప్రసాదమని అధికారులు అంటున్నారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కొందరైతే డొనేషన్లు సేకరిస్తున్నామంటూ రామ్ జన్మభూమి ట్రస్టు పేరిట వాట్సాప్ ద్వారా క్యూఆర్ కోడ్ పంపుతున్నారు. వాటిని స్కాన్ చేస్తే బ్యాంకు ఖాతాల్లో నగదు గల్లంతవుతోంది. అలాగే రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనను ప్రత్యక్షంగా తిలకించడానికి వీవీపీ పాసులు అందజేస్తామంటూ ఉచ్చులోకి లాగుతున్నారు. 'రామ్ జన్మభూమి గృహ సంపర్క్ అభియాన్-ఏపీకే' పేరిట ఇలాంటి సందేశాలను ఫోన్ల ద్వారా పంపిస్తున్నారు. నగదు బదిలీ చేయించుకొని ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు.

అయోధ్యకు 200కుపైగా ఆస్థా ప్రత్యేక రైళ్లు

అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ తర్వాత భక్తులు పోటెత్తనున్నారు. వారి సౌకర్యార్థం దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అయోధ్యకు 2 వేల ఆస్థా ప్రత్యేక రైళ్లు నడిపించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. టయర్-1, టయర్-2 నగరాల నుంచి బయలుదేరి ఈ రైళ్లు అయోధ్య ధామ్ స్టేషన్‌కు చేరుకుంటాయి. ఈ నెల 22వ తేదీ నుంచి 100 రోజులపాటు ఈ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇవి పరిమితమైన స్టేషన్లలో మాత్రమే ఆగుతాయి. అయోధ్య ధామ్ స్టేషన్ నుంచి మళ్లీ గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఈ రైళ్లలో ప్రయాణానికి ఐఆర్‌సీటీసీ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

కొత్తగా 20 వేల ఉద్యోగాలు

అయోధ్య ఇక అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారనుంది రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ తర్వాత అయోధ్యను ప్రతిఏటా కోట్లాది మంది దర్శించుకోనున్నారు. అదేస్థాయిలో ఇక్కడ ఉద్యోగ, ఉపాధి పెరగడం ఖాయం. ఆతిథ్యం, రవాణా, పర్యాటక రంగాల్లో కలిపి 20 వేల కొత్త ఉద్యోగాల సృష్టి జరిగిందని సమాచారం.

ప్రతిఏటా శ్రీరాముడికి 'సూర్య తిలకం'

అయోధ్య రామ మందిరంలో ప్రతిఏటా చైత్ర మాసంలో శ్రీరామనవమి రోజు భక్తులు అపూర్వమైన దృశ్యాన్ని తిలకించవచ్చు. ఆ రోజు గర్భాలయంలో రాముడి నుదుటన సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. సూర్య కిరణాలే తిలకంగా రామయ్యను అలంకరిస్తాయి. దీన్ని సూర్య తిలకంగా పిలుస్తారు. ఈ తిలకం వ్యవస్థను సీఎస్‌ఐఆర్-సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీబీఆర్‌ఐ) సైంటిస్టులు డిజైన్ చేశారు. ఇందుకోసం ఆలయంలో కటకాలు, అద్దాలు ఏర్పాటు చేస్తున్నారు. శ్రీరామనవమి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 6 నిమిషాల పాటు సూర్య తిలకాన్ని దర్శించుకోవచ్చు.

ప్రాణప్రతిష్ఠను నిలిపేయండి

అలహాబాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

అలహాబాద్: అయోధ్య రామాలయంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిలిపివేయాలని కోరుతూ ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. ఘజియాబాద్ నివాసి భోలాదాస్ అనే వ్యక్తి ఈ వ్యాజ్యం దాఖలు చేశాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం పౌష్య మాసంలో మతపరమైన వేడుకలు నిర్వహించకూడదని చెప్పారు. అలాగే అయోధ్యలో రామాలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, అసంపూర్తిగా ఉన్న గుడిలో రాముడి విగ్రహాన్ని ఎలా ప్రతిష్ఠిస్తారని ప్రశ్నించారు. ఇలా చేయడం సనాతన ధర్మానికి విరుద్ధమేనని స్పష్టం చేశారు. అసంపూర్తిగా ఉన్న గుడిలో దేవుడి ప్రతిష్ఠాపన పట్ల పలువురు శంకరాచార్యులు కూడా ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేశారని వెల్లడించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ఆరాటపడుతోందని, అందులో భాగంగానే అయోధ్య ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తోందని భోలాదాస్ ఆరోపించారు.

చైనా జనాభా రెండో ఏడాదీ తగ్గింది

బీజింగ్: అధిక జనాభాతో మన దేశం జనభారత్‌గా దూసుకుపోతుంటే పొరుగు దేశం చైనా జనాభా క్షీణతను చవిచూస్తోంది. వరసగా రెండో ఏడాదీ అక్కడ జనాభా క్షీణత నమోదైంది. గత ఏడాదితో చూస్తే 2023 ఏడాదిలో చైనా జనాభా 20.8 లక్షలు తగ్గి 140.97 కోట్లకు పడిపోయింది. వార్షిక గణాంకాలను బుధవారం చైనా విడుదలచేయడంతో ఈ విషయం వెల్లడైంది. జనాభా నియంత్రణే లక్ష్యంగా ఒకే బిడ్డ విధానాన్ని కఠినంగా కమ్యూనిస్ట్ ప్రభుత్వం అమలుచేయడంతో చైనాలో గత ఆరు దశాబ్దాల్లో ఎరుగని జనాభా క్షీణతను 2022 ఏడాది ఎదుర్కొంది. 2022లో చైనాలో 95.6 లక్షల మంది జన్మిస్తే 2023లో 90.2 లక్షల మంది పుట్టారు. జననాల రేటు అత్యంత కనిష్టానికి పడిపోవడమూ ఇందుకు ఒక కారణం. కోవిడ్ కారణంగా 2023 ఏడాదిలో ఎక్కువ మంది చనిపోవడమూ జనాభా తగ్గుదలకు మరో కారణమైంది. గత ఏడాది ఏకంగా 1.11 కోట్ల మంది చైనాలో చనిపోయారు.

మేనిఫెస్టో కోసం సూచనలు ఇవ్వండి

దేశ ప్రజలకు కాంగ్రెస్ పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రజల నుంచి పొందిన సలహాలు, సూచనలకు అనుగుణంగా ఈసారి లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను సిద్ధంచేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకుంది. ఇందుకోసం వారు పంపాల్సిన ఈమెయిల్, వెబ్‌సైట్‌లను బుధవారం ఆవిష్కరించింది. awaazbharatki.in వెబ్‌సైట్‌కు ఓటర్లు తమ సూచనలను పంపొచ్చు. awaazbharatki@inc.in మెయిల్ ఐడీకి సైతం దేశ ప్రజలు తమ సలహాలు, సూచనలను పంపొచ్చు. కేంద్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి పి.చిదంబరం ఛైర్మన్‌గా ఏర్పాటైన మేనిఫెస్టో కమిటీ ఇలా సామాన్య ప్రజలు, వివిధ వర్గాలు, సమూహాలు, సంస్థల నుంచి సలహాలు సూచనలను కోరుతోంది. 'ప్రజాభీష్టానికి అనుగుణంగానే కాంగ్రెస్ మేనిఫెస్టో రూపుదిద్దుకుంటుంది'' అని బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ చిదంబరం, కన్వీనర్ టీఎస్ సింగ్ దేవ్ స్పష్టంచేశారు.

థాయ్‌లాండ్ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

23 మంది కార్మికుల దుర్మరణం

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లోని సుప్రాన్ బురీ ప్రావిన్స్‌లోని బాణసంచా తయారీ కర్మాగారంలో సంభవించిన భారీ పేలుడులో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గాయపడ్డారు. పేలుడు ధాటికి కార్మికుల మృతదేహాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడి ఘటనాస్థలి భీతావహంగా మారింది. ఘటన జరిగినపుడు ఫ్యాక్టరీలో దాదాపు 30 మంది కార్మికులు ఉండి ఉంటారని భావిస్తున్నారు. ఫ్యాక్టరీ ఉన్న ప్రాంతం వరిపొలాలకు పెట్టిందిపేరు. పచ్చని పొలాల మధ్య బుధవారం మధ్యాహ్నంవేళ దట్టమైన నల్లని పొగలు ఎగసిపడుతున్న దృశ్యాలను ఆ దేశ ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్‌చేసింది. చైనీయుల నూతన సంవత్సరం వచ్చే నెలలో థాయిలాండ్‌లోనూ ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా బాణసంచాకు భారీగా డిమాండ్ పెరగడంతో పెద్దమొత్తంలో బాణసంచాను హడావుడిగా తయారుచేస్తుండటంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

మహారాష్ట్ర స్పీకర్‌కు బాంబే హైకోర్టు నోటీసులు

ముంబై: ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని 14 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాను పెట్టుకున్న పిటిషన్లను మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ కొట్టేయడాన్ని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం నేత, చీఫ్ విప్ భరత్ గోగావాలే బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. దీంతో ఈ విషయంలో మీ స్పందన తెలపాలంటూ స్పీకర్, 14 మంది ఉద్ధవ్ వర్గం ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు పంపింది. అసెంబ్లీ సచివాలయానికీ కోర్టు నోటీసులిచ్చింది. నోటీసులు అందుకున్న వారు తమ స్పందనను అఫిడవిట్ల రూపంలో సమర్పించాలని కోర్టు సూచించింది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి ఎనిమిదో 8కి వాయిదావేసింది.

ఇండిగో, ముంబై ఎయిర్‌పోర్ట్‌లకు జరిమానా

ముంబై: విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు రన్‌వే పక్కనే నేలపై కూర్చుని భోజనంచేసిన ఘటనలో ఇండిగో విమానయాన సంస్థ, ముంబై ఎయిర్‌పోర్ట్‌పై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ), బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) ఆగ్రహం వ్యక్తంచేసి జరిమానా విధించాయి. ప్రయాణికుల అసౌకర్యానికి కారణమైన ఇండిగో సంస్థపై రూ.1.5 కోట్ల జరిమానా, ముంబై ఎయిర్‌పోర్ట్‌పై రూ.90 లక్షల జరిమానా విధించాయి. ఒక పౌరవిమానయాన సంస్థపై ఇంతటి భారీ జరిమానా పడటం ఇటీవలికాలంలో ఇదే తొలిసారికావడం గమనార్హం. జనవరి 15వ తేదీన గోవా నుంచి బయల్దేరిన విమానం ఢిల్లీకి వెళ్లాల్సి ఉంది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా పొగమంచు కారణంగా ఢిల్లీకి బదులు ముంబైలో దిగింది. చాలాసేపు విమానంలోనే వేచి ఉన్న ప్రయాణికులు విసిగిపోయి కిందకు దిగొచ్చి రన్‌వే పక్కనే కూర్చుని భోజనాలు చేశారు. ఈ ఘటనను పౌరవిమానయాన శాఖ సీరియస్‌గా తీసుకుంది. బీసీఏఎస్ అడిగేదాకా ఈ విషయంలో ఇండిగో వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. రన్‌వేపై ప్రయాణికుల కదలికలను నియంత్రించకుండా ముంబై ఎయిర్‌పోర్ట్ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహించారని డీజీసీఏ ఆక్షేపించింది.

మూడు క్యాంపులపై మావోయిస్టుల దాడి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు గ్రామం మావోయిస్టులు, జవాన్ల పరస్పర కాల్పుల మోతతో దద్దరిల్లింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా దండకారణ్య ప్రాంతంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లో ఏర్పాటుచేస్తున్న పోలీసు క్యాంప్‌లపై మావోలు మెరుపుదాడికి దిగారు. పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం, చింతవాగులో నిర్మించిన క్యాంప్‌లు, పామేడు పోలీస్ స్టేషన్‌పై మావోయిస్టులు దాడికి దిగారు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో లాంచర్లతో దాడిని ప్రారంభించిన మావోయిస్టులు బుధవారం తెల్లవారుజామున 5 గంటల వరకు కొనసాగించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు ఎదురుదాడికి దిగగా తెల్లవార్లూ ఆ ప్రాంతం బాంబుల మోతతో దద్దరిల్లింది. ఈ దాడుల్లో 300 నుంచి 400 మంది వరకు మావోయిస్టులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. దాడి సమయంలో ఆయా ప్రాంతాల ప్రధాన దారులపై చెట్లు నరికి అడ్డంగా వేసి నిప్పుపెట్టి రహదారిని మూసి వేశారు. ఆ మార్గాల గుండా వస్తున్న గ్రామస్తులను వెనక్కి పంపించారు. మూడు చోట్లా ఏకకాలంలో రాకెట్ లాంచర్లు విసురుతూ, మందుపాతరలు పేల్చుతూ భయోత్పాతం సృష్టించారు. దీంతో సీఆర్‌పీఎఫ్ బలగాలు సైతం ఎదురుదాడికి దిగాయి. ధర్మారం క్యాంపు నిర్మాణ పనులు కొనసాగుతుండగా అందులోని జవాన్లతో పాటు పని చేసేందుకు గుంటూరు నుంచి వచ్చిన 40 మంది కూలీలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ధర్మారం క్యాంప్‌పై జరిపిన దాడిలో తొమ్మిది మంది జవాన్లు స్వల్పంగా గాయపడినట్లు సమాచారం.

ఓటర్ల మనసులు గెల్చుకోవాలి

- బీజేపీ శ్రేణులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- బూత్ స్థాయిలో విజయం సాధిస్తే రాష్ట్రంలో గెలుపు మనదే
- కేరళలో బీజేపీ 'శక్తి కేంద్రాల' ఇన్‌చార్జీలతో మోదీ సమావేశం

కొచ్చి/త్రిసూర్: కేంద్రంలో ఎవరు అధికారంలో ఉండాలో నిర్దేశించే శక్తి కేరళకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రాష్ట్రంలో ఓటర్ల మనసులు గెల్చుకోవాలని బీజేపీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. కేరళ అసెంబ్లీలో పాగా వేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన మంగళవారం సాయంత్రం కేరళకు చేరుకున్నారు. రెండు రోజు బుధవారం కొచ్చి నగరంలో బీజేపీ 'శక్తి కేంద్రాల' ఇన్‌చార్జీలతో మోదీ సమావేశమయ్యారు. రెండు నుంచి మూడు పోలింగ్ బూత్‌లను కలిసి ఒక్కో శక్తి కేంద్రంగా పరిగణిస్తారు. మోదీతో భేటీకి దాదాపు 6,000 మంది ఇన్‌చార్జీలు హాజరయ్యారు. బూత్ స్థాయిలో విజయం సాధిస్తే కేరళలో గెలుపు మనదేనని నిర్దేశించారు. ఎవరి బూత్‌లో వారు గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని చెప్పారు.

ఇళ్లలో 'రామజ్యోతి' వెలిగించండి

దేశంలో వేగవంతమైన అభివృద్ధి, భవిష్యత్తు పట్ల స్పష్టమైన విజన్ ఉన్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఈ విషయం ఇప్పటికే నిరూపితమైందని అన్నారు. బీజేపీ వైపు యువతను ఆకర్షించాలని, ఇందుకోసం 'మై భారత్' కార్యక్రమం, నమో యాప్‌తోపాటు సోషల్ మీడియా వేదికలను ఉపయోగించుకోవాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలన్నారు. పార్టీ పట్ల సానుకూలతను వ్యాప్తి చేయాలన్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా ఆలయాలను శుభ్రం చేయాలని బీజేపీ శ్రేణులను నరేంద్ర మోదీ కోరారు. 22న సాయంత్రం ఇళ్లల్లో 'రామజ్యోతి' వెలిగించాలని, ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.

గురువాయూర్ ఆలయంలో మోదీ పూజలు

కేరళలో ప్రసిద్ధి చెందిన గురువాయూర్ శ్రీకృష్ణ మందిరంలో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ ముండు(ధోతీ), తెల్లరంగు శాలువా ధరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి భారతీయుడు సంతోషంగా ఉండాలని, సౌభాగ్యంతో విలసిల్లాలని గురువాయుర్ శ్రీకృష్ణుడిని ప్రార్థించానని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ సందర్శన ఫొటోను 'ఎక్స్'లో పోస్టు చేశారు. అనంతరం గురువాయూర్ ఆలయంలో ప్రముఖ మలయాళ సినీ నటుడు, బీజేపీ నేత సురేశ్ గోపీ కుమార్తె వివాహానికి మోదీ హాజరయ్యారు. నూతన దంపతులకు మోదీ స్వయంగా పూల మాలలు అందించారు. వారిద్దరి చేతులను కలిపి ఆశీర్వదించారు. కొత్త దంపతులు మోదీకి పాదాభివందనం చేశారు. ఈ పెళ్లి వేడుకకు హాజరైన సినీ నటులు మమ్ముట్టీ, మోహన్‌లాల్, జయరాం, దిలీప్, ఖుష్బూతో మోదీ విడివిడిగా మాట్లాడారు. ఇదే ఆలయంలో వివాహం చేసుకున్న జంటలను సైతం మోదీ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి మిఠాయిలు బహూకరించారు. ఆ తర్వాత త్రిసూర్ జిల్లాలోని త్రిప్రయార్‌లో శ్రీరామస్వామి ఆలయంలో ప్రధానమంత్రి పూజలు చేశారు. అనంతరం కొచ్చికి బయలుదేరి వెళ్లారు. కొచ్చి సిటీలో భారీ రోడ్ షోలో పాల్గొన్నారు.


గురువాయూర్ ఆలయానికి వస్తున్న మోదీ


గురువాయూర్ ఆలయంలో..


సురేశ్ గోపీ కుమార్తె వివాహ వేడుకలో..

రూ.4,000 కోట్ల ప్రాజెక్టులు అంకితం

అంతర్జాతీయ వాణిజ్యంలో భారతదేశ శక్తిసామర్థ్యాలను, స్థానాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తక్కువ సమయంలో నౌకల రాకపోకల విషయంలో పలు అభివృద్ధి చెందిన దేశాలను సైతం మనం అధిగమించామని చెప్పా రు. బుధవారం కేరళలోని కొచ్చి సిటీలో రూ.4,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ జాతికి అంకితం చేశారు. వీటిలో ప్రతిష్టాత్మకమైన కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కూడా ఉంది.

భద్రతా బలగాలపైకి మిలిటెంట్ల దాడులు

- ఇద్దరు పోలీసుల దుర్మరణం
- మణిపూర్‌లోని మోరే పట్టణంలో ఘటన
- కొనసాగుతున్న పరస్పర కాల్పులు

ఇంఫాల్: జాతుల వైరంతో ఘర్షణలమయమైన మణిపూర్‌లో ఈసారి భద్రతా బలగాలు, కుకీ మిలిటెంట్లకు మధ్య పరస్పర కాల్పుల పర్వం కొనసాగుతోంది. తౌలుత మయన్మార్ సరిహద్దులోని మోరె పట్టణంలో భద్రతా బలగాల పోస్ట్‌పై మిలిటెంట్లు దాడి చేయడంతో ఈ ఎదురుకాల్పులు మొదలయ్యాయి. గత ఏడాది అక్టోబర్‌లో మోరె సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ చంగ్‌థమ్ ఆనంద్‌ను కుకీ మిలిటెంట్లు హత్య చేసిన ఘటనలో మంగళవారం మోరె పట్టణంలో పోలీసులు ఇద్దరు అనుమానితులను అరెస్ట్‌చేశారు. ఈ అరెస్టును తీవ్రంగా వ్యతిరేకిస్తూ కొందరు మహిళల బృందం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలోనే బుధవారం మోరె పట్టణంలోని భద్రతాబలగాల పోస్ట్‌పై కాల్పులు జరిపారు. రాకెట్ ఆధారిత గ్రనేడ్లు విసిరారు. బలగాల పోస్ట్ వద్ద వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. వెంటనే తేరుకున్న బలగాలు మిలిటెంట్లపై కాల్పులు జరిపాయి. మోరె పట్టణం సహా ఛికిమ్ గ్రామంలో, వార్డ్ నంబర్ ఏడులోనూ ఇలా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. ఒక ఆలయం సమీపంలో మిలిటెంట్లు జరిపిన మెరుపుదాడిలో స్టేట్ పోలీస్ కమాండో వాంగ్‌కెమ్ సోమర్‌జిత్ మరణించారు. మరో చోట జరిపిన కాల్పుల్లో మరో పోలీస్ తఖెల్లబమ్ శైలేశ్వర్ ప్రాణాలు కోల్పోయారు. ఉద్రిక్తతల నేపథ్యంలో తెంగ్‌నౌపాల్ జిల్లాలో మణిపూర్ సర్కార్ కర్ఫ్యూను విధించింది. ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ తొమ్మిది రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగించారు.

హెలికాప్టర్లు ఇప్పించండి

రోడ్డు మార్గంలో బలగాల తరలింపు సమయంలో మిలిటెంట్ల మెరుపుదాడుల నేపథ్యంలో బలగాల తరలింపు, మొహరింపు, క్షతగాత్రుల తరలింపు, వైద్య సేవల కోసం హెలికాప్టర్లను ఇవ్వాలని కేంద్ర హోం శాఖను మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. రాష్ట్రంలో మళ్లీ మొదలైన ఘర్షణలు, ఉద్రిక్తతలపై ముఖ్యమంత్రి బీరెన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. తాజా ఉద్రిక్తతల్లో మయన్మార్ శక్తుల ప్రమేయం ఉండొచ్చని సీఎం అనుమానం వ్యక్తంచేశారు.

పాక్ ఉగ్రస్థావరాలపై ఇరాన్ దాడులు

- ఆగ్రహించిన పాకిస్తాన్
- తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిక
- తమ రాయబారిని వెనక్కి పిలిచిన పాక్

జెరూసలేం: పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తూ తమ దేశంలో ఉగ్రదాడులకు తెగబడుతున్న జైష్ అల్-అదిల్ ఉగ్రసంస్థ స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులతో విరుచుకుపడింది. దీంతో ఇప్పటికే హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంతో ఉద్రిక్తతలు పెరిగిన పశ్చిమాసియాలో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఇన్నాళ్లూ దౌత్య సంబంధాలు మాత్రమే కొనసాగుతున్న పాకిస్తాన్, ఇరాన్‌ల మధ్య ఒక్కసారిగా వైరం ప్రజ్వరిల్లింది. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని గ్రీన్ మౌంటేన్ పర్వతప్రాంతంలోని జైష్ అల్ అదిల్(ఆర్మీ ఆఫ్ జస్టిస్) సంస్థకు చెందిన రెండు స్థావరాలపై ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ బలగాలు డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడిలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు గాయపడ్డారు. ఇరాన్ విదేశాంగ మంత్రితో పాక్ ఆపద్ధర్మ ప్రధాని అన్వరుల్లా దావోస్ నగరంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో మంతనాలు జరిపిన రోజే ఈ దాడులు జరగడం గమనార్హం.

ఇరాన్ రాయబారిపై వేటు

జైష్ అనేది 2012లో పాక్‌లో నెలకొల్పిన సున్నీ ఉగ్రసంస్థ. ఇరాన్‌లో జైష్ తరచూ ఇరాన్ భద్రతాబలగాలపై దాడులకు దిగుతోంది. సైనికులను అపహరిస్తూ ఇరాన్ ప్రభుత్వానికి పెద్దతలనొప్పిగా తయారైంది. పాక్ సరిహద్దు పట్టణం పంజ్‌ఘర్ కేంద్రంగా పనిచేస్తూ జైష్ దాడులకు దిగుతోందని ఇప్పటికే పలుమార్లు ఇరాన్ ఆరోపించింది. ఈనెలలో సున్నీ ఉగ్రసంస్థ ఒకటి సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ సభలో జంట ఆత్మాహుతి దాడులకు పాల్పడి వంద మందిని బలితీసుకున్న విషయం తెల్సిందే. దీంతో సున్నీ ఉగ్రసంస్థలపై ఉక్కుపాదం మోపాలని ఇరాన్ నిశ్చయించుకుంది. అందులోభాగంగానే పాక్‌లోని జైష్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. అయితే తమ భూభాగంపై విదేశీ దాడిని పాకిస్తాన్ తీవ్రంగా ఆక్షేపించింది. పాక్‌లోని ఇరాన్ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారిని పిలిపించుకుని తన నిరసన వ్యక్తంచేసింది. తమ దేశంలోని ఇరాన్ రాయబారిని బహిష్కరించింది. ఇరాన్‌లోని తమ రాయబారిని వెనక్కి పిలిపించుకుంది. 'పాక్ గగనతలాన్ని అనుమతిలేకుండా వినియోగించడం, దుర్వినియోగం చేయడం ద్వారా ఇరాన్ అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించింది. ఇది పాక్ సార్వభౌమత్వాన్ని అవమానించడమే. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలను అపహాస్యం చేస్తూ ఇలా దాడులకు దిగడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని తీవ్ర పరిణామాలను ఇరాన్ ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని పాక్ ఆగ్రహం వ్యక్తంచేసింది.

ఇరాన్ ఆర్మీ అధికారి కాల్చివేత

జైష్ ఉగ్రస్థావరాలపై దాడి జరిగిన మరుసటి రోజే ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ అధికారిని ఉగ్రవాదులు కాల్చిచంపారు. పాక్, అఫ్గానిస్తాన్‌లతో సరిహద్దు పంచుకుంటున్న సిస్తాన్-బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఈ ఉగ్రదాడి ఘటన జరిగిందని ఇరాన్ అధికార వార్తా సంస్థ ఐఆర్‌ఎన్‌ఏ బుధవారం తెలిపింది.




బుధవారం బెళగావి దగ్గర బైలహొంగలలో ఆరంభమైన సంగొళ్ల రాయణ్ణ సైనిక పాఠశాల. కోట మాదిరిగా ఉన్న ప్రవేశద్వారం. అక్కడ అబ్బురపరిచే స్వాతంత్య్ర పోరాట దృశ్యాలు

న్యూస్‌రీల్

అర్చకుల వేతన పెంపునకు వినతి



సమావేశంలో పాల్గొన్న అర్చకులు

తుమకూరు: దేవదాయ శాఖ పరిధిలో పని చేసే అర్చకులకు వేతనాలు పెంచాలని వచ్చే నెల 7న బెంగళూరు టౌన్‌హాల్ ముందు ధర్నా చేస్తామని రాష్ట్ర ధార్మికదత్తి దేవాలయ అర్చకుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎంఎస్ వెంకటాచలయ్య తెలిపారు. తుమకూరు మారుతినగర శ్రీ వైష్ణవసభలో జరిగిన సమావేశం అనంతరం వెంకటాచలయ్య మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తమ కొన్ని డిమాండ్లు నెరవేర్చిందన్నారు. ఈ క్రమంలో సీఎం, డీసీఎం, దేవదాయ మంత్రికి అభినందనలతో పాటు మరికొన్ని కొత్త డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచేందుకు బుధవారం సమావేశం అయినట్లు ఆయన తెలిపారు. కర్ణాటక దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పని చేస్తే అర్చకులకు గౌరవధనాన్ని పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

19న ప్రధాని మోదీ రాక



దొడ్డబళ్లాపురం: ఈ నెల 19న రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. ఆ రోజు ఉదయం 9.35కి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కలబుర్గి విమానాశ్రయానికి వస్తారు. 9.40కి ప్రత్యేక హెలికాప్టర్ లో మహారాష్ట్రలోని షోలాపూర్‌కు వెళ్తారు. మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంటకు కలబుర్గికి చేరుకున్నారు, తరువాత 2.10 గంటలకు బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో దిగి, రోడ్డుమార్గాన దేవనహళ్లి తాలూకాలోని భట్టరమారనహళ్లికి వెళ్తారు. అక్కడ పలు కార్యక్రమాలలో పాల్గొని సాయంత్రం 4గంటలకు అక్కడి నుండి చెన్నైకి వెళ్తారు. ఈ నేపథ్యంలో ఎస్పీజీ అధికారులు కలబుర్గి ఎయిర్‌పోర్టును పరిశీలించారు. ఆ రోజున మోదీ బెంగళూరులో రోడ్‌షో చేస్తారనే వార్తలు కూడా ఉన్నాయి.

800 సీసీ కెమెరాలు వెతికి.. హంతకుని పట్టివేత

బనశంకరి: ఒంటరి మహిళను గొంతుపిసికి హత్య చేసిన ఘటనలో నిందితున్ని క్రైంబ్రాంచ్ పోలీసులు అరెస్టుచేశారు. ఈ నెల 4న ఎలక్ట్రానిక్ సిటీలో నీలం (30) అనే మహిళ ఇంటిలో ఉండగా, హంతకుడు చొరబడి హత్య చేశాడు. ఆమె భర్తకు హార్డ్‌వేర్ షాపు ఉంది. మధ్యాహ్నం ఆమె ఏడేళ్ల కుమారుడు స్కూలు నుంచి ఇంటికి రాగా హత్య విషయం బయటపడింది. అక్కడ ఎలాంటి ఆధారాలు దొరకలేదు. చివరకు పోలీసులు చుట్టుపక్కల 800 సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుని ఆచూకీ కనిపెట్టారు. సీసీ కెమెరాల్లో దొరుకుతానని తెలిసి అతడు ప్రతి వీధిలో టీషర్టును మార్చివేసి మస్కా కొట్టడానికి యత్నించాడు. కానీ ప్యాంటును మార్చలేదు. ఆ ప్యాంట్ ఆధారంగా కనిపెట్టి బుధవారం అతడిని అరెస్టు చేశారు. కారణాలు, సూత్రధారులు ఎవరనేది విచారణ సాగుతోంది.

ఇద్దరు అధికారులకు ఈసీ అవార్డులు

బనశంకరి: భారత ఎన్నికల కమిషన్ 2023 ఏడాదికిగాను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అందించే జాతీయ స్థాయి పురస్కారాలకు చిత్రదుర్గ జిల్లా కలెక్టర్ దివ్య ప్రభు, వాణిజ్యశాఖ శాఖ కమిషనర్ సీ.శిఖ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఈసీ తెలిపింది. ఈ నెల 25 తేదీన ఓటర్ల దినోత్సవం వేడుకల్లో అవార్డులను అందజేశారు.

ఐదేళ్లూ కుర్చీ.. మడత పేచీ

- సీఎం సిద్దు తనయుడు యతీంద్ర వ్యాఖ్యలతో తాజా కలకలం
- ఐదేళ్లూ మా నాన్నే పదవిలో ఉండాలని ప్రకటన
- ప్రతిపక్షాల విమర్శల దాడి

బనశంకరి: అధికార హస్తం పార్టీలో తరచూ ఏదో ఒక వివాదం పుట్టుకొస్తోంది. డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని మాగడి కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌సీ.బాలకృష్ణ డిమాండ్ చేయడం, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధిక సీట్లు గెలిస్తే సీఎం సిద్దరామయ్యే పూర్తికాలం సీఎంగా ఉంటారని ఆయన కుమారుడు యతీంద్ర ప్రకటించడంతో అధికార పార్టీలో వేడి రగుల్కొంది. ఇది ప్రతిపక్షాలకు కూడా విమర్శలకు అవకాశమిచ్చింది. సీఎం పదవిని తలా రెండున్నరేళ్లు పంచుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించినట్లు సర్కారు ఏర్పాటు సమయంలో జోరుగా ప్రచారం సాగింది. కానీ సీఎం, డీసీఎంల అనుచర ఎమ్మెల్యేలు, కొందరు మంత్రులు విరుద్ధమైన ప్రకటనలు చేయడం చర్చనీయాంశమవుతోంది.

హైకమాండ్ పదే పదే చెప్పినా..

సీఎం, డిప్యూటీ సీఎం పదవులపై ఎవరూ చర్చించరాదని, గ్యారంటీ పథకాల అమలు, లోక్‌సభ ఎన్నికలపై దృష్టిసారించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా హైకమాండ్ పెద్దలు పదేపదే హెచ్చరికలు జారీచేస్తున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు నోటికి పనిచెబుతూనే ఉన్నారు. మంగళవారం యతీంద్ర చేసిన ప్రకటన మరోసారి వివాదానికి ఆజ్యం పోసింది. ఆయన ప్రకటనపై మంత్రులు, సీనియర్ నేతలు దూరంగా ఉన్నారు.



ఐదేళ్లు విధానసౌధ పగ్గాలు ఎవరి చేతిలో ఉంటాయనేది తరచూ చర్చకు వస్తోంది



సీఎం తనయుడు యతీంద్ర



డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



సీఎం సిద్దరామయ్య

యతీంద్రవి వ్యక్తిగత వ్యాఖ్యలని, దీనికి పార్టీకి సంబంధం లేదని చాలామంది తప్పించుకున్నారు. కానీ బీజేపీ నేతలు హస్తంలో లుకలుకలు తీవ్రమైనట్లు ఆరోపణలు గుప్పించారు.

డీకేశిని చూస్తే జాలేస్తోంది: సింహా

మైసూరు: సీఎం కుర్చీలో పూర్తికాలం పాటు కొనసాగాలని సీఎం సిద్దరామయ్య పథకమేశారని, డిప్యూటీ సీఎం డీకేశిని చూస్తే పాపమనిపిస్తోందని ఎంపీ ప్రతాప సింహా ఎద్దేవా చేశారు. బుధవారం మైసూరులో మీడియాతో ఎంపీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికసీట్లు గెలిస్తే మా నాన్న పూర్తి కాలం సీఎంగా ఉంటారని యతీంద్ర చేసిన వ్యాఖ్యలపై ఎంపీ స్పందించారు. ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల తరువాత సీఎం కావాలని కలలు కంటున్న డీకే శివకుమార్‌ను ఇప్పుడు తలుచుకుంటే జాలి వేస్తోందని వ్యంగ్యమాడారు. డీకే సీఎం అవుతారని ఆయన వర్గీయులు ఓట్లు వేశారని, అయితే వారందరికీ మోసం జరిగిందని అన్నారు. సిద్దరామయ్య అందరి మధ్య గొడవలు పెట్టి పూర్తి కాలం పాటు అధికారంలో కొనసాగాలని చూస్తున్నారని విమర్శించారు. కోలారులో రాముని ఫ్లెక్సీని దుండగులు చింపేయడంపై ఎంపీ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ హయాంలో రామునికి గౌరవం దక్కదని ఆరోపించారు.

ఆ మాటల్లో తప్పేం లేదు: డీకేశి

యతీంద్ర పదవీ బాధ్యత లేని నేత, తమ నాయకునికి శక్తి ఇవ్వాలని ప్రజలను అడగడంలో తప్పుపట్టే పని లేదని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ అన్నారు. మా నాన్న ఐదేళ్లు సీఎం ఉండాలనేలా యతీంద్ర మాట్లాడడాన్ని బుధవారం కుమారకృప వద్ద మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా డీకే మాట్లాడారు. తమ ప్రభుత్వం కొనసాగుతుందని, సిద్దరామయ్య తమ ముఖ్యమంత్రి అన్నారు. సిద్దరామయ్య సీఎంగా, నేను కేపీసీసీ అధ్యక్షునిగా ఇద్దరూ కలిసి లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొంటామని తెలిపారు. అందులో ఎలాంటి అనుమానం లేదని, ఆశపడటం, శక్తి ఇవ్వాలని ప్రజలను అడగడంలో తప్పులేదు, నేను కూడా మా ప్రజలను ఇలాగే అడుగుతానంటూ వివాదాన్ని సద్దుమణిగేలా మాట్లాడారు.

స్నాచర్లను అడ్డుకున్న వృద్ధురాలు

మైసూరు: నడుచుకుంటూ వెళుతున్న ఒక వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లేందుకు యత్నించగా సాహసంతో ప్రతిఘటించింది. ఈ ఘటన మైసూరు మంచేగౌడన కొప్పలో జరిగింది. కొప్పలి నివాసి అయిన గిరిజమ్మ (61) ఇంటి వద్ద నడిచి వెళుతుండగా వెనుక నుంచి బైక్‌లో వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని బంగారు గొలుసులను లాగారు. వెంటనే తేరుకున్న గిరిజమ్మ 60 గ్రాముల బంగారు గొలుసును గట్టిగా చేతితో పట్టుకుంది. దీంతో స్నాచర్లు చేతికి అందిన 15 గ్రాముల గొలుసు ముక్కను లాక్కుని పారిపోయారు. విజయనగర పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. వృద్ధురాలు ధైర్యంగా వ్యవహరించడంతో 45 గ్రాముల బంగారాన్ని కాపాడుకుంది.

యువతను ఓటర్లుగా చేర్పించాలి

మండ్య: జిల్లా పాలన యంత్రాంగం , జిల్లా పంచాయతీ సహభాగస్వామ్యంతో ఈనెల 25న ఉదయం 10 గంటలకు జిల్లా పంచాయతీ కావేరి సభాంగణంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లాధికారి డా. కుమార్ తెలిపారు. జిల్లాధికారి ఆఫీసులో ఓటర్ల దినోత్సవం ఏర్పాట్లపై చర్చించారు. కుమార్ మాట్లాడుతూ 18ఏళ్లు దాటిన యువతను ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఓటర్ల నమోదుకు విశేషంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

కిడ్నాపర్‌కు ఐదేళ్ల జైలు

కోలారు: మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో కామాంధునికి 5 సంవత్సరాల జైలు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి బిపి దేవమానె తీర్పును ఇచ్చారు. తాలూకాలోని బైరాండహళ్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌గౌడ దోషి. వేమగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితునిపై బాలికను కిడ్నాప్ చేసిన కేసు నమోదైంది. విచారణ చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు పరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి శిక్షను విధించారు. అలాగే బాలికకు దోషి రూ.1.5 లక్షల పరిహారం అందించాలని జడ్జి ఆదేశించారు.

కారు ప్రమాదంలో ముగ్గురు మృతి

సాక్షి, బళ్లారి: దావణగెరె జిల్లాలో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. బుధవారం దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకా గరగ రోడ్డులో అగరబన్నిహట్టి క్రాస్ సమీపంలో రోడ్డులో నిలిచి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి వచ్చిన ఓమ్నీ కారు ఢీ కొనింది. కారులో ప్రయాణిస్తున్న నారాణిట్టిహళ్లి గ్రామానికి చెందిన సిద్దమ్మ (85), రుద్రేశప్ప (64), మల్లికార్జున (62) అనే ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైనాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫిబ్రవరి 2 నుంచి హంపీ ఉత్సవాలు

- ఈసారి ఘనంగా నిర్వహణ: కలెక్టర్

హొసపేటె: హంపీ ఉత్సవాలను ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు విజయనగర జిల్లాధికారి దివాకర్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఉత్సవాల ఏర్పాట్లను సమీక్షించారు. ఈసారి ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీర్మానించారన్నారు. ఈ ఉత్సవాల్లో కళాకారులకు గొప్ప అవకాశం కల్పిస్తున్నామన్నారు. నాలుగు వేదికల్లో ప్రత్యేకంగా చూపరులను ఆకట్టుకొనే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారన్నారు. ముఖ్య వేదికను విద్యారణ్య పీఠం వద్ద ఉన్న మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిగతా వేదికలను కడలెకాళు గణపతి, ఎదురు బసవణ్ణ వేదిక, విరుపాక్షేశ్వర ఆలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ అన్ని వసతులను కల్పిస్తూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం నడుం బిగించిందన్నారు. అనంతరం హంపీలో చేపడుతున్న పార్కింగ్ వ్యవస్థ, వేదికల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే లత, సీఈఓ సదాశివ ప్రభు, అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అలీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



హంపీ ఉత్సవాలకు వేళాయె... ఓ కట్టడం వద్ద సందర్శకులు

బస్సులపై అల్లరిమూకల దాడి

బనశంకరి: ఆటో, బైకుల్లో వచ్చిన అల్లరిమూకలు రెండు కేఎస్‌ఆర్‌టీసీ బస్సులపై రాళ్లు రువ్వి బస్సు అద్దాలు ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరిని నగర కాటన్‌పేటే పోలీసులు అరెస్టుచేశారు. ఇమ్రాన్, అరిఫ్ అనే ఇద్దరు యువకులు మెజస్టిక్ శాంతలా సిగ్నల్ వద్ద మంగళవారం అర్ధరాత్రి 1.45 సమయంలో మైసూరు నుంచి వచ్చిన రెండు కేఎస్‌ఆర్‌టీసీ బస్సులపై రాడ్లు, కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. బస్సు అద్దాలు ధ్వంసం కాగా ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న కాటన్‌పేటే పోలీసులు ఇద్దరిని అరెస్టుచేసి విచారణ చేపట్టారు. ఎందుకు బస్‌లపై దాడికి పాల్పడ్డారనేది తేలాల్సి ఉంది.

• లారీల సమ్మె బాట



బనశంకరి: కేంద్రం తెచ్చిన హిట్ అండ్ రన్ కేసుతో పాటు పలు సంస్కరణలను వ్యతిరేకిస్తూ బుధవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో లారీ డ్రైవర్లు, యజమానులు నిరవధిక సమ్మెకు దిగారు. ఫెడరేషన్ ఆఫ్‌లారీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన కొత్తచట్టాలు లారీ డ్రైవర్లకు మరణశాసనంగా ఉన్నాయని అన్నారు. హిట్ అండ్ రన్, ఇతర ప్రమాదాల కేసుల్లో లారీ డ్రైవర్లను కఠినంగా శిక్షించాలనే నిబంధనలు ఉన్నాయని, వీటిని వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాహన డ్రైవర్లు, యజమానుల ఒక్కూట అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని ఆరోపించారు. రవాణా రంగానికి తీవ్ర ఆటంకంగా ఉన్న చెక్‌పోస్టులు, జరిమానాలు, స్థానిక జామీను తదితర నిబంధనల్ని రద్దు చేయాలని కోరారు. కాగా, లారీల సమ్మెతో బెంగళూరుతో పాటు రాష్ట్రంలో సరుకుల సరఫరాలో ఇబ్బంది తలెత్తే అవకాశముంది.

కృష్ణశిల దొరికినచోట పూజలు



పూజలు చేస్తున్న దృశ్యం

మైసూరు: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో ప్రతిష్ఠించనున్న బాల రాముని విగ్రహం తయారీకి ఉపయోగించిన కృష్ణ శిల దొరికిన చోటుకు భక్తులు క్యూ కడుతున్నారు. మైసూరు తాలూకా హారోహళ్లి-గుజ్జేగౌడనపుర సమీపంలోని పొలం ప్రస్తుతం పుణ్యస్థలంగా మారిపోయింది. మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్.. రామలల్లా మూర్తిని మలచిన కృష్ణ శిలను సేకరించింది ఇక్కడే. మైసూరు ప్యాలెస్ అర్చకుడు ప్రహ్లాద్ రావు బుధవారం ఇక్కడ శాంతి పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మహిళలు కూడా వచ్చి హారతిని ఇచ్చారు. కృష్ణ శిల దొరికిన స్థలంలో వందలాది మంది ప్రార్థనలు చేశారు.

మార్చి 1 నుంచి పీయూసీ, 25 నుంచి టెన్త్ పరీక్షలు

బనశంకరి: రాష్ట్రంలో ఎస్ఎస్ఎల్‌సీ (టెన్త్), పీయూసీ (ఇంటర్) పరీక్షల టైంటేబుల్ వెలువడింది. మార్చి 25 నుంచి ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు ఆరంభమవుతాయి. టెన్త్ విద్యార్థులకు ఉదయం 10.15 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్షలు జరుగుతాయి.

ఇంటర్ పరీక్షలు ఇలా

అలాగే ద్వితీయ పీయూసీ విద్యార్థులకు మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు మొదలవుతాయి. ప్రతిరోజు ఉదయం 10.15 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తారు.

పుష్పవనం పిలుస్తోంది

- నేటి నుంచి లాల్‌బాగ్‌లో గణతంత్ర ఫ్లవర్ షో
- మురిపించనున్న పూల రూపాలు



అనుభవ మంటపం ఆకృతి, బసవేశ్వరుని విగ్రహం



పూల నెమలి వయ్యారం

బనశంకరి: నగర జీవితంలో అలసిన మనసులకు రంగురంగుల పుష్పాకృతులు, ఫల అలంకరణలు సాంత్వన ఇవ్వనున్నాయి. సిలికాన్ సిటీలో మరో పుష్ప ప్రదర్శన మరికొన్ని గంటల్లో ఆరంభం కాబోతోంది. లాల్‌బాగ్ బొటానికల్ ఉద్యానవనంలోని అద్దాల మేడలో రిపబ్లిక్ డే ఫల పుష్ప ప్రదర్శన నేడు గురువారం నుంచి 28వ తేదీ వరకు నగరవాసులకు కనువిందు చేస్తుంది. విశ్వగురు బసవణ్ణ, వచన సాహిత్య రచయితల థీమ్‌తో ఏర్పాటవుతోంది. రూ.2.85 కోట్ల వ్యయంతో 68 రకాలతో కూడిన 32 లక్షల పుష్పాలతో బసవణ్ణ థీమ్‌ను తీర్చిదిద్దారు. బసవణ్ణ, అక్కమహాదేవి, అంబిగరచౌడయ్య, ఆరళయ్య, శరణ విగ్రహాలను ఏర్పాటుచేశారు. పూలు, పండ్లు, సేంద్రియ స్టాల్స్ ఏర్పాటవుతాయి. సాయంత్రం 6 గంటలకు సీఎం .సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ లాంఛనంగా ప్రారంభిస్తారు.

టికెట్ రూ. 80

- ఫ్లవర్ షో కు పెద్దలకు సాధారణ రోజుల్లో రూ.80, సెలవు రోజుల్లో రూ.100, అలాగే 12 ఏళ్ల లోపు పిల్లలకు అన్ని రోజుల్లో రూ.30 టికెట్ ధరలను నిర్ణయించారు. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు యూనిఫారంలో వచ్చే విద్యార్థులకు సెలవురోజు తప్ప మిగతా రోజుల్లో ప్రవేశం ఉచితం.
- కార్లలో వచ్చేవారు శాంతినగర బీఎంటీసీ బస్టాండు వద్ద గల బహుళ అంతస్తు భవనంలో పార్కింగ్‌చేయాలి. ద్విచక్రవాహనదారులు అల్ అమీన్ కాలేజీ ఆవరణలో పార్కింగ్ చేయాలి.
- 130 సీసీ కెమెరాలతో, పెద్దసంఖ్యలో పోలీసులతో భారీ భద్రత చేపడతారు. అంబులెన్స్, ఫైర్, వైద్య సిబ్బంది, తేనెటీగలు, పాము, కుక్క కాటు కు ఇంజెక్షన్లతో సిద్ధంగా ఉంటారు.

క్లుప్తంగా

విభిన్న సంస్కృతితో దేశం సుసంపన్నం


వివిధ వేషధారణలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంప్లి: విభిన్న సంస్కృతి ద్వారా దేశం సుసంపన్నమైందని హృద్రోగ నిపుణులు డాక్టర్ విఠల్ అభిప్రాయ పడ్డారు. సండూరులోని కృష్ణానగర బీకేజీ గ్లోబల్ సమూహ సంస్థలో జరిగిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ దేశం అనేక భాషలు, విద్య, ఆచార, వేషభూషణలతో మహోన్నతమైందన్నారు. రామాయణ, మహాభారత భగవద్గీలో శ్రీకృష్ణుడి సందేశం తమ దేశాన్ని ఉత్తమంగా రూపొందించుకునేందుకు వరం అయిందన్నారు. విద్యార్థులు ఫేస్‌బుక్‌లకు దూరంగా ఉండాలన్నారు.

కృష్ణుడి ప్రసాదం కోసం ఎగబడ్డ భక్తులు


ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు

దొడ్డబళ్లాపురం: ఉడుపిలోని కృష్ణాపుర మఠంలో శ్రీకృష్ణుడి ప్రసాదం కోసం భక్తులు ఎగబడ్డారు. బుధవారం మఠంలో అన్ని కార్యక్రమాలు ముగిశాక సంప్రదాయం ప్రకారం పాకశాలలో మిగిలిన ఆహార పదార్థాలు(ప్రసాదం)తీసుకుని వెళ్లడానికి భక్తులకు అనుమతిస్తారు. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక కృష్ణాపుర మఠం విద్యాసాగరతీర్థ స్వామిజీ గోవింద నామస్మరణ చేసి భక్తులను పాకశాలలోకి అనుమతించడంతో భక్తులు ఒక్కసారిగా దూసుకువచ్చి మిగిలిన ఆహార పదార్థాలను తీసుకెళ్లారు. వంటలు వండే సమయంలో వంటపాత్రల్లో వెండి, బంగారు నాణేలు వేస్తారు. అదృష్టం ఉన్న భక్తులకు ఈ నాణేలు లభిస్తాయి. ఈ కారణంతో కూడా భక్తులు ప్రసాదం కోసం ఎగబడ్డారు.

పేర్లు వేరైనా దేవుడు ఒక్కడే

కంప్లి: పేర్లు వేరైనా దేవుడు ఒక్కడే అని, నమ్ముకున్న తమకు శ్రీరాముడు ప్రియమైన దేవుడని ఎంపీ లతా మల్లికార్జున అభిప్రాయం వ్యక్తం చేశారు. హరపనహళ్లి పట్టణం నుంచి శ్రీరామ భక్తుడు శశికుమార్ బృందం 51 అడుగుల పొడవు గల ధ్వజాన్ని సిద్ధం చేసి ప్రత్యేక పూజలు జరిపి అయోధ్యకు చేపట్టిన ప్రయాణాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఐటీ ఉద్యోగి మృతి

తనకల్లు: చికిత్స పొందుతూ ఎగువ తొట్లిపల్లికి చెందిన భానుప్రకాష్ (25) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు... కదిరి నియోజకవర్గం తనకల్లు పరిధిలోని తొట్లిపల్లికి చెందిన కృష్ణమూర్తి కుమారుడైన భానుప్రకాష్ బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేసేవాడు. అయితే ఆ ఉద్యోగం ఇష్టం లేని భానుప్రకాష్ వ్యవసాయం చేసుకుంటానని చెప్పి కొద్ది రోజుల క్రితం ఉద్యోగాన్ని వదిలేసి గ్రామానికి వచ్చేశాడు. ఉద్యోగం వదిలేస్తే ఆర్థికంగా ఇబ్బందులు పడతామని తల్లిదండ్రులు భానుప్రకాష్‌కు నచ్చజెప్పారు. అటు ఉద్యోగం చేయలేక, ఇటు తల్లిదండ్రులకు సర్దిచెప్పలేక తీవ్ర ఆవేదనకు లోనైన భానుప్రకాష్ ఈ నెల 3వ తేదీన టమాటా పంటకు వాడే పురుగుల మందును తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు భానుప్రకాష్‌ని చికిత్స కోసం అనంతపురానికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ బెంగళూరు అయితే వద్దనుకుని వచ్చేశాడో అక్కడే తుదిశ్వాస విడిచాడని బంధుమిత్రులు విలపించారు.

బాంబుపేలుడు బాధితుడికి పరిహారం

బనశంకరి: మంగళూరులోని నాగురి వద్ద చోటుచేసుకున్న కుక్కర్‌బాంబ్ పేలుడు ఘటనలో బాధితుడిగా ఉన్న ఆటో డ్రైవర్ పురుషోత్తమపూజారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల పరిహారం అందజేసింది. బుధవారం దక్షిణకన్నడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాధితుడికి చెక్ అందజేశారు.

రూ.7.37 లక్షల జరిమానా వసూలు

దొడ్డబళ్లాపురం: గత నెలలో బీఎంటీసీ చెకింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించి ప్రయాణికుల నుంచి వివిధ రకాలుగా జరిమానా రూపంలో బీఎంటీసీ రూ.7.37 లక్షలు వసూలు చేసింది. మహిళలకు కేటాయించిన సీట్లలో కూర్చుని ప్రయాణించిన 347మంది పురుష ప్రయాణికులకు కూడా జరిమానా విధించారు. అదేవిధంగా టికెట్ లేకుండా ప్రయాణించినవారి నుంచి జరిమానాలు వసూలు చేశారు. మొత్తం 3,849మంది నుంచి రూ.7,37,040వసూలు చేసినట్లు బీఎంటీసీ అధికారికంగా ప్రకటించింది.అదేవిధంగా బీఎంటీసీకి సంబంధించిన కండక్టర్లపై 1,085కేసులు నమోదు చేశారు. డిసెంబరు నెలలో బీఎంటీసీ చెకింగ్ స్క్వాడ్ 16,785 ట్రిప్పులు చెక్ చేశారు.

భక్తుల కొంగుబంగారం..దత్తాత్రేయ మందిరం

- కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు
- వేధిస్తున్న కనీస సదుపాయాల కొరత

సాక్షి,బళ్లారి: త్రిమూర్తుల అంశావతారం వెలసిన మహాపుణ్యక్షేత్రం గాణగాపుర భక్తుల సందడితో నిత్యం విరాజిల్లుతోంది. గురువులకే ఆది గురువైన శ్రీదత్తాత్రేయుడి దివ్య పాదుకలను దర్శించుకోవడానికి భక్తుల సందడి కొనసాగుతోంది. శ్రీమహావిష్ణువు దశావతార పరంపరలో భాగంగా అత్రి, అనసూయ దంపతులకు మార్గశిర పౌర్ణమి రోజున శ్రీహరి శ్రీదత్తాత్రేయుడుగా జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. భక్త రక్షణ కోసం యుగాల పర్యంతం నిలిచి ఉండటానికి శ్రీదత్తాత్రేయ క్షేత్రంలో నిత్యం భక్తులు వేనోళ్ల కీర్తించే గురుదైవం శ్రీదత్తాత్రేయులు, వారి నిండైన విగ్రహాలు గాణగాపురలో వెలసి ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురిని ఏకకాలంలో దర్శించుకుంటున్నామా అని భక్తులు పరవశించిపోయే మహాపుణ్యక్షేత్రమిది.

పాదుకల దర్శనానికి భక్తుల తాకిడి

శ్రీదత్తాత్రేయుడి పాదుకలను దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి తరలి వచ్చే భక్తులతో నిత్యం కిటకిటలాడుతోంది. దివ్యపాదుకలతో పాటు శ్రీకల్లేశ్వర ఆలయం, సంగమ భీమా దర్శనాలు ఇక్కడి విశేషత. శ్రీదత్త శరణం మమా అంటూ నిత్యం ఇక్కడికి స్మరించుకోవడానికి భక్తులు తరలి వస్తుంటారు. దక్షక్షేత్రంగా ప్రసిద్ధిపొందిన గాణగాపురలో ఉడిపిలో శ్రీకృష్ణుని దర్శనం మాదిరిగానే దత్తాత్రేయుడు శ్రీగురు పాదుకలను ఒక గవాక్షిలో దర్శనం చేసుకుంటూ భక్తులు పునీతులవుతుంటారు. భీమా, అమర్జా అనే రెండు నదుల సంగమం కూడా ఇక్కడ ఉంది. శ్రీదత్తాత్రేయుడు రెండో అవతారమైన శ్రీనరసింహస్వామి అని కూడా భక్తుల నమ్మకం.


లింగాకారంలో వెలసిన మహాశివుడు


గాణగాపురలో వెలసిన దత్తాత్రేయ ఆలయం

ఆలయం ఎక్కడ ఉందంటే..

సంగమ భీమా దర్శనం, గవాక్షి ద్వారా గురుపాదుకలను, కల్లేశ్వర, శనిమందిరం, ఆంజనేయ స్వామి, పంచముఖ గణపతిని, అశ్వర్థ వృక్షాన్ని, నరసింహ సరస్వతి ఆలయం, మేడిచెట్టును దర్శించుకునే శ్రీదత్తాత్రేయ ఆలయం కర్ణాటకలోని కలబుర్గి జిల్లా అఫ్జలపుర తాలూకాలోని గాణగాపురలో వెలసి ఉంది. మహాపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహామహిమాన్వితమైన, పవిత్రమైన గాణగాపురలో దత్తాత్రేయ ఆలయ పరిసరాల్లో సమస్యలు తిష్ట వేసినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్షాత్తు బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు కొలువుదీరారని భక్తులు విశ్వసించే, పురాణాలు ఘోషించే శ్రీదత్తాత్రేయ ఆలయ ముఖ ద్వారం ముందే రోడ్లు గుంతలమయంగా కనిపిస్తున్నాయి.

అస్తవ్యస్తంగా రోడ్లు, సమస్యల తిష్ట

శ్రీకల్లేశ్వర, శనశ్వరాలయానికి వెళ్లే దారి ఎక్కడో మారుమూల పల్లెటూరు, అడవిలో ఉన్న రోడ్ల మాదిరిగా అధ్వానంగా, కంకర, గుంతలమయంగా ఉంది. దీంతో రెండు కిలోమీటర్ల దూరం ఆలయం వద్దకు చేరుకునే ముందు దుస్థితిలో ఉండడంతో పాటు ఈ క్షేత్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం భక్తులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా గాణగాపురను దర్శించుకోవాలని భక్తులు ఆశించే మహిమాన్విత ప్రదేశంలో సదుపాయాలను కల్పించడంపై ఆలయ కమిటీ నిర్వాహకులు కూడా దృష్టి పెట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

అలరించిన ఎద్దుల ప్రదర్శన


విజేత ఎద్దుతో అతిథులు, నిర్వాహకులు

కేజీఎఫ్: నగరంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం ఎద్దులను ఆకర్షణీయంగా అలంకరించి ఎద్దుల ప్రదర్శన నిర్వహించారు. పోటీల్లో నగర, తాలూకాలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన ఎద్దులను ప్రదర్శించారు. నగర సమీపంలోని పారాండహళ్లికి చెందిన మనోహర్ రెడ్డికి చెందిన ఎద్దుకు ప్రథమ బహుమతి లభించింది. కార్యక్రమంలో డీఎస్పీ పాండురంగ, నగరసభ సభ్యుడు కోదండన్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి పశువుల జాతర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: తోర్నహళ్లి పశువుల జాతరను వైభవంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. బుధవారం తోర్నహళ్లిలోని సఫలాంబ దేవి ఆలయ ప్రాంగణంలో సఫలాంబ దేవి జాతర మహోత్సవం సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 23 నుంచి ఫిబ్రవరి 1 వరకు జాతర మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. పశువుల జాతరలో ఎలాంటి గందరగోళం లేకుండా జాగ్రత్త పడాలన్నారు. అంబులెన్స్, వైద్యులు, ఆరోగ్య సహాయకులు, జీపీ అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు. జాతరకు వచ్చే వారికి తాగునీరు, రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. తహసీల్దార్ కె.రమేష్, దేవదాయ శాఖ ఈఓ టి సెల్వమణి, వెంకటేష్‌గౌడ, లింగాపుర కిట్టణ్ణ పాల్గొన్నారు.

ఇంజిన్ మార్పు.. షోరూమ్‌కు జరిమానా

బనశంకరి: సర్వీస్ కోసం ఇచ్చిన కొత్త కారు ఇంజిన్ మార్చారనే ఆరోపణలు రుజువైన నేపథ్యంలో ఓ కంపెనీ షోరూమ్‌కు జిల్లా వినియోగదారుల ఫోరం రూ.75 వేల జరిమానా విధించింది. హాసన పట్టణ నివాసి మోహన్‌కుమార్ 2019 కొత్త కారు కొనుగోలు చేసి 2020 డిసెంబరులో సర్వీస్‌కోసం ఆ కంపెనీ షోరూమ్‌కు ఇచ్చారు. టర్బోచార్జర్ మరమ్మతుకు గురికావడంతో 15 రోజుల్లో రిపేరీ చేస్తామని మేనేజర్ తెలిపాడు. మూడునెలల తర్వాత కారు అందించారు. అయినప్పటికీ వాహనంలో సమస్య అలాగే ఉంది. ఒక మెకానిక్ వద్ద చూపించగా ఇంజిన్ మార్చిన విషయం వెలుగు చూసింది. దీంతో బాధితుడు హాసన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. షోరూమ్ నిర్వాహకులు వంచనకు పాల్పడినట్లు నిర్ధారించి జరిమానాగా విధించిన రూ.75వేలను వాహనదారుడికి చెల్లించాలని ఫోరం తీర్పు వెలువరించింది.

19 నుంచి ఒక్కలిగ పారిశ్రామికవేత్తల ఎక్స్‌పో


మాట్లాడుతున్న నాగశేఖర్

కోలారు: బెంగళూరు ప్యాలెస్ మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు ఒక్కలిగ పారిశ్రామికవేత్తల ఎక్స్‌పో-2024 నిర్వహిస్తున్నట్లు బెంగళూరు ఫస్ట్ సర్కిల్ సొసైటీ సభ్యుడు నాగశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఎక్స్‌పోలో వందకు పైగా పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ సేవలు, ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో 12 పారిశ్రామిక రంగాలపై చర్చ జరుగుతుందన్నారు. వ్యవసాయ, ఆరోగ్య, విద్య, ఎంఎస్ఎంఈ, ఆహార, ఆతిథ్య తదితర అన్ని రంగాలపై విస్తృతంగా చర్చలు జరుగుతాయన్నారు. కార్యక్రమాన్ని ఆదిచుంచనగిరి పీఠాధిపతి నిర్మలానందస్వామీజీ ప్రారంభిస్తారని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సమావేశానికి కర్ణాటక నుంచి మాత్రమే కాకుండా తమిళనాడు, కేరళ నుంచి కూడా ఒక్కలిగ పారిశ్రామికవేత్తలు హాజరవుతారన్నారు. సొసైటీ కార్యదర్శి రామచంద్ర, సభ్యుడు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో మహారాష్ట్ర జోక్యం ఏంటి?

- సీఎం సిద్దరామయ్య


సంగొళ్లి రాయణ్ణ విగ్రహాన్ని ఆవిష్కరించి పటానికి నమస్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య

రాయచూరు రూరల్: కర్ణాటక సరిహద్దుల్లో మహారాష్ట్ర జోక్యం చేసుకోరాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మహారాష్ట్ర సర్కార్‌కు సూచించారు. బుధవారం బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా సైనిక పాఠశాలలో సంగొళ్లి రాయణ్ణ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటక సరిహద్దులోని 865 గ్రామాల్లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న విషయంపై ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు. సైనిక పాఠశాలలో కన్నడిగులకు 65 శాతం, ఇతరులకు 35 శాతం సీట్లు కేటాయించామన్నారు. గుణాత్మక విద్యతో పాటు దేశభక్తిని పిల్లల్లో పెంచుతామన్నారు. సంగొళ్లి రాయణ్ణ జ్ఞాపకార్థం 110 ఎకరాల్లో ప్రభుత్వం నుంచి రాక్ పార్క్, వస్తు సంగ్రహాలయ నిర్మాణం చేపడుతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లలో గెలుపొందితే ఐదేళ్ల సీఎంగా ఎవరు కొనసాగుతారో పార్టీ తీర్మానం చేస్తుందన్నారు. బ్రిటిష్‌లపై పోరాడిన నేత సంగొళ్లి రాయణ్ణ కాగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దన్నారు.

బీజేపీ చేసిందేం లేదు

దేశం కోసం బీజేపీ చేసిందేమీ లేదని సీఎం ఆరోపించారు. రాయణ్ణను మోసంతో మన వాళ్లే బ్రిటిష్‌లకు అప్పగించారన్నారు. దేశ భక్తులంటే ప్రజలను ప్రేమించే వారన్నారు. నేడు బీజేపీ కులాలు, మతాల మధ్య ఘర్షణలు రాజేసిందని విమర్శించారు. బసవణ్ణ, అంబేడ్కర్‌లు కుల, మత, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అందరూ సమానమనే భావనలు కలిగిన వారన్నారు. మనిషి ద్వేషం వీడాలన్నారు. నేడు మసీదులు ధ్వంసం చేయమని సలహాలు ఇచ్చేవారున్నారన్నారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో నైపుణ్యతను సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పంచ గ్యారెంటీలతో అందరికీ మేలు జరిగిందన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు సహజమన్నారు. వాటిని లెక్కచేయకుండా ఉచిత పథకాలను ప్రజలకు అందించడం తమ కర్తవ్యమన్నారు. ఉత్సవాల్లో స్వామీజీలు గురులింగ శివాచార్య, మడివాళ రాజయోగీంద్ర, నిరంజనానందపురి, మంత్రులు సతీష్ జార్కిహోళి, శివరాజ్ తంగడిగి, బైరతి సురేష్, శాసన సభ్యులు మేటి, అశోక్ పట్టణశెట్టి, మాజీ ఎమ్మెల్యేలు రేవణ్ణ, అంజలి నింబాళ్కర్, ప్రకాష్ హుక్కేరిలున్నారు.

మామిడికి అంతర్జాతీయ ఖ్యాతి


కార్యక్రమంలో మాట్లాడుతున్న విజ్ఞాని కమల

శ్రీనివాసపురం: జిల్లాలోని శ్రీనివాసపుర తాలూకాలో పండించే మామిడి రాష్ట్ర, దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ప్రసిద్ధి పొందిందని సీనియర్ విజ్ఞాని కమల తెలిపారు. బుధవారం పట్టణంలోని మారుతి సభా భవనంలో రైతులకు మామిడి పంటపై నిర్వహించిన చర్చాగోష్టిలో మాట్లాడారు. ఇటీవల రైతులు మామిడి ఉత్పత్తిలో మార్పుల కారణంగా నష్టాల పాలవుతున్నారు. శాస్త్రవేత్తలు, శాఖ అధికారుల సూచనల మేరకు మామిడి పండించే విధానాన్ని పాటించాలని రైతులకు సలహా ఇచ్చారు. నాణ్యమైన మామిడి పంటను రైతులు పండించాలన్నారు. తద్వారా అధిక దిగుబడి, లాభార్జన సాధ్యమన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథ్ రెడ్డి, అనిల్‌కుమార్, మామిడి అభివృద్ధి మండలి అధ్యక్షుడు చిన్నప్పరెడ్డి, అధికారులు కుమారస్వామి, కేసీ మంజునాథ్ పాల్గొన్నారు.

నమో నారసింహా

- వైభవంగా నృసింహుడి పార్వేట ఉత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం


పార్వేట ఉత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు


అశ్వవాహనంపై ఊరేగుతున్న ఖాద్రీశుడు


సామూహిక పాలపొంగు ఉత్సవం

కదిరి టౌన్: వేలాది మంది భక్తుల నారసింహుని నామస్మరణతో కదిరి కొండ ప్రతిధ్వనించింది. అశ్వవాహనంపై కొలువుదీరిన ఖాద్రీశుని దర్శనంతో భక్తజనం మైమరచిపోయింది. సంక్రాంతి తర్వాత కనుమ రోజు ఆనవాయితీగా నిర్వహించే నృసింహుని పార్వేట ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది.

కమనీయంగా పాలపొంగుల ఉత్సవం

ఉదయం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుడిని విశేషంగా అలంకరించారు. అనంతరం పల్లకీపై కొలువుదీర్చి భక్తుల గోవింద నామస్మరణ మధ్య తిరువీధుల నుంచి గిరిప్రదక్షిణగా కదిరి కొండకు తీసుకువచ్చారు. అక్కడ కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కాటమరాయునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారు కుమ్మరవాండ్లపల్లి సమీపాన పాలపొంగుల ఉట్టిలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. కొలేపల్లికి చెందిన యాదవ కులస్తులు కొత్తకుండలో తెచ్చిన పాలతో పాలపొంగలి చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

కదిరికొండ..జనసంద్రం

పాలపొంగుల ఉత్సవం తర్వాత ఖాద్రీశున్ని పల్లకీలో కొలువుదీర్చి పార్వేట మండపం వద్దకు తీసుకురాగా, వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రెండు కుందేళ్లను జనం మధ్యకు వదలగా యువకులు ఉత్సాహంగా వాటిని వెంబడించి వాటి శరీర భాగాలను లాక్కున్నారు. పార్వేట ముగియగానే స్వామివారిని రాయచోటి రోడ్డులోని మశానంపేటలోని శమీ మండపానికి తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం శ్రీవారు అశ్వవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమం ముగియగానే చోర సంవాదం తర్వాత స్వామివారు ఆలయ ప్రవేశం చేశారు. భక్తులకు వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

కోలారు వార్తలు...

మార్చిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశం


మాట్లాడుతున్న శివశంకర్

కోలారు: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగుల బలోపేతం కోసం మార్చి నెలలో బెంగళూరులో 5వ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శివశంకర్ తెలిపారు. బుధవారం నగరంలోని స్కౌట్ భవనంలో ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగుల సమన్వయ సమితి జాగృతి సమావేశంలో ఆయన మాట్లాడారు. సముదాయ ఉద్యోగులు సంఘటితంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం సాధ్యమన్నారు. సామూహిక నాయకత్వంతోనే ఏదైనా సాధించడానికి వీలవుతుందన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక విద్యావంతుడు అంబేడ్కర్ మన భారతీయుడు కావడం దేశానిక గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయి సమావేశం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.మోహన్, కెంపసిద్దయ్య, జాయింట్ సెక్రెటరీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందించిన దృశ్యం

కోలారు: వ్యాపారాల్లో లాభాలు సంపాదించడంతో పాటు వచ్చిన లాభాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తేనే సార్థకత అని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన విద్యార్థి వేతన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మలబార్ ట్రస్టు పేద విద్యార్థుల విద్యా ప్రగతికి సహకారం అందిస్తోండడం హర్షణీయమన్నారు. సమాజంలో విద్యా, ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యోగ రంగాల్లో ప్రభుత్వం తన సేవలను ప్రజలకు సక్రమంగా అందించినప్పుడే సమాజంలోని అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం మలబార్ సంస్థ జిల్లాలోని 615 మంది విద్యార్థులకు రూ.55 లక్షల ఉపకార వేతనాలు అందజేసింది. ఎమ్మెల్సీ ఎం ఎల్ అనిల్ కుమార్, ట్రస్టు జోనల్ హెడ్ శరవుద్దీన్, విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప పాల్గొన్నారు.

మహిళలపై దౌర్జన్యాలకు చట్టాలతో చెక్


ప్రారంభిస్తున్న జడ్జి గణపతి గురుసిద్ధ బాదామి

కోలారు: మహిళలు, పిల్లలపై బాల్యవివాహాలు, అత్యాచారాల అడ్డుకట్టకు బాల్యవివాహ నిషేధ, పోక్సో చట్టాలను అమలు చేసినట్లు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి గణపతి గురుసిద్ధ బాదామి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. పిల్లలపై దౌర్జన్యాలను అరికట్టడానికి 2012లో పోక్సో చట్టాన్ని తెచ్చారన్నారు. సీనియర్ న్యాయమూర్తి ముజఫర్ ఎ.మాంజరి మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం వివాహానికి కనీస వయస్సు ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. బాల్య వివాహాలతో ఆరోగ్యంపై కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థినులకు వివరించారు. బాల్య వివాహానికి లోనైన పిల్లలు మానసిక దౌర్బల్యానికి గురవుతారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ, న్యాయమూర్తి మంజునాథ్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి, బీఈఓ ముని వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మృతిపై కూడా కాంగ్రెస్ రాజకీయం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: అంబేడ్కర్ జీవించి ఉండగా, మరణించినప్పుడు కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేసి ఆయనను అవమానం పాల్జేసిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సిమెంట్ మంజు తెలిపారు. బుధవారం నగరంలోని ప్రైవేటు కళ్యాణ మంటపంలో నిర్వహించిన భీమా సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు చేసిన అవమానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అంబేడ్కర్‌కు మరణానంతరం భారతరత్న అవార్డును కాంగ్రెస్సేతర ప్రభుత్వం వచ్చిన తరువాతే ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంబేడ్కర్‌కు సంబంధించిన ఐదు స్థలాలను అభివృద్ధి చేశారని, దీనిపై ప్రజల ముందుకు తీసుకు వెళ్లాల్సి ఉందన్నారు. అంబేడ్కర్ కాంగ్రెస్ పార్టీ రగులుతున్న ఇల్లు అని అనాడే వ్యాఖ్యానించారన్నారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్.మహేష్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ వ్యవస్థ బలపడకుంటే దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికార అవధిలో దళితులకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. దారిద్ర్య రేఖ కంటే దిగువన దళితులు, మైనారిటీలు ఉన్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి భవిష్యత్తులో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు చేసిన అవమానాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నడుచుకుంటోందన్నారు. ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు బీపీ వెంకటమునియప్ప, వై సంపంగి, బాలరాజ్, బి వి మహేష్, రాము పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భారం నివారించండి

కోలారు: ప్రభుత్వానికి ఆర్థిక భారం కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలను స్థానికంగా ఉన్న పాఠశాల ప్రాంగణంలో నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయ భవనంలో వివిధ పథకాల ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల, అంగన్‌వాడీ తదితర ప్రభుత్వ కట్టడాల దాఖలాలను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రభుత్వం నిర్మించి ఇచ్చే అంగన్‌వాడీ, పాఠశాల గదుల దాఖలాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. వివాదిత కట్టడాలను స్థానిక ప్రాధికారలు త్వరగా పరిష్కరించాలని సూచించారు. సముదాయ ప్రముఖులను కలిసి యేడాది పొడవునా ఖాళీగా ఉండే సముదాయ భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, జిల్లా న్యాయ సేవా ప్రాధికార కార్యదర్శి సునీల్ హొసమని, స్త్రీశిశు సంక్షేమ శాఖ డీడీ నారాయణస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ డ్రైవర్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న క్యాంటర్, డ్రైవర్ల సంఘం నాయకులు

గౌరిబిదనూరు: మోటారు వాహన చట్టంలో కొత్తగా చేర్చిన సెక్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లారీ డ్రైవర్లు బుధవారం నగరం వెలుపల గంగానగరంలో ధర్నా నిర్వహించారు. క్యాంటర్ వాహనాల ఓనర్లు, డ్రైవర్ల సంఘం మాజీ అధ్యక్షుడు సుబ్రమణి మాట్లాడుతూ హిట్ అండ్ రన్ ప్రమాదాలకు డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధిస్తూ తెచ్చిన చట్టం డ్రైవర్లకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందన్నారు. వారి జీవితాలు రోడ్డున పడతాయన్నారు. వెంటనే ఆ చట్టంలోని సెక్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాలూకా అధ్యక్షుడు ఇనాయత్ ఉల్లా, కార్యదర్శి హరీశ్,కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అత్తవారింటికి వెళ్తూ హఠాన్మరణం

మైసూరు: బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి హఠాన్మరణం చెందాడు. ఈ ఘటన మైసూరు జిల్లా హుణసూరులో జరిగింది. కేఆర్ నగర పండ్ల వ్యాపారి మహమ్మద్ రియాజ్ (50) కేఆర్ నగర నుంచి హుణసూరు డిపోకు చెందిన బస్సులో పిరియాపట్టణలోని భార్య ఇంటికి వెళ్లేందుకు హుణసూరుకు వచ్చాడు. ప్రయాణికులంతా బస్సులో నుంచి దిగినప్పటికీ అతను అలాగే ఉండిపోయాడు. డ్రైవర్ రాజేశ్, కండక్టర్ దినేశ్ వచ్చి చూడగా చలనం లేకుండా కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రియాజ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేసి, మృతుడి భార్య రేష్మాభానుకు సమాచారం అందించారు.

అమ్మవారి సన్నిధిలో క్రికెటర్ కేఎల్ రాహుల్



దొడ్డబళ్లాపురం: ప్రముఖ క్రికెటర్ కేఎల్ రాహుల్ కొల్లూరు మూకాంబికదేవి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 25నుంచి ఇంగ్లాండ్‌పై ప్రారంభం కానున్న 5 టెస్ట్ మ్యాచ్‌లో ఆడనున్న రాహుల్ కొన్ని రోజుల్లో టీంలో చేరనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కొల్లూరు వెళ్లి మూకాంబికదేవిని దర్శించుకున్నారు.

బస్సు ఢీ.. ఒకరి మృతి

మైసూరు: మైసూరు నగరం కేఆర్ సర్కిల్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పడిన 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడిన ఇతన్ని కేఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని దేవరాజ పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసినవారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

22న సీతారాముల ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన



పునరుద్ధరించిన సీతారాముల ఆలయం

గౌరిబిదనూరు: తాలూకాలోని తొండేబావి హోబళీ పోతేనహళ్లి గ్రామంలో పునరుద్ధరించిన శ్రీరామ ఆలయంలో ఈనెల 22న సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రామణ్ణ నేడు తెలిపారు. అయోధ్యలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్టాపన జరిగే సమయంలోనే ఇక్కడ కూడా ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ దేవతల పూజ, మృత్తికాహరణం, పుణ్యాహవాచనం, దేవనాంది, అంకురార్పణ, ధ్వజా రోహణం, సప్తశుద్ధి, గణపతి హోమం, ప్రతిష్ఠాపనా కార్యం, గోపూజ, పుష్పవృష్టి, శ్రీ రామ తారక మంత్ర హోమం ధార్మిక కార్యక్రమాలు బాలకృష్ణభట్ నేతృత్వంలో జరగనున్నట్లు రామణ్ణ తెలిపారు.

ప్రియురాలిపై ప్రేమోన్మాది దాడి

శివమొగ్గ: వేరొకరితో వివాహానికి సిద్ధమైందన్న అక్కసుతో ప్రియురాలిపై యువకుడు కత్తితో పొడిచాడు. ఈ ఘటన శివమొగ్గ నగరంలో జరిగింది. జిల్లాలోని హాడోనహళ్లి గ్రామానికి చెందిన యువకుడు, అదే గ్రామానికి చెందిన యువతి గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి మధ్య ఇటీవల పొరపొచ్చాలు, మనస్తాపాలు వచ్చాయి. దీంతో ఆమె మరొకరితో వివాహానికి సిద్ధమైంది. ఈ క్రమంలో శివప్పనాయక సర్కిల్‌లో వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో ఊగిపోయిన యువకుడు కత్తితో ప్రియురాలిని పొడిచాడు. అక్కడే ఉన్నస్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. బాధిత యువతిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

రామాంజనేయ రథ ఘోష



శ్రీరామాంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని



రామాంజనేయస్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

మైసూరు: జిల్లాలోని హుణసూరు తాలూకా దొడ్డహెజ్జూరలో శ్రీరామాంజనేయ స్వామి రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. దొడ్డకెరె ఆవరణలో రథోత్సవానికి ముందు భక్తుల జయ జయధ్వనుల మధ్య దేవస్థానం నుంచి శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి దేవాలయం చుట్టు ప్రదక్షణలు చేశారు. మధ్యాహ్నం 1. 30 గంటలకు అలంకరించిన తేరులో ఉత్సవమూర్తిని ఎక్కించి తేరును లాగారు. భక్తులు తేరుపైకి అరటిపండ్లు విసిరి మొక్కుకున్నారు. రామాంజనేయ స్వామికి జై అనే నినాదాలతో హోరెత్తింది. ఎమ్మెల్యే జీడీ హరీశ్ గౌడ, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆఫీసుల్లో కూర్చుంటే సమస్యలు తెలుస్తాయా?



మాట్లాడుతున్న మంత్రి కృష్ణబైరేగౌడ

మైసూరు: కార్యాలయాల్లో కూర్చొని అధికారం చెలాయించే సంస్కృతిని వీడి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని జిల్లాధికారులు, తహసీల్దార్లకు రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ సూచించారు. బుధవారం మైసూరు ప్రాంతీయ కమిషనర్ కార్యాలయంలోని చాముండేశ్వరి సభాంగణంలో జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎదురైన భీకర కరువు నిర్వహణలో రెవెన్యూ శాఖ పాత్ర ఎంతో కీలకమని, సమస్యలు రాకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఎం జనతాదర్శన్‌లో ప్రజలు ఎక్కువగా రెవెన్యూ సమస్యల గురించే వినతులు సమర్పిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఆఫీసుల్లో కూర్చోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలన్నారు.

పదవులు కట్టబెట్టేది హైకమాండే

సీఎం, డీసీఎం వంటి పదవులు కట్టబెట్టే అధికారం కేవలం కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌దేనని కృష్ణబైరేగౌడ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఎక్కువ సీట్లు సాధిస్తే సిద్ధరామయ్య ఐదేళ్లు సీఎంగా కొనసాగుతారని ఆయన కుమారుడు యతీంద్ర చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ ఎవరు ఎప్పుడు సీఎం, డీసీఎం అవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. ఇలాంటి చర్చల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని కొట్టిపారేశారు.

బనశంకరీ దేవీ నమోస్తుతే!

- నేటి నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలు



బనశంకరి: బెంగళూరు వాసుల కొంగు బంగారమైన బనశంకరీదేవి జాతరమహోత్సవాలు అశ్వయుజ శుద్ధ అష్టమి గురువారం నుంచి ఈనెల 29 తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ లక్ష్మీ, ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ బుధవారం వివరాలు వెల్లడించారు. 18 తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు గంగపూజ, మూలదేవర అనుజ్ఞ, యాగశాలప్రవేశ, గణపతిపూజ, కలశ స్థాపన, వాస్తు హోమ, ప్రాకారోత్సవ, వాస్తుబలి, అష్టదిక్పాలకబలితో జాతర మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19న సహస్రమోదక శ్రీ మహాగణపతి హోమం, 20న నవగ్రహ, మృత్యుంజయ, పవమానహోమం, 21న శ్రీలక్ష్మీ నారాయణ హృదయహోమ, శ్రీదన్వంతరిహోమం, 22న రుద్రహోమం, పర్వతమల్లికార్జునస్వామికి బిల్వార్చన, 23న దుర్గా, శ్రీసూక్త, సారస్వతహోమం, సాయంత్రం దుర్గా దీపనమస్కారం. 24న నవచండికాహోమం, 25న 11.50 నుంచి 12 .50 గంటళ మధ్య శుభమేషలగ్నంలో రథోత్సవం ఉంటుంది. 26న లలితాసహస్రనామ హోమం, 27న శాకాంబరి సహస్రనామహోమం, మధ్యాహ్నం 3 గంటలకు వసంతోత్సవం, 28న శ్రీ గిరిజాశంకరకళ్యాణోత్సవం, రాత్రి 8 గంటలకు బనశంకరీదేవి శయనోత్సవం, 29 తేదీ మహార్యాస పూర్వక ఏకాదశివార రుద్రాభిషేకంతో ఉత్సవాలు ముగుస్తాయి.

చిరుత సంచారంతో గజగజ



లేగ దూడ ఉదర భాగాన్ని చిరుత తినేసిన దృశ్యం

పావగడ: తాలూకాలోని మంగళవాడ గ్రామంలో చిరుత సంచార ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామం లోని కరియమ్మన ఆలయం వద్ద పొలంలో ఏర్పాటు చేసుకున్న షెడ్‌లోకి చిరుత చొరబడి లేగదూడను చింత చెట్టుపైకి ఈడ్చుకు పోయి హతమార్చింది. బుధవారం ఉదయం గ్రామస్తులు వెళ్లి చూడగా దూడ శరీరంపై చిరుత పాదాల గుర్తులు కన్పించడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దూడ మృత దేహాన్ని, అక్కడ ఉన్న పాదాల గుర్తులను గమనించి చిరుత సంచారాన్ని నిర్ధారించారు. మూడు రోజుల క్రితం గ్రామ శివారులో చిరుత సంచరించినట్లు మరికొందరు తెలిపారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన జయణ్ణ అనే రైతుకు చెందిన 10 గొర్రెలను చిరుత హతమార్చిందని తెలిపారు.

ఆలయ భద్రతా సిబ్బంది దాష్టీకం

- హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి

మైసూరు: చాముండిబెట్ట ఆలయ భద్రతా సిబ్బంది దాష్టీకానికి పాల్పడ్డారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన బెంగళూరుకు చెందిన హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేయడమే కాకుండా అతని భార్యతో అనుచితంగా ప్రవర్తించారు. ఘటనకు సంబంధించి సెక్యూరిటీ గార్డులు రోహిత్, హేమంత్, మహదేవస్వామిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బెంగళూరు అన్నపూర్ణేశ్వరీనగర పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ హరీశ్ సంక్రాంతి పండుగ నేపథ్యంలో మైసూరు చాముండిబెట్టకు కుటుంబ సమేతంగా వచ్చాడు. రూ.100 టికెట్ దర్శనం కోసం లైన్‌లో వెళుతుండగా హరీశ్ మామ రామణ్ణకు తల తిరిగింది. దీంతో రామణ్ణను వెనక్కి తీసుకెళ్లేందుకు హరీశ్ రాగా భద్రతా సిబ్బంది అతనితో గొడవ పడ్డారు. హరీశ్‌కు, సెక్యూరిటీ గార్డుల మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతరం హరీశ్‌పై దాడి చేశారు. దీన్ని ప్రశ్నించిన హరీశ్ భార్యను కూడా నిందిస్తూ అనుచితంగా మాట్లాడారు. ఈ ఘటన అనంతరం హరీశ్ తన భార్యతో కలసి కేఆర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ముగ్గురు సెక్యూరిటీ గార్డులపై కేసు నమోదు చేశారు.

జనస్పందన సభలకు విశేష స్పందన

పావగడ: తాలూకాలోని అరసికెర, మంగళవాడ గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన జన స్పందన సభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వందలాది మంది ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నయా పైసా ఖర్చు కాకుండా ప్రభుత్వ అధికారులే మీ గ్రామాలకు వచ్చి సమస్యలు తీర్చే జన సంపర్క సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినులు ఎమ్మెల్యేను కోరారు. గృహలక్ష్మి సొమ్ము ఖాతాల్లోకి జమ కావడం లేదని పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళవాడలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం, నాడ కచేరి భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తహసీల్దార్ వరద రాజు, టీపీఎస్ ఈఓ జానకి రాం, టీహెచ్ఓ తిరుపతయ్య, వ్యవసాయ, అటవీ శాఖ, విద్యా శాఖ, జెడ్పీ, పీడబ్ల్యూడీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీణ్యా ఫ్లైవంతెనపై రాకపోకలు బంద్

- వాహనదారులకు ఇక్కట్లు



పై వంతెనపై రాకపోకలను నిలిపివేసిన దృశ్యం

దొడ్డబళ్లాపురం: రాజధాని బెంగళూరు నుంచి ప్రముఖ జిల్లాలకు వెళ్లే ప్రధాన రహదారి తుమకూరు రోడ్డులోని పీణ్యా పై వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. హైవే అథారిటీ ఆధ్వర్యంలో వంతెన లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తున్న కారణంగా మంగళవారం రాత్రి 11గంటల నుంచి రాకపోకలు నిలిపివేశారు. ఈనెల 19 ఉదయం 11గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైవే అథారిటీ అధికారులు ప్రకటించారు. ఈ వంతెనపై తుమకూరు రోడ్డులో 24గంటలపాటు వాహనాల రద్దీ ఒకేలా ఉంటుంది. హాసన్, శివమొగ్గ, చిక్కమగళూరు, చిత్రదుర్గ, బళ్లారి, రాయచూరు, బెళగావి, హుబ్బళ్లి తదితర జిల్లాలకు, మహారాష్ట్ర ముంబై, పూణె ప్రాంతాలకూ ఇదే మార్గాన వెళ్లాలి. నిత్యం లక్షల సంఖ్యలో వాహనాలు సంచరిస్తుంటాయి. వంతెనపై రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హోసూరు వార్తలు..

ఎంజీఆర్‌కు ఘన నివాళులు

హోసూరు/ కెలమంగలం/ క్రిష్ణగిరి: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు దివంగత ఎంజీఆర్ 107వ జయంతిని బుధవారం క్రిష్ణగిరి జిల్లాలో అన్నాడీఎంకే నాయకులు ఘనంగా నిర్వహించారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమ జిల్లా వ్యాప్తంగా అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు ఎంజీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. పట్టణంలోని రామ్‌నగర్ అన్నావిగ్రహం వద్ద ఎంజీఆర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి సమర్పించారు. అక్కడి నుంచి చిత్రపటాన్ని రథంపై ఉంచి పట్టణంలో ఊరేగించారు. కేక్ కటింగ్, అన్నదానం నిర్వహించారు. బాగలూరులో జిల్లా కౌన్సిలర్ ఆర్.కే.రవికుమార్ నేతృత్వంలో జరిగింది. డెంకణీకోట, కెలమంగలం, అంచెట్టి, తళి, రాయకోట, సూళగిరి తదిరత ప్రాంతాలలో నేతలు నివాళులు అర్పించారు.

ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

హోసూరు: కుటుంబ కలహాల కారణంగా ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన సిఫ్‌కాట్ వద్ద జరిగింది. వివరాల మేరకు ధర్మపురి జిల్లా పాలకోడు సమీపంలోని మారండపల్లి ప్రాంతానికి చెందిన వినోద్‌కుమార్ (25) హోసూరు పారిశ్రామికవాడ చిన్నయలసగిరి ప్రాంతంలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కుటుంబంలో సమస్యల వల్ల తీవ్ర ఆవేదనకు లోనై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటనపై సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో మహిళ...

కెలమంగలం: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకొన్న ఘటన తళి వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని బిన్నమంగలం గ్రామానికి చెందిన సునీల్ భార్య ఆశా (27) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతోంది. అయినా నయం కాక విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. తళి పోలీసులు శవాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

బైకిస్టు దుర్మరణం

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో బెంగళూరు వాసి మృతి చెందాడు. వివరాలు..బెంగళూరుకు చెందిన మోహన్ (35) మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంలో సూళగిరి సమీపంలోని సామలపల్లం వద్ద వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన మోహన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు.

మహిళను బలిగొన్న ఏనుగు

- మృతదేహంతో బంధువుల ధర్నా



ఆందోళన చేస్తున్న బాధితురాలి బంధువులు

కెలమంగలం: జిల్లాలో ఏనుగుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయి. కెలమంగలం సమీపంలో ఏనుగు దాడిలో మహిళ ప్రాణాలు కోల్పోయింది. వివరాల మేరకు కెలమంగలం సమీపంలోని హనుమంతపురం గ్రామానికి చెందిన మహేష్ భార్య మమత (27). వీరికి వనిత(11), శివకుమార్(8), మనోజ్(6) పిల్లలున్నారు. మమత కెలమంగలంలోని ఓ హోటల్లో పనిచేస్తుంది. బుధవారం ఉదయం పనికి వెళ్లాలని కెలమంగలంకు నడిచి వెళ్తూ ఓ బైకిస్టు రాగా లిఫ్ట్ తీసుకొంది. కొద్ది దూరం వెళ్లగానే సినిగిరిపల్లి మామిడి తోటలో పొంచి ఉన్న ఒంటి ఏనుగు వారిపై దాడి చేసింది. బైకిస్టు పారిపోగా, మహిళను వెంటాడి తొండంతో బాది హతమార్చింది.

పరిహారానికి హామీ

హనుమంతపురం గ్రామస్తులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. కెలమంగలం, ఉద్దనపల్లి పోలీసులతో పాటు హోసూరు డీఎస్పీ బాబుప్రశాంత్, డెంకణీకోట డీఎస్పీ మురళి ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. అటవీ శాఖ ద్వారా ముగ్గురి పిల్లలకు తలా రూ. 5 లక్షలు పరిహారం అందించడంతో పాటు పిల్లల చదువులకయ్యే పూర్తి ఖర్చులను అటవీ శాఖ భరిస్తుందని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకొన్నారు. ఈ ఘటన బుధవారం ఉదయం ఆ ప్రాంతంలో తీవ్ర సంచలనం సృష్టించింది.



మమత (ఫైల్)

కారు మీద ఏనుగుల రౌద్రం



కారుపై దాడి చేసి వెళ్లిపోతున్న ఏనుగులు

క్రిష్ణగిరి: జిల్లాకేంద్రం క్రిష్ణగిరి సమీపంలో సంచరిస్తున్న జంట ఏనుగులు గత రెండు రోజులుగా పొలాల్లో పంటలను పాడు చేస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం ఏకంగా జాతీయ రహదారిపైకి వచ్చిన ఏనుగులు ఒక కారును అడ్డుకున్నాయి. కారును తొండంతో కొట్టి దంతాలతో పొడిచాయి. డ్రైవర్ కారు నుంచి పరుగెత్తి బయటపడ్డాడు. అదృష్టవశాత్తు కారులో జనం లేకపోవడంతో ముప్పు తప్పింది. ఏనుగు దాడితో కారు ముందు చక్రం పంచరైంది. కారు కూడా కొంచెం దెబ్బతినింది. జంట ఏనుగులు జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, అటవీ శాఖాధికారులు వాటిని దూరంగా తరిమివేయాలని స్థానిక జలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

పీహెచ్‌డీ ప్రదానం



ఏఆర్ రామయ్య

మండ్య: తాలూకాలోని వీసీ ఫారం పీయూ కాలేజీ అధ్యాపకుడు ఏఆర్ రామయ్యకు హంపి కన్నడ విశ్వవిద్యాలయ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. సమాజశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధగంగమ్మ మార్గదర్శనంలో రామయ్య పరిశోధన చేశాడు. ఇటీవల హంపిలో జరిగిన నుడిహబ్బ–32లో అయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

దోపిడీ ఘటనలో ఐదుగురి అరెస్ట్

దొడ్డబళ్లాపురం: అప్పులు తీర్చడానికి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుమంది జైలు పాలయ్యారు. గురు,రేణుక దంపతులతోపాటు రుద్రేశ్, సందీప్, ప్రభావతిని కొడిగేహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు ఈనెల 14న ఉదయం కొడిగేహళ్లి పరిధిలోని తిండ్లు వద్ద ఉన్న గంగ ఆయుర్వేదిక్ మసాజ్ సెంటర్‌లోకి చొరబడ్డారు. యజమాని అనుశ్రీని కాళ్లు, చేతులు కట్టేసి, మత్తుమందు ఇచ్చి నగదు, మాంగల్యం చైను లాక్కొని పరారయ్యారు. నిందితుల్లో ఒకరైన రేణుకకు అనుశ్రీ స్నేహితురాలు కావడం గమనార్హం. కేసు నమోదు చేసుకున్న కొడిగేహళ్లి పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

కులాలను చూసి కాంగ్రెస్ పదవులు ఇవ్వదు



మంత్రి రాజణ్ణను సన్మానిస్తున్న దృశ్య

తుమకూరు: కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కూడా కులాల ఆధారంగా జనసంఖ్యను చూసి పదవులు ఇవ్వదని, దేవరాజు అరసు, ధరంసింగ్, వీరప్ప మొయిలీ వీరంతా యోగ్యత, అర్హత కలిగి ఉండడంతో అధికారం చేజిక్కించుకున్నారని సహకార మంత్రి కేఎన్ రాజణ్ణ పేర్కొన్నారు. నగరంలోని డాక్టర్ గుబ్బి వీరణ్ణ కళాక్షేత్రంలో వెనుకబడిన వర్గాల ఒక్కూట ఏర్పాటు చేసిన వెనుకబడిన వర్గాల ఒక్కూట దశమానోత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అధికారాన్ని కట్టబెట్టిందని కొనియాడారు. బీజేపీ, జేడీఎస్ పార్టీల్లో ఇది సాధ్యమా అని ప్రశ్నించారు.

జనమన్ యోజనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీ ప్రతాప్‌సింహ

మైసూరు: బుడకట్టు సామాజికవర్గం ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న ఆదివాసి జనజాతి న్యాయ అభియాన (పీఎం జనమన్ యోజన)ను మైసూరు–కొడగు జిల్లాల్లో విజయవంతం చేయాలని అధికారులకు ఎంపీ ప్రతాప సింహ సూచించారు. బుధవారం మైసూరు నగరం జలదర్శిని గెస్ట్‌హౌస్‌లోని తన కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. పీఎం జనమన్ పథకాన్ని ఆదివాసీలు వినియోగించుకునేలా జాగృతం చేయాలన్నారు.

హిట్ అండ్ రన్‌కు హోటల్ కార్మికుడు బలి



శివశంకరప్ప(ఫైల్)

దొడ్డబళ్లాపురం: హిట్ అండ్ రన్‌కు వ్యక్తి బలైన ఘటన దొడ్డపట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దొడ్డబళ్లాపురం పట్టణ పరిధిలోని రాజీవ్ గాంధీ ఆశ్రయ కాలనీ నివాసి శివశంకరప్ప(54) యలహంకలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని బస్సులో బయల్దేరి బసవభవనం వద్ద దిగాడు. అక్కడినుంచి కాలినడకన ఇంటికి వెళ్తుండగా పాలకేంద్రం వద్ద అపరిచిత వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో శివశంకరప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. దొడ్డబళ్లాపురం పట్టణ పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డెక్కిన ఉపాధ్యాయులు



ఆందోళనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గౌరిబిదనూరు: డిమాండ్ల సాధన కోసం ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు బుధవారం ఎమ్మెల్యే కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేశారు. సంఘం అధ్యక్షుడు మధుసూదన రెడ్డి మాట్లాడుతూ 7 వవేతన సంఘం సిఫార్సులు అమలు చేయాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, ఆరోగ్య సంజీవిని పథకాన్ని వర్తింపజేయాలని, పార్ట్ టైమ్ ఉద్యోగులను పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. . సంఘం కార్యదర్శి సింహాద్రి, ఉపాధ్యక్షుడు మంజునాథ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రెడ్డెప్ప, కార్యదర్శి బాలప్ప, అంబిక పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'సుప్రీం'లో ఫైబర్‌నెట్ కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఫైబర్‌నెట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు ముందస్తు బెయిల్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అంతకు ముందు ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో చంద్రబాబు ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ధర్మాసనం సభ్యుల్లో ఒకరైన జస్టిస్ బేలా త్రివేది మరో కేసు విచారణలో ఉండటం వల్ల.. బుధవారం చంద్రబాబు కేసు విచారణ సాధ్యం కాలేదు. విచారణ తేదీని త్వరలో ప్రకటిస్తామని న్యాయమూర్తి జస్టిస్ అనిరుద్ధ బోస్ తెలిపారు.

బాబుకు చిప్పకూడు తప్పదు

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ప్రొద్దుటూరు క్రైం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పటికైనా జైలుకు వెళ్లక తప్పదని, ఆయన శేష జీవితం చిప్పకూడు తింటూ సెంట్రల్ జైల్లో గడపాల్సిందేనని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో బుధవారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంలో ఉండి ప్రజల సొమ్మును కాజేసిన కేసులో 52 రోజుల పాటు జైల్లో ఉన్న చంద్రబాబు తాను నేరం చేయలేదని చెప్పకుండా.. 17ఏ సెక్షన్ తనకు వర్తించదని గగ్గోలు పెడుతుండడం న్యాయ కోవిదులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తుందని చెప్పారు. తన రిమాండు రిపోర్టు చెల్లదని.. అక్రమంగా అరెస్ట్ చేశారంటూ సుప్రీంకోర్టుకు వెళ్లారన్నారు. 'క్వాష్'పై సుప్రీంకోర్టు జడ్జీలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసినప్పటికీ రిమాండు రిపోర్టును క్వాష్ చేయడానికి కుదరదని చెప్పారని గుర్తు చేశారు. చంద్రబాబును రిమాండుకు పంపడం చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తెలిపినట్లేనని ఎమ్మెల్యే అన్నారు. 17ఏ సెక్షన్ అనేది నేరస్తులను సంరక్షించడానికి కాదని కోర్టు చెప్పిన విషయాన్ని ఎమ్మెల్యే రాచమల్లు గుర్తు చేశారు.

చంద్రబాబు మరోసారి జైలుకెళ్లేది ఖాయం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వెంకటాచలం: చంద్రబాబు మరోసారి జైలుకు వెళ్లడం ఖాయమని, 17ఏ కేసు తీర్పులో ఆయనకు రిమాండ్ విధించడాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకించలేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాళెం గ్రామంలో బుధవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. 17ఏ కేసుకు సంబంధించి చంద్రబాబుపై సీఐడీ అభియోగాలు మోపి రిమాండ్‌కు పంపడం గానీ, విచారణ జరిగిన తీరులో గానీ ఎలాంటి తప్పులు లేవని, జరగాల్సిన ప్రక్రియలోనే జరిగాయని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. చంద్రబాబుకు 17ఏ వర్తిస్తుందా లేదా అనే విషయంలో ఇద్దరు న్యాయమూర్తులూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ.. ఆయనకు అనుకూలంగా చెప్పలేదన్నారు. 17ఏ చంద్రబాబుకు వర్తిస్తుందని ఓ న్యాయమూర్తి.. వర్తించదని మరో న్యాయమూర్తి తీర్పు ఇచ్చిన విషయాన్ని గమనించాలని చెప్పారు. టీడీపీ శ్రేణులు చంద్రబాబుకు ఊరట అని సంకలు కొట్టుకోవడంలో అర్థం లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఈ కేసు నుంచి తప్పించుకోలేడని, జీవిత చరమాంకంలో జైలు శిక్ష అనుభవించడం ఖాయమని మంత్రి కాకాణి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

తెలంగాణ

చౌటుప్పల్/సూర్యాపేట: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలంతా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం సైతం రద్దీ కొనసాగింది. హైవేపై వాహనాలు పెద్ద సంఖ్యలో బారులు తీరాయి. మధ్యాహ్నం తర్వాత రద్దీ ఒక్కసారిగా పెరిగింది. సూర్యాపేట శివారులోని జనగామ క్రాస్‌రోడ్డు వద్ద, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ జామ్ అయింది. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16 టోల్‌బూత్‌లకు గాను హైదరాబాద్ వైపునకు 12 బూత్‌లను కేటాయించారు. హైవేపై రద్దీతో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేశారు.

భద్రాద్రిలో ఏప్రిల్ 17న శ్రీసీతారాముల కల్యాణం

9 నుంచి 23 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 17న సీతారాముల కల్యాణమహోత్సవం జరగనుంది. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఏప్రిల్ 9 నుంచి 23వ తేదీ వరకు వసంత పక్ష ప్రయుక్త బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైదిక కమిటీ బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఏప్రిల్ 9న క్రోధి నామ సంవత్సరఉగాది సందర్భంగా మూలమూర్తులకు స్నపన తిరుమంజనం, నూతన పంచాంగ శ్రవణం, అదే రోజు బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

కుప్పం నేలపై కృష్ణమ్మ పరవళ్లు

27 ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ.. కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించిన కృష్ణా జలాలు

బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. కొండలు, గుట్టలు దాటుకుని ప్రవహిస్తూ.. 672 కిలోమీటర్ల దూరంలోని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గలగలమని పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ బుధవారం చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించింది. ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు ప్రజలు కాలువ వద్దకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 35 ఏళ్లు ఎమ్మెల్యేగా.. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కుప్పానికి కృష్ణా జలాలు తరలించడంలో విఫలమయ్యారు. 2022 సెప్టెంబర్ 23న కుప్పంలో జరిగిన సభకు హాజరైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. చంద్రబాబు హయాంలో ఆగిపోయిన కుప్పం కాలువ పనులను పూర్తి చేస్తామని, కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు ఇస్తే సస్యశ్యామలం అవుతుందని ప్రకటించారు. అన్నట్టుగానే మాట నిలుపుకున్నారు. కృష్ణా జలాలు కుప్పం ఉపకాలువలో ప్రవహిస్తూ బుధవారం ఉదయం 11 గంటలకు రామకుప్పం మండలం వర్ది కుప్పం వద్ద (కుప్పం ఉపకాలువ కిలోమీటర్ 64.278 వద్ద) కుప్పం నియోజకవర్గంలోకి ప్రవేశించాయి. జనం తండోపతండాలుగా తరలివచ్చి ఈ అపూర్వ ఘట్టాన్ని తిలకించారు. కృష్ణమ్మకు హారతులు పట్టి ఆహ్వానించారు. శ్రీశైలం నుంచి 27 ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ కుప్పానికి తరలిస్తున్నారు. బుధవారానికి శ్రీశైలం నుంచి కుప్పం సరిహద్దు వరకు 672 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తూ కృష్ణమ్మ కుప్పం నేలను తడిపింది. సముద్ర మట్టానికి 758 మీటర్ల ఎత్తున నీటిని తరలిస్తూ కాలువలోకి ప్రవహింపజేస్తున్నారు. ప్రస్తుతం చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



కుప్పం నియోజకవర్గంలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు



కుప్పం నియోజకవర్గంలోకి ప్రవేశించిన కృష్ణా జలాలను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

అసంపూర్తి పనులను పూర్తి చేసి..

టీడీపీ హయాంలో 2015లో జరిగిన టెండర్లలో కుప్పం కాలువ పనులను మూడు కాంట్రాక్టు సంస్థల జాయింట్ వెంచర్ 4 శాతం ఎక్సెస్‌తో రూ.430.26 కోట్లకు దక్కించుకుంది. ఒప్పందం మేరకు 123.641 కిలోమీటర్ల కాలువ తవ్వకం, 324 స్ట్రక్చర్స్, 5చోట్ల ఎన్‌హెచ్ క్రాసింగ్ పనులు, మూడుచోట్ల ఎత్తిపోతల పథకాల నిర్మాణం, 110 చెరువులకు నీరందించే పనులు పూర్తి చేయాలి. ఈ పనులను ఇష్టారీతిన నిర్వహించి 2018 నుంచి అసంపూర్తిగా వదిలేశారు. 2019 నుంచి పనులు పూర్తి చేయించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టి కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చినా పట్టించుకోలేదు. సీఎం చొరవతో భూ సేకరణకు రూ.40 కోట్లు మంజూరు చేశారు. 4.80 కిలోమీటర్ల పెండింగ్ కాలువ, 103 స్ట్రక్చర్స్, 1,43,130 క్యూబిక్ మీటర్ల మట్టిపని, 22,933 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు, గుడిపల్లె మండలంలో రైల్వే క్రాసింగ్ టన్నెల్ పనులు 45 మీటర్లు జరగాల్సి ఉండేది. వీటి పనులు పూర్తి చేయించడమేకాక గత కాంట్రాక్టర్ల పనుల్లో లోపాలను సరిచేయించి కాలువలో నీటి తరలింపునకు ఇబ్బందులు తొలగించడంతో ప్రస్తుతం కృష్ణా జలాలు ప్రవహిస్తున్నాయి.

ఎందుకు నీళ్లివ్వలేదు బాబూ!

కుప్పానికి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన చంద్రబాబు తన హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కృష్ణా జలాలు తరలించానని గొప్పగా ప్రచారం చేసుకున్నారు. 2019 జనవరి 21న ప్రారంభమై ఏప్రిల్ 11 వరకు పుంగనూరు ఉపకాలువలో కృష్ణా జలాలు పారించారు. 82 రోజులు పారించినా పనులు పూర్తి చేయించక పోవడంతో కుప్పం కాలువలోకి నీళ్లు పారలేదు. బాబు పాలనలో వచ్చిన కృష్ణా జలాలు 775 ఎంసీఎఫ్‌టీలు (మిలియన్ క్యూబిక్ ఫీట్స్) మాత్రమే. ఈ నీటిలో 207 కిలోమీటర్ల పుంగనూరు ఉపకాలువ (గడ్డంవారిపల్లె నుంచి బొమ్మరాజుపల్లె వరకు) లో 742.19 ఎంసీఎఫ్‌టీలు, 43 కిలోమీటర్ల కుప్పం కాలువలో 32.81 ఎంసీఎఫ్‌టీల నీరు పారింది. 123 కిలోమీటర్లు మేర ఉండే కుప్పం కాలువలో పలమనేరు నియోజకవర్గంలోని అప్పినపల్లె నుంచి 43వ కిలోమీటర్‌లోని వి.కోట మండలం నార్నిపల్లె వరకు జలాలు సాగి ఆగిపోయాయి. తన పాలనలో కుప్పం కాలువ పనులు పూర్తి చేయించలేకపోయిన చంద్రబాబు.. వైఎస్ జగన్ పనులు చేయించలేదని గగ్గోలు పెట్టారు. అయితే.. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనులు పూర్తి చేయించి కుప్పానికి కృష్ణా జలాలు పారిస్తున్నారు.

జగనన్న చొరవతోనే కుప్పానికి నీళ్లు

రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలోకి కృష్ణమ్మ ప్రవేశించిన సందర్భంగా ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి ఎమ్మెల్సీ, చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కేఆర్‌జే భరత్ గంగమ్మకు పూజలు నిర్వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో హంద్రీ–నీవా కాలువ ద్వారా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాల రాక ప్రారంభమైందన్నారు. ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా ఢిల్లీలో చక్రాలు తిప్పుతున్నామని గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి శాశ్వత నీటివసతి కల్పించలేక పోయారన్నారు. గత ఏడాది కుప్పం పర్యటనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాలువ పనులను పూర్తిచేసి కుప్పానికి నీటిని విడుదల చేశారన్నారు. మరో 15 రోజుల్లో కాలువ చివరి అంచున ఉన్న పరమసముద్రానికి నీరు చేరగానే మళ్లీ సీఎం జగన్ కుప్పం వస్తారని చెప్పారు. హంద్రీ నీవా కాలువ ద్వారా కుప్పం నియోజకవర్గంలోని సుమారు 110 చిన్న నీటి చెరువులకు నీరు చేరుతుందన్నారు. అదేవిధంగా ఒక టీఎంసీ సామర్థ్యంతో శాంతిపురం మండలం ముద్దనపల్లి, గుడుపల్లి మండలం యామిగానిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నట్టు భరత్ తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ.. కుప్పం ప్రజల నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, ఆశల సాకారంపై చంద్రబాబు ఉత్తర కుమార ప్రగల్భాలకు పరిమితమైతే సీఎం వైఎస్ జగన్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారన్నారు.



వర్దికుప్పం వద్ద కృష్ణ జలాలకు పూజలు చేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ భరత్

సుప్రీం తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు

బాబు అరెస్టు, రిమాండ్ సక్రమంగానే జరిగాయని సుప్రీంకోర్టు చెప్పింది

- ఎల్లో బ్యాచ్ దుష్ప్రచారం ఈ తీర్పుతో కొట్టుకుపోయింది
- పుణెలో సీబీఐ సోదాలతో స్కిల్ కుంభకోణం బయటపడింది
- ఎంవోయూలో మార్పులతో రూ.371 కోట్లు ఇతర సంస్థలకు మళ్లించారు
- వాటి ద్వారా నిధులను స్వాహా చేశారు
- దేశంలో అరెస్టయిన ఏ నాయకుడికీ కల్పించనన్ని సౌకర్యాలు ఏపీ ప్రభుత్వం కల్పించింది
- అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రూ.371 కోట్లు ప్రజల సొమ్మును పక్కదారి పట్టించి స్వాహా చేసిన కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబునాయుడుకు చెంపపెట్టులాంటిదని రాష్ట్ర ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజాధనాన్ని దోచిన కేసులో ప్రభుత్వం చట్టపరంగా ముందుకెళితే రాజకీయ కక్ష సాధింపులంటూ కొంతమంది నాయకులు, పచ్చ మీడియా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఇన్ని రోజులూ వారు ప్రభుత్వంపై చల్లిన బురద సుప్రీంకోర్టు తీర్పుతో కొట్టుకు పోయిందని తెలిపారు. పూణేలోని కేంద్ర సంస్థలు, స్కిల్లర్ అనే సంస్థ లావాదేవీలను సీబీఐ అధికారులు పరిశీలిస్తుండగా చంద్రబాబు ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం బయటకు వచ్చిందని చెప్పారు. పూణేలోని అనేక సంస్థలకు వందల కోట్లు నిధులు వస్తున్నాయని సీబీఐ పరిశీలనలో తేలిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఎంవోయూలో మార్పులు చేసి రూ.371 కోట్లు ఇతర సంస్థలకు మళ్లించి, వాటి ద్వారా నిధులను స్వాహా చేశారన్నారు. ఈ విషయంపై 2018 జూన్ 6న సీబీఐ విచారణకు ఆదేశించిందని చెప్పారు. జీవో ప్రకారం సీమెన్స్ 90 శాతం నిధులు ఇవ్వలేదని అప్పటి ఆర్థిక శాఖ అధికారులు చంద్రబాబుకు చెప్పినా, ఆయనకున్న విస్తృత అధికారాలతో ఆమోదించారని, ఆ తర్వాత నిధుల స్వాహా జరిగిందని అన్నారు. ఈ కుంభకోణంపై చట్ట ప్రకారమే ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసు కాదని, ఈ కేసులో విచారణ, అరెస్టు, రిమాండ్ అన్నీ సక్రమంగానే జరిగాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. కోర్టు విచారణను కొనసాగించాలని చెప్పిందని తెలిపారు. ఎఫ్ఐఆర్‌ని రద్దు చేయాలని చంద్రబాబు కోరినా సుప్రీంకోర్టు అంగీకరించలేదని చెప్పారు. ఈ కేసు వాదనలు వినిపిస్తున్న తనను ప్రచార మాధ్యమాల ద్వారా దారుణంగా దూషించారని, ఇది సబబు కాదని అన్నారు. గౌరవనీయ కోర్టులు, న్యాయమూర్తులపై కూడా దుష్ప్రచారం చేశారన్నారు. మహిళా న్యాయమూర్తిని కూడా దూషించారన్నారు. న్యాయమూర్తులపై డిబేట్‌లు పెట్టి మానసికంగా హింసించారన్నారు. భార్య అనారోగ్యం కారణంగా రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ శెలవు పెడితే, ప్రభుత్వం ఆయన్ని బెదిరించి శెలవు పెట్టించిందని ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. ఈ కేసులో సాక్ష్యాధారాలిచ్చిన ఐఏఎస్ అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వం చంద్రబాబు పట్ల గౌరవంతోనే వ్యవహరించింది

చంద్రబాబు అరెస్టు, రిమాండ్ సమయంలో ప్రభుత్వం ఆయన పట్ల సహృదయంతో, గౌరవంతో వ్యవహరించిందని తెలిపారు. బాబును అరెస్టు చేయడానికి డీఐజీ స్థాయి అధికారిని ప్రభుత్వం పంపిందని, ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి ఇంత పెద్ద స్థాయి అధికారిని పంపడం దేశంలో మొట్టమొదటిసారి అని చెప్పారు. రోడ్డుపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటుందని భావించిన ప్రభుత్వం హెలికాప్టర్ సౌకర్యం కల్పించిందన్నారు. జైలు మాన్యువల్‌ను కాదని చంద్రబాబుకు అవసరమైన సదుపాయాలు కల్పించిందన్నారు. బాబు కోసం జైల్లో బ్లాక్‌లను శుభ్రం చేసి, ఏసీలు ఏర్పాటు చేసిందని చెప్పారు. దేశంలో ఎందరో సీఎంలు, ప్రముఖ నాయకులు జైలుకు వెళ్లారని, ఎవరికీ ఇవ్వని సకల సౌకర్యాలు చంద్రబాబుకు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఇలా సకల సౌకర్యాలు కల్పించడం కక్ష సాధింపు అవుతుందా అని ప్రశ్నించారు. చంద్రబాబు మెడికల్ బెయిల్ పొందిన తర్వాత ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లి బెయిల్ క్యాన్సిల్ చేయాలని కోరలేదని, ఆయన పట్ల ప్రభుత్వం రాగద్వేషాలకు పోలేదనడానికి, సహృదయంతో వ్యవహరించిందని అనడానికి ఈ ఒక్క విషయం చాలని తెలిపారు.

ఇంత ప్రచారం చేసే వ్యక్తులు రూ.371 కోట్లు సక్రమంగా విడుదల చేశామని ఎక్కడా చెప్పడంలేదన్నారు. అరెస్టు సక్రమం కాదంటున్నారే తప్ప అవినీతి జరగలేదని చెప్పడం లేదని చెప్పారు.


పరిటాల సునీతకు షాక్

- రాప్తాడు రేసులో రియల్ ఎస్టేట్ వ్యాపారి
- రెండ్రోజుల్లో టీడీపీ అధిష్టానంతో భేటీ
- పరిటాల సునీత వర్గంలో కలవరం
- రాప్తాడులో సునీతకు అనుకూలంగా లేదని టీడీపీ ప్రచారం మొదలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:తమ కుటుంబానికి రెండుచోట్ల ఎమ్మెల్యే టికెట్లు వస్తున్నట్టు ప్రచారం చేసుకున్న పరిటాల సునీతకు గట్టి షాక్ తగిలింది. 2009, 2014 ఎన్నికల్లో రాప్తాడు నుంచి గెలిచిన సునీత 2019లో ఓటమి పాలైన విషయం విదితమే. నాలుగోసారి కూడా రాప్తాడు నుంచి టీడీపీ తరఫున సునీత పోటీ చేస్తారని భావిస్తూ వచ్చిన ఆమె అనుచరుల్లో ధీమా సన్నగిల్లుతోంది. రోజుకో సమీకరణంతో టికెట్ ఎక్కడిస్తారో నమ్మకం లేకుండాపోయింది. మొన్నటివరకు రాప్తాడుతోపాటు ధర్మవరం టికెట్ తమకే అని పరిటాల కుటుంబం చెప్పుకుంది. ఇప్పుడు అందులో ఒక టికెట్‌పై ఆశలు వదులుకోవాల్సి వస్తుండటంతో కలవరం మొదలైంది.

రాప్తాడు నుంచి తెరపైకి రియల్టర్

అనంతపురం జిల్లాకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రాప్తాడు నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీకి దిగుతున్నారనే ప్రచారం తెరమీదకు వచ్చింది. ఈ సీటు కోసం ఆయన భారీ మొత్తంలో పార్టీ ఫండ్ ఇచ్చేందుకు అధిష్టానంతో డీల్ కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఈ నెల 18 లేదా 19న ఆయన పార్టీ అధిష్టానాన్ని కలవనున్నట్టు చెబుతున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో బంధువర్గం ఉండటంతోపాటు బాగా డబ్బు ఖర్చు చేయగలిగిన సామర్థ్యం ఉండటంతో అధిష్టానం ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.



రాప్తాడు ఇవ్వకపోతే ధర్మవరం?

రాప్తాడు నియోజకవర్గంలో సునీతకు టికెట్ ఇవ్వని పక్షంలో ధర్మవరం పంపించాలనే యోచనలో టీడీపీ ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే తనకు ధర్మవరం టికెట్ కావాలని సునీత కుమారుడు శ్రీరామ్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. తాజా పరిణామాలతో శ్రీరామ్‌కు టికెట్ ఇచ్చే పరిస్థితి లేకపోగా.. తల్లి సునీతకు ధర్మవరం టికెట్ ఇవ్వొచ్చని అంటున్నారు. రాప్తాడులో సునీతకు అనుకూల పరిస్థితులు లేవని, కొత్త అభ్యర్థి అయితే బావుంటుందని కూడా ఆలోచిస్తున్నారు. సునీతకు నియోజకవర్గంలో అనుకూలంగా లేదనే ప్రచారాన్ని తెలుగుదేశం పార్టీ ఇప్పటికే మొదలుపెట్టింది.

సూరిని తీసుకుంటే పరిస్థితి ఏమిటి?

చంద్రబాబు ఎక్కడున్నా తగవులు పెట్టి తన్నుకునేలా చేస్తారనే విమర్శ ఉంది. ధర్మవరం నియోజకవర్గంలో వరదాపురం సూరికే టికెట్ ఇవ్వాలని ఆలోచిస్తూనే సునీతకు కూడా ఇస్తామని లీకులిస్తున్నారు. ఒకవేళ ధర్మవరం నియోజకవర్గానికి సూరిని నియమిస్తే సునీతను పెనుకొండకైనా పంపించాలని మరో వాదన వినిపిస్తోంది. ఉదయం లేచినప్పటి నుంచి చంద్రబాబు జపం చేసే పరిటాల సునీతకు స్థానచలనం చేస్తే ఏళ్ల తరబడి నమ్మకంతో ఉన్న మన పరిస్థితి ఏమిటన్న ఆందోళన కేడర్‌లో మొదలైంది.

కొంప ముంచుతున్న నాన్చుడు ధోరణి

చంద్రబాబు చివరివరకూ నాన్చుడు ధోరణి అవలంభిస్తుండటంతో టికెట్ ఆశిస్తున్న నాయకులు మానసికంగా కుంగిపోతున్నారు. ఎన్నికల ముహూర్తం ముంచుకొస్తున్నా.. ఎక్కడ ఏ అభ్యర్థో తేల్చకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా మొత్తం గందరగోళంగా ఉంది. 2019లో చంద్రబాబును నమ్ముకుని రూ.కోట్లు ఖర్చు చేశామని, ఇప్పుడు కూడా ఆయన్ని నమ్ముకుంటే మునుగుతామో తేలుతామో అర్థం కావడం లేదని సీనియర్ నాయకులు వాపోయారు.

సాక్షి లైఫ్.. మీ ఆరోగ్య నేస్తం



వైద్య రంగంలో విశ్వసనీయమైన సమాచారాన్ని అందించేందుకు 'సాక్షి లైఫ్'ను తీసుకొచ్చింది సాక్షి మీడియా గ్రూప్. సమస్త ఆరోగ్య సమచారాన్ని సమగ్రంగా ఆర్టికల్స్, వీడియోల రూపంలో తీర్చిదిద్దింది. ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు నిష్ణాతులైన డాక్టర్ల సూచనలు, సలహాలతోపాటు ఆహారం, వ్యాయామాల గురించి వివరంగా ఇందులో నిక్షిప్తం చేసింది. life.sakshi.com పేరుతో వచ్చిన ఈ వెబ్‌సైట్‌లో వైద్యరంగానికి సంబంధించిన అన్ని అప్‌డేట్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వివిధ విభాగాలకు సంబంధించి ప్రముఖ వైద్యుల ఇంటర్వ్యూలు, నిపుణుల సలహాలను వీడియోల రూపంలో యూట్యూబ్‌లో sakshi life ఛానల్‌లో అప్‌లోడ్ చేసింది.

'సాక్షి' ఇద్దరి స్ఫూర్తితో ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. వైద్యరంగం నుంచి వచ్చి రాజకీయ నాయకుడిగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించిన మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఒకరు. రూపాయికే వైద్యం అందించి ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయిన వైఎస్సార్.. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆరోగ్యశ్రీ ని తీసుకొచ్చి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మరొకరు డాక్టర్ ఈ.సీ.గంగిరెడ్డి. నిస్వార్థ వైద్య సేవలకు మారుపేరుగా నిలిచి ప్రజల గుండెల్లో కొలువైన డాక్టర్ ఈసీ గంగిరెడ్డి వైద్యం వృత్తి కాదు, ప్రాణం అని నమ్మారు. ఈ ఇద్దరి మహనీయుల స్ఫూర్తితో 'సాక్షి లైఫ్ ' తెలుగు ప్రజల ముందుకు వస్తోంది.


ఆరోగ్య సమాచారాన్ని సులువుగా తెలుగు వారందరికీ అందించాలన్నదే 'సాక్షి' లక్ష్యం. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, శ్రీమతి వై.ఎస్.భారతి రెడ్డి 'సాక్షి లైఫ్' వెబ్‌సైట్ తోపాటు యూట్యూబ్ ఛానెల్ ను లాంఛనంగా ఆవిష్కరించారు. సాక్షి లైఫ్ ప్రజలందరి ఆరోగ్య నేస్తం. అందుబాటులో ఉన్న వేర్వేరు వైద్య విధానాల గురించి చెప్పడమే కాదు, అసలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి కూడా తెలియజేస్తుంది.

life.sakshi.com
https://www.youtube.com/@life.sakshi

సాక్షి లైఫ్ ప్రారంభం సందర్భంగా ప్రముఖ డాక్టర్లు ఏమన్నారంటే...



'హెల్త్ కు సంబంధించిన విశ్వసనీయమైన సమాచారం సాక్షి లైఫ్‌లో ఉంది. ఇది సమాజానికి చాలా అవసరం.'
- డా.డి.నాగేశ్వర్ రెడ్డి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత



'జీవనశైలిలో మార్పులే రోగాలకు కారణం, ఈ విషయంపై సాక్షి లైఫ్‌లో నిపుణుల సలహాలున్నాయి.'
- డా.గోపీ చంద్ మన్నం, చీఫ్ కార్డియో థొరాసిక్ సర్జన్



'ప్రస్తుతం నమ్మకమైన వైద్య సమాచారం అందుబాటులో లేదు, ఆ లోటును సాక్షి లైఫ్ భర్తీ చేస్తుందనుకుంటున్నాను'.
- డా. మంజుల అనగాని, ప్రముఖ గైనకాలజిస్ట్



'ఆరోగ్య రంగానికి సంబంధించిన సరైన సమాచారాన్ని నిపుణులైన వైద్యుల ద్వారా అందుబాటులోకి తెచ్చిన 'సాక్షి లైఫ్' కు వెల్‌కమ్'
- డా.కోనేటి నాగేశ్వరరావు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్



'వైద్యరంగంలో పరిశోధనలు, వాటి విశేషాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి. వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా సాక్షి లైఫ్‌ను తీర్చిదిద్దారు'.
- డా. చిన్నబాబు సుంకవల్లి, రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్



'మానసిక సమస్యలు పైకి చెప్పుకోలేని వారికి సాక్షి లైఫ్‌లో నిపుణుల ఇంటర్వ్యూల ద్వారా మంచి అవగాహన కలుగుతుంది, ఆల్ ది బెస్ట్'
- డా. పూర్ణిమ నాగరాజు, సైకియాట్రిస్ట్



'ప్రతీ ఒక్కరికి గుండె కీలకం, అది ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలన్నది సాక్షి లైఫ్‌లో విపులంగా చెప్పారు'.
- డా. ఎమ్.ఎస్.ఎస్. ముఖర్జీ, సీనియర్ ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్



'ఆర్థరైటిస్ సమస్యలు తలెత్తడానికి కారణాలు.. ముందుగా తెలుసుకుంటే అవి రాకుండా జాగ్రత్త పడొచ్చు.. ఇలాంటి సమాచారాన్ని సాక్షి లైఫ్ ద్వారా అందిస్తున్నారు.'
- డా.కె. జె.రెడ్డి, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్

పొలిటికల్ స్కిల్డ్ క్రిమినల్ చంద్రబాబు

మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయ నైపుణ్య నేరస్తుడు (పొలిటికల్ స్కిల్డ్ క్రిమినల్) అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసు నుంచి తాను బయటపడతానని ఆశించిన చంద్రబాబుకు, టీడీపీకి సుప్రీంకోర్టు తీర్పు అశనిపాతంలా మారిందన్నారు. కేసును కొట్టివేయలేదన్నారు. ఇద్దరు న్యాయమూర్తులు భిన్నమైన తీర్పులు ఇచ్చినా, కేసు పూర్వాపరాలు, అరెస్టు, రిమాండ్ జోలికి వాళ్లు వెళ్లలేదన్నారు. ప్రాథమిక ఆధారాలున్నాయని, విచారణపై ముందుకువెళ్లండి.. అన్నట్లుగా తీర్పు ఉందన్నారు. చంద్రబాబుపై గతంలో అనేక కేసులున్నాయని, వాటిలో ప్రస్తుతం సత్తెనపల్లి నుంచి టీడీపీ తరఫున పోటీ చేస్తానంటున్న కన్నా లక్ష్మీనారాయణ కూడా వేసిన కేసు ఒకటి ఉందని చెప్పారు. లక్ష్మీపార్వతి ఒక కేసు ఫైల్ చేశారన్నారు.తెలంగాణాలో ఓటుకు కోట్లు కేసు ఉందన్నారు. వీటన్నింటిలోనూ తప్పించుకున్న బాబు... స్కిల్ స్కాం కేసులో దొరికిపోయాడని తెలిపారు. ఇక చట్టం నుంచి తప్పించుకుని పారిపోవడం కుదరదని, ఆయనకు శిక్ష తప్పదన్నారు. ఆర్థిక బలం, పచ్చ మీడియా ఎంత విశ్వప్రయత్నం చేసినా చట్టాన్ని అడ్డుకోలేరన్నారు. చివరికి న్యాయమే గెలుస్తుందన్నారు. కుప్పంలోనూ చంద్రబాబును ప్రజలు తిరస్కరించడం ఖాయమని చెప్పారు. బాబు అవినీతి సొమ్మును పంచుకుంటున్న పవన్ కళ్యాణ్ కూడా నేరస్తుడేనన్నారు. ఈ నెల 19న కనీవినీ ఎరుగని రీతిలో విజయవాడ నగర నడిబొడ్డున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సామాన్యుడైనా, ధనికుడైనా చట్టానికి ఒక్కటే అని చెప్పిన మహానుభావుడు బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం అందరికీ స్ఫూర్తినిస్తాయని చెప్పారు. నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు.. నీటిమీద రాతలు

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజం



పాలసముద్రం (చిత్తూరు జిల్లా) : చంద్రబాబు చెప్పే మాటలు.. ఇచ్చే హామీలన్నీ నీటి మీద రాతల్లాంటివేనని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. బుధవారం పాలసముద్రం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'ఓటుకు కోట్లు' కేసులో తెలంగాణ పోలీసులకు అడ్డంగా దొరికి రాత్రికి రాత్రే పారిపోయి వచ్చి కరకట్టలో పడ్డాడన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాలకృష్ణ, చంద్రబాబు, లోకేశ్, పవన్ ఇతర నాయకులు హైదరాబాద్‌లో దాక్కున్నారని మండిపడ్డారు. ప్రతి ఇంటికీ బంగారం, ఇంటికో ఉద్యోగం, రైతులకు ట్రాక్టర్, డ్రైవర్ ఉంటే ఆ జీతం కూడా తానే ఇస్తానంటూ జనం చెవిలో పూలు పెట్టేందుకు చంద్రబాబు అండ్‌కో యత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్ని కష్టాలున్నా 99.5 శాతం హామీలు పూర్తి చేశారని తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
గురువారం ॥ 18-1-2024







కాఫీ విత్ అజిత

మనలో చాలా మందికి కొన్ని ఇష్టమైన ఆసక్తులు ఉంటాయి. వాటిని వ్యాపకంగా మార్చుకుంటారు కొందరు. వ్యాపారంగా కూడా మార్చుకోవచ్చు అని నిరూపించి చూపుతున్నారు హైదరాబాద్ వాసి అజిత చల్లా. నిద్రలేస్తూనే ఫిల్టర్ కాఫీ రుచిని ఆస్వాదించకుండా ఆ రోజు గడవదనే అజిత దేశీ విదేశీ కాఫీ రుచులను కరఫా పేరుతో నగరవాసులకు పరిచయం చేస్తున్నారు. కాఫీ ఫ్లేవర్స్ గురించి మాట్లాడుతూ ఉంటే ఎనిమిదేళ్ల తన కాఫీ జర్నీని ఇలా ఆనందంగా మన ముందుంచారు.

‘‘మా ఇంట్లో నా చిన్నప్పటి నుంచి ఉదయం లేస్తూనే ఒక దృశ్యాన్ని చూస్తూ, నేనూ ఆస్వాదిస్తూ పెరిగాను. అదే, ఉదయాన్నే ఫిల్టర్ కాఫీతో రోజును మొదలుపెట్టడం. రాత్రి నిద్రపోయేటప్పుడు కాఫీ ఇచ్చినా కాదనను. అలాంటి ఇష్టం ఏ ఊరు వెళ్లినా నా రోజువారీ ప్లాన్‌లో సరైన కాఫీ కోసం అన్వేషణ సాగుతూనే ఉండేది.

కుటుంబం నేర్పిన పాఠం

నేను పుట్టి పెరిగింది విజయవాడ. ఇంజినీరింగ్ పూర్తిచేశాను. ఉద్యోగినిగా కన్నా బిజినెస్ ఉమన్‌గా నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలని ఉండేది. మా నాన్న కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లో ఉన్నారు. నాకు అది సూట్ కాదనిపించింది. పెళ్లయ్యాక హైదరాబాద్ రావడం, మా అత్తింటి వారు ఇన్‌స్టంట్ కాఫీ ఎక్స్‌పోర్ట్



బిజినెస్‌లో ఉండటంతో నా ఆసక్తికి కొంచెం ఊతం వచ్చి ఉంటుంది. కాకపోతే ఎనిమిదేళ్ల క్రితం వరకు ఆ విషయం నాకు స్ఫురణకు రాలేదు. ఎక్కడకు వెళ్లినా కాఫీ గురించి వెతుక్కోవడం. కాఫీ రుచి గురించి మా వాళ్లతో మాట్లాడటం తరచూ జరుగుతుండేది. టూర్స్‌కి విదేశాలకు వెళ్లినా అక్కడ కూడా వివిధ రకాల కాఫీలు టేస్ట్ చేసే నా అలవాటను మానేదాన్ని కాదు. ఓ రెండేళ్ల క్రితం స్వయంగా ఏదైనా వ్యాపారం చేయాలనే ఆలోచన చేస్తున్నప్పుడు నా చేతిలో ఉన్న కాఫీ కప్పు నాకు సమాధానంలా అనిపించింది.


నేనెప్పుడూ ఫిల్టర్ కాఫీనే తాగే దాన్ని. పాలు, బెల్లం, డికాషన్ కలిపి చేసే ఆ కాఫీ నాకు చాలా ఇష్టమైనది. కానీ, మరొకరు ఇంకో రుచికరమైన కాఫీ కోసం అన్వేషించవచ్చు. మనకు తెలిసి కాఫీ అంటే చిరుచేదుగా ఉంటుందని చాలామంది మైండ్‌లో ఉంటుంది. కానీ, ఆ మాత్రం చేదు కూడా లేకుండా కాఫీని పరిచయం చేయచ్చు అని చాలా ప్రయోగాలు చేశాను. కాంబినేషన్స్ మారుతున్నకొద్దీ కాఫీ రుచి ఎలా మారుతుందో తెలుసుకుంటూ వచ్చాను. ఏది బెస్ట్ అని ఒక్క మాటలో చెప్పలేం. రోస్ట్ చేయడం, గ్రైండ్ చేసే విధానాన్ని బట్టి రుచిలో మార్పు వస్తుంటుంది. బ్లాక్ కాఫీలోనే పదుల సంఖ్యలో వెరైటీలు ఉన్నాయి. వాటిలో ఆరింటిని మేం పరిచయం చేస్తున్నాం. మరో పది దేశ విదేశీ కాఫీలు టేస్ట్ చేయచ్చు.



ప్రాజెక్ట్ వర్క్

కాఫీ ఆలోచనను మా కుటుంబ సభ్యుల ముందుంచినప్పుడు వారి నుంచి సపోర్ట్ రావడంతో నేననుకున్న కల నా ముందుకు వచ్చింది. వ్యాపారం ఆలోచన వచ్చాక రెండేళ్లుగా చాలా కసరత్తులు చేశాను. కాఫీ గింజలు ఎక్కడెక్కడి నుంచి తెప్పించాలి, వాటిని ఏ పద్ధతిలో రోస్ట్ చేయాలి, కాఫీకి అనుబంధంగా ఎలాంటి ఫుడ్ ఉంటే బాగుంటుంది, మిషనరీ ఏంటి... ఇలా ఒక పెద్ద ప్రాజెక్ట్ వర్క్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను. ఆ ప్రయత్నానికి ఫ్రెంచ్ కాఫీ అండ్ టీ కెటిల్ పేరు ‘కరఫా’ అనేది ఫైనల్ అయ్యింది.





ప్రత్యేకంగా..

మొదట ఇండియన్, వియత్నాం కాఫీ రుచులతో ప్రారంభించి, ఆ తర్వాత నుంచి భిన్న రుచులతో కొత్తదనాన్ని తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నాం. కెనడియన్, కొలంబియన్, ఇథోపియన్, ఇండియన్.. దేనికదే ప్రత్యేకత. మెక్సికన్లు దాల్చినచెక్క వేసుకొని కాఫీ తాగుతారు. ఇథోపియన్లు కాఫీతో పాటు పాప్ కార్న్ తీసుకుంటారు. వాళ్లలాగే మనమూ చేస్తే నచ్చకపోవచ్చు. కానీ, వాటి మీద ప్రయోగాలు చేస్తూ మనవారి టేస్ట్‌కు తగ్గట్టు ఇక్కడి కాఫీ ప్రియులకు నచ్చినట్టు పరిచయం చేయడానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటాం. అలాగే, వియత్నాంతో పాటు ఇంకొన్ని దేశాల్లో కాఫీ తోటలు వాటంతటవే పెరుగుతాయి. మన దగ్గర ఒక నిర్మాణాత్మకంగా పెంచుతారు. అక్కడి వాతావరణ పరిస్థితుల్లో పెరిగిన కాఫీ గింజలకి, ఇక్కడికి తేడా ఉంటుంది. అందుకే, ఈ కాఫీ టేస్ట్ మాత్రమే బాగుంటుందని చెప్పలేం. అన్నీ టేస్ట్ చేయాల్సిందే.



కాఫీతో పాటు...

ఫుడ్ కూడా ఉంటుంది. కాఫీ సేవిస్తూ తినడానికి ఇష్టపడే ఐటమ్స్ ఏమేం ఉంటాయో వాటన్నింటినీ పరిచయం చేస్తున్నాం. కొందరికి బ్రేక్ ఫాస్ట్‌తోనూ, లంచ్ టైమ్ మీల్స్‌తోనూ కాఫీ తాగే అలవాటు ఉంటుంది. దానిని కూడా ఇక్కడ అదే మెనూగా అందిస్తున్నాం. ప్రతి ఆలోచనా కాఫీతో పాటు కాఫీ చుట్టూతానే ఉంటుంది. ఇదంతా బ్యాలెన్స్‌డ్‌గా ఉండేలా చూసుకుంటున్నాం. ఈ రోజు వాతావరణం చల్లగా ఉంటే ఒక రకమైన కాఫీ తాగాలనిపిస్తుంది. మరుసటి రోజు ఎండగా ఉంటే ఇంకోరకం కాఫీ తాగాలని ఉంటుంది. ఎవరు రెగ్యులర్‌గా తాగే కాఫీ వాళ్లకు బాగా నచ్చుతుంది. మిగతా వాళ్లకు ఆ ఫ్లేవర్ నచ్చకపోవచ్చు. అలాగే, ఎప్పటికప్పుడు డిఫరెంట్ టేస్ట్ ట్రై చేయాలనే ఆసక్తి గలవారుంటారు. అందుకే, భిన్న రకాల రుచులతో కాఫీలను పరిచయం చేస్తూ నేనూ ఈ కాఫీ ప్రపంచంలో మమేకం అవుతున్నాను’ అని వివరించారు అజిత.



– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్

టొమాటో ఫేషియల్

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.

- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి వేసి ఐదు నిమిషాలపాటు ముఖంపైన రుద్దాలి. తరువాత చేతులతో మర్దన చేసి కడిగేయాలి.
- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలో వెరా జెల్ వేసి ఐదు నిమిషాలపాటు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడిలేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.



- అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌లా పని చేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.



- పూరీలు, పకోడీలు వేయించే నూనెలో చిటికెడు ఉప్పు వేస్తే సరి... పూరీలు, పకోడీలు పెద్దగా నూనె పీల్చవు.



- కప్పు నీటిలో రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి కలపాలి. ఈ నీటిలో యాపిల్ ముక్కలు నానబెడితే రంగు మారకుండా ఎక్కువ గంటల పాటు తాజాగా ఉంటాయి.



గ్లాసు పుల్లటి మజ్జిగలో ఐదు గ్లాసులు నీళ్ల పోసి కలపాలి. ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి మొక్కలపై చల్లాలి. ఉదయం సాయంత్రం ఒకసారి ఈ నీటిని మొక్కలపై పిచికారీ చేయడం వల్ల చీడపీడలు పోయి మొక్కలు చక్కగా ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఇంటిప్స్



బఠాణితొక్క కూడానూ..

పచ్చిబఠాణి మనకు ఎంత మేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణి గింజలు ఒలిచిన తర్వాత తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కలకు చక్కని పోషకాలను అందిస్తాయి. అందుకే బఠాణీ తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టులో కాసిన్ని నీళ్ల పోసి వడగట్టాలి. ఈ నీటిని గార్డెన్ లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మొక్కలకు మంచి బలవర్థకంగా పనిచేసి అవి చక్కగా పెరిగేందుకు దోహద పడుతుంది.

మల్టీ టాలెంట్

మల్టీ టాలెంట్ అంటే మాటలు కాదు. ఎంచుకున్న రంగాల్లో సమాన ప్రతిభ చాటాలి. తేడా జరిగితే అన్నిట్లో ‘జీరో’ తప్ప ఏమీ మిగలదు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా తన ప్రతిభను చాటుకున్న ఆరతి కదవ్ గురించి....

చిన్నప్పటి నుంచి ఆరతికి ఫాంటసీ జానర్ అంటే ఇష్టం. ‘పంచతంత్ర’ ‘మహాభారత’ కథల పుస్తకాలు చదువుతున్నప్పుడు వాటికి తన ఊహాలోకంలో తనదైన ఫాంటసీ జోడించేది. ఆ తరువాత సైన్స్–ఫిక్షన్ తన ఆసక్తిగా మారింది. ‘ఈ జీవితానికి అర్థం ఏమిటి? పుట్టడం, గిట్టడమేనా ఇంకేదైనా పరమావధి ఉందా?’ ఇలాంటి ప్రశ్నలతో చావుపుట్టుకల గురించి ఎన్నో కోణాలలో ఆలోచించేది. మరణానంతర జీవితం గురించి కథలు రాసేది.

సాఫ్ట్‌వేర్ టు సైన్స్–ఫిక్షన్ డైరెక్టర్



ఆరతి కదవ్

సైన్స్–ఫిక్షన్ ఫిల్మ్‌మేకర్‌గా ఆరతి గుర్తింపు తెచ్చుకోవడానికి ఈ ఊహలే పునాదిగా ఉపయోగపడ్డాయి. డైరెక్టర్‌గా తనకు ఎంతో పేరు తెచ్చిన ఫిలసాఫికల్ సైన్స్ ఫిక్షన్, బ్లాక్‌కామెడీ ఫిల్మ్ ‘కార్గో’కు ముందు రోబోలను దృష్టిలో పెట్టుకొని ‘టైమ్ మెషిన్’ అనే షార్ట్ ఫిల్మ్ తీసింది ఆరతి. ఈ చిన్న చిత్రం తనకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. మన పురాణాలలో నుంచి ఊహాజనితమైన కథలతో హాలీవుడ్ స్థాయిలో సినిమాలు తీయాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకునేలా చేసింది.,

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఆరతి కదవ్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేసింది. సాంకేతిక విషయాలకు తప్ప కాల్పనిక ఊహలకు బుర్రలో కాసింత చోటు దొరకనంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా ‘ఫాంటసీ’ కోసం కొంత స్థలం రిజర్వ్ చేసుకునేది. కొంతకాలం తరువాత ఉద్యోగాన్ని వదిలి ఫిల్మ్ డైరెక్షన్ కోర్సులో చేరింది.

కాల్పనిక విషయాల మీద ఆసక్తి ఆరతిని సైన్స్‌కు దూరం చేయలేదు. సందర్భాన్ని బట్టి శాస్త్రీయ విషయాలపై రచనలు చేస్తుంటుంది. చిత్రరంగంలో కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించి ‘విల్ ఏఐ మీన్ ది డెత్ ఆఫ్ క్రియేటివిటీ’ పేరుతో రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది.

రచయిత్రిగా కలం పట్టినప్పుడు తనలోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బయటకు వచ్చి ‘రిసెర్చ్’ చేయమంటూ సలహా ఇస్తుంది. దీంతో ఊహలకు విరామం ఇచ్చి తాను ఏ సబ్జెక్ట్ గురించి అయితే రాస్తుందో ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన వ్యక్తులతో మాట్లాడి సాధికారమైన సమాచారాన్ని పోగు చేస్తుంది. దీని ఆధారంగా మళ్లీ రచన చేస్తుంది. డైరెక్టర్‌గా ఉన్నప్పుడు తనలోని రచయిత్రి బయటకు వచ్చి సీన్–డైలాగ్‌లను ఇంకా ఎలా మెరుగుపెట్టవచ్చో సలహా ఇస్తుంది. ఇక ప్రొడ్యూసర్‌గా ఉన్నప్పుడు బడ్జెట్‌ను సమర్థవంతంగా వాడుకోవాలనే విషయంలో సలహాలు ఇవ్వడానికి తనలోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రైటర్, డైరెక్టర్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ‘కార్గో’ సినిమా అయిదుగురు నిర్మాతలలో ఆరతి ఒకరు. ‘నేర్చుకున్న విద్య ఏదీ వృథా పోదు’ అని చెప్పడానికి ఆరతి బహుముఖ ప్రజ్ఞ సాక్ష్యంగా నిలుస్తుంది.

స్ఫూర్తి

మీనా – రీనా



ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ అరుణాచల్ సిస్టర్స్ మాయాజాలం చేశారు. కొండల్ని మాయం చేశారా? బండలలో రాగాలు పలికించారా? అలాంటిదేమీ లేదు. లైబ్రరీ ముఖం ఎప్పుడూ చూడని వారిని కూడా రోజు తప్పకుండా లైబ్రరీకి వచ్చేలా చేశారు. బొమ్మల పుస్తకాలు మాత్రమే చదివే వాళ్లను దినపత్రికల నుంచి సామాజిక, సాంకేతిక పుస్తకాలు చదివేలా చేశారు. పుస్తకాలు చదివితే ఎంత శక్తి వస్తుందో స్వయంగా తెలుసుకునేలా చేశారు అరుణాచల్ సిస్టర్స్ ఎన్గురంగ్ మీనా, రీనా. ఎన్గురంగ్ లెర్నింగ్ ఇనిస్టిస్టూట్(ఎన్ఎల్ఐ)తో మారుమూల ప్రాంతాలలో విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నారు. జీవననైపుణ్యాలను పెంపొందిస్తున్నారు...

దారి చూపుతున్న రోడ్డు సైడ్ లైబ్రరీలు

ఫేస్‌బుక్‌లోని ఒక పోస్ట్ మీనాను బాగా ఆకట్టుకుంది. మిజోరంలోని రోడ్డుసైడ్ లైబ్రరీలకు సంబంధించిన పోస్ట్ అది. తన గ్రామంలోనూ అలాంటి లైబ్రరీ ఒకటి ఏర్పాటు చేయాలని సోదరి రీనాతో మాట్లాడింది. రీనాకు కూడా ఈ రోడ్డు సైడ్ లైబ్రరీ కాన్సెప్ట్ బాగా నచ్చింది. అయితే అది అంత సులువైన విషయం కాదని మెల్లగా అర్థమైంది. మిజోరంతో పోల్చితే అరుణాచల్‌ప్రదేశ్ అక్షరాస్యతలో వెనుకబడి ఉంది. నాణ్యమైన విద్యను అందించడంలో అత్యల్ప పనితీరు ప్రదర్శించిన రాష్ట్రంగా కూడా పేరు ఉంది.

ఈ నేపథ్యంలో మీనా, రీనాలు మాట్లాడుకొని తుది నిర్ణయానికి వచ్చారు.

‘ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రాజెక్ట్ రోడ్డు ఎక్కాల్సిందే’

తమ ఊళ్లో ప్రారంభించిన రోడ్డు సైడ్ లైబ్రరీ వివిధ జిల్లాలకు విస్తరించడానికి మూడు సంవత్సరాలు పట్టింది. మూడు సంవత్సరాలు ఒక విషయం మీద దృష్టి పెట్టడానికి చాలా ఓపిక కావాలి. ఆ ఓపికను ఎప్పుడూ మీనా, రీనా సిస్టర్స్ కోల్పోలేదు. మొదట్లో ఈ లైబ్రరీల వైపు ఎవరూ కన్నెత్తి చూసేవారు కాదు. ఇవి కాలేజీ విద్యార్థులు ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కావడానికి ఉద్దేశించినవి అనే భావన ఉండేది.

‘ఇవి అందరి కోసం’ అనే వాస్తవం తెలిశాక ఒక్కొక్కరు రావడం మొదలు పెట్టారు. చదువుకున్న వాళ్ల నుంచి అక్షరాలు కూడబలుక్కొని చదివే వారి వరకు ఈ లైబ్రరీ దగ్గర కూర్చుని పత్రికలు తిరగేయడమో, కథల పుస్తకం చదవడమో చేసేవారు. ఈ ఓపెన్ షెల్ఫ్ లైబ్రరీలకు వచ్చే వాళ్లలో పదేళ్ల వయసు నుంచి అరవై దాటిన వాళ్లు కూడా ఉండేవారు. మరిన్ని ప్రాంతాలలో మరిన్ని లైబ్రరీలు ఏర్పాటు చేయడానికి సోషల్ మీడియా వేదికగా విరాళాలు అడిగినప్పుడు దాతల నుంచి మంచి స్పందన వచ్చింది.

మొదట్లో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ లైబ్రరీలు దెబ్బతినేవి. పుస్తకాలు దొంగతనానికి గురయ్యేవి. ఆ తరువాత మాత్రం ప్రజలే వీటిని సొంతం చేసుకున్నారు. పుస్తకాలు దొంగతనానికి గురికాకుండా చూడడం నుంచి దెబ్బతిన్న లైబ్రరీలను పునర్నిర్మించడం వరకు ప్రజలు బాధ్యత తీసుకున్నారు. ఈ ఉత్సాహంలో ప్రధాన పట్టణాలలోనే కాదు మారుమూల పల్లెలోనూ ఇలాంటి లైబ్రరీలు ఏర్పాటు చేయాలని మీనా, రీనాలు నిర్ణయించుకున్నారు.



‘నిజాయితీగా కష్టపడితే తప్పకుండా మనం చేసే పని సఫలం అవుతుందని చెప్పడానికి ఈ రోడ్‌సైడ్ లైబ్రరీలు ఒక ఉదాహరణ. ఇక్కడికి వచ్చేవారు కొత్తపుస్తకాలు అడుగుతున్నప్పుడల్లా మా ఉత్సాహం రెట్టింపు అవుతుంది. మా పనికి స్నేహితులు, సామాజిక సేవకులు, రచయితలు, ఉద్యమ కార్యకర్తలు ఎంతోమంది సహకారం అందించారు. మా కృషిని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్‌లో మా ప్రయత్నాలను ప్రశంసించారు’ అంటుంది మీనా.

మీనా ఒక స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది.

నిజానికి ఆమె చదివిన చదువుకు పెద్ద ఉద్యోగాలు రావడం కష్టం కాదు. విదేశాల్లో కూడా ఉద్యోగం చేసే అవకాశాలు వచ్చాయి. అయితే తనకు పిల్లల మధ్య గడపడం ఇష్టం. టీచర్‌గా పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో విజయం సాధించింది మీనా. మొదట్లో పిల్లలను ఆకట్టుకోడానికి ‘ఈ పుస్తకం చదివి సారాంశం చెబితే గిఫ్ట్ ఇస్తాను’ అని చెప్పేది. అయితే ఏ ఒక్క విద్యార్థికీ గిఫ్ట్ రాకుండా ఉండలేదు. అంటే... ప్రతి ఒక్కరూ బుక్ చదివి అందులోని విషయాన్ని చెప్పేవారు. ఆ తరువాత మాత్రం గిఫ్టలతో పనిలేకుండానే పుస్తకాలు విరివిగా చదవడం మొదలుపెట్టారు.

ఒకప్పుడు గిఫ్ట్ గురించి ఆరా తీసే వారు.

ఇప్పుడు ‘కొత్త పుస్తకం ఏది ఇస్తారు?’ అని అడుగుతున్నారు!

తమ కుటుంబంలో పెద్ద చదువు చదువుకున్న తొలి వ్యక్తి మీనా. తనకు చదువుపై ఆసక్తి పెరగడానికి కారణం పుస్తకాలు. మొదట్లో బొమ్మల పుస్తకాలు. ఆ తరువాత పాఠ్యపుస్తకాలు. అయితే తాను చదువుకునే రోజుల్లో పుస్తకాలు చదవాలనే ఆశ తప్ప లైబ్రరీలు ఉండేవి కావు.

మీనా, రీనా తల్లిదండ్రులు చదువుకోలేదు. ఇల్లు ఎప్పుడూ పేదరికం, అశాంతితో ఉండేది. ఢిల్లీ, బెంగళూరులో ఉన్నత చదువులు చదువుకున్న మీనా, రీనాలు తమ గతాన్ని మరిచిపోలేదు. ఒకప్పుడు తమ కుటుంబాన్ని పోలిన కుటుంబాలు అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎన్నో ఉన్నాయి. వారిని జాగృతం చేసి చదువు ద్వారా ముందుకు తీసుకు వెళ్లడాన్ని ముఖ్యలక్ష్యంగా చేసుకొని ప్రయాణం చేస్తున్నారు. ఎన్గురంగు లెర్నింగ్ ఇనిస్టిట్యూట్(ఎన్ఎల్ఐ) ఎంతోమంది నిరాక్షరాస్యుల జీవితాలలో అక్షర దీపాలు వెలిగించింది. జీవన నైపుణ్యాలు పెంపొందించింది.

గొప్ప విజయాలు సాధించేలా...

పఠనం అనేది టైమ్‌పాస్ కోసం కాదు. ఈ అభిరుచి జీవితాన్నే మార్చేస్తుంది. గొప్ప విజయాలు సాధించేలా చేస్తుంది. మనం ఒక పుస్తకం చదువుతున్నాం అంటే మరో ప్రపంచంలో ఉన్నట్లు. మనలో నిద్రాణంగా ఉన్న అనేక శక్తులు మేల్కొంటాయి. ప్రపంచంలో ఎన్నో రంగాలలో విజయం సాధించిన వారికి కాస్త టైమ్ దొరకడం కూడా కష్టం. ఇలాంటి పరిస్థితుల్లోనూ ‘ఈ నెలలో నేను తప్పకుండా చదవాల్సిన బుక్స్’ అని ఒక జాబితాను సిద్ధం చేసుకుంటారు. దీన్నిబట్టి పుస్తకానికి వారు ఇచ్చే విలువ ఏమిటో అర్థమవుతుంది.

– మీనా



'పారిస్' బెర్త్ లక్ష్యంగా... నేడు జర్మనీతో భారత మహిళల హాకీ జట్టు సెమీఫైనల్

మరో మ్యాచ్ కోసం ఎదురు చూడకుండా... పటిష్టమైన జర్మనీపై గెలిచి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలనే లక్ష్యంతో భారత మహిళల హాకీ జట్టు ఉంది. రాంచీలో జరుగుతున్న ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఈరోజు జర్మనీతో భారత్; అమెరికాతో జపాన్ తలపడనున్నాయి. సెమీఫైనల్లో గెలిచి ఫైనల్ చేరిన రెండు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్లో ఓడిన జట్ల మధ్య మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో నెగ్గిన జట్టుకు మాత్రమే చివరిదైన మూడో బెర్త్ ఖరారవుతుంది. దాంతో భారత్‌తోపాటు మిగతా మూడు జట్లు కూడా సెమీఫైనల్లో గెలవాలని పట్టుదలతో ఉన్నాయి. 2006 నుంచి జర్మనీతో ఏడుసార్లు తలపడ్డ భారత్ ఐదుసార్లు ఓడిపోయి, కేవలం రెండుసార్లు మాత్రమే గెలిచింది. ఈ నేపథ్యంలో జర్మనీపై గెలవాలంటే భారత్ సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. రాత్రి గం. 7:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

రోహిత్ సూపర్... భారత్ 'డబుల్ సూపర్'...

ఏమా ఉత్కంఠ... ఏమిటా మలుపులు... ఒక టి20 సమరం అభిమానులందరినీ కట్టిపడేసింది. ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో, అదీ అఫ్గానిస్తాన్‌తో పోరు ఏకపక్షం అనుకుంటే నరాలు తెగే పరిస్థితి వచ్చింది. 212 పరుగులు చేశాక భారత్ గెలుపు ఖాయమనిపించి నిశ్చింతగా ఉండగా... అఫ్గానిస్తాన్ మేమేమీ తక్కువ కాదన్నట్లుగా స్కోరు సమం చేసేసింది. 'సూపర్ ఓవర్'లో ఫలితం తేలుతుందనుకుంటే అక్కడా ఇరు జట్లూ సమమే. చివరకు అంతా రెండో సూపర్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది... ఇక్కడ చివరకు పైచేయి సాధించిన టీమిండియా గట్టెక్కింది. తుది ఫలితంతో గెలుపు భారత్‌దే అయినా ఆఖరి వరకు అఫ్గాన్ చూపిన పోరాటపటిమ అసమానం.



రోహిత్

- టి20 సిరీస్‌కు ఉత్కంఠభరిత ముగింపు
- రెండు సూపర్ ఓవర్ల తర్వాత తేలిన ఫలితం
- విజయంతో ముగించిన టీమిండియా
- అఫ్గానిస్తాన్‌పై 3–0తో సిరీస్ సొంతం
- రోహిత్ ఐదో టి20 సెంచరీ

బెంగళూరు: టి20 ప్రపంచకప్‌కు ముందు తాము ఆడిన ఆఖరి సిరీస్‌ను భారత్ ఘనంగా ముగించింది. అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల పోరును టీమిండియా 3–0తో సొంతం చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన చివరి టి20లో భారత్ రెండో 'సూపర్ ఓవర్'లో విజయం సాధించింది. తొలి సూపర్ ఓవర్ ఓవర్లో ఇరు జట్లు 16 పరుగులతో సమంగా నిలిచాయి. రెండో సూపర్ ఓవర్‌లో ముందుగా భారత్ 11 పరుగులు చేయగా... అఫ్గాన్ 1 పరుగుకే 2 వికెట్లు కోల్పోయింది. నిబంధనల ప్రకారం 'సూపర్ ఓవర్'లో రెండు వికెట్లు పడితే ఇన్నింగ్స్ ముగిసినట్టే కావడంతో భారత విజయం ఖరారైంది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (69 బంతుల్లో 121 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ టి20ల్లో ఐదో సెంచరీతో చెలరేగగా... రింకూ సింగ్ (39 బంతుల్లో 69 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) మరో మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 95 బంతుల్లోనే అభేద్యంగా 190 పరుగులు జోడించారు. అనంతరం అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 212 పరుగులు సాధించింది. గుల్బదిన్ (23 బంతుల్లో 55 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), గుర్బాజ్ (32 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇబ్రహీమ్ జద్రాన్ (41 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు.


రింకూ సింగ్

శతక భాగస్వామ్యం...

ఫరీద్ వేసిన మూడో బంతిని భారీ షాట్ ఆడబోయి వెనుదిరిగిన యశస్వి... కోహ్లి తొలి బంతికి డకౌట్... అంతా నిశ్శబ్దం... ఫామ్‌లో ఉన్న శివమ్ దూబే కూడా కీపర్‌కు క్యాచ్ ఇవ్వగా, తర్వాతి ఓవర్లో తన తొలి బంతికే సామ్సన్ కూడా సున్నాకే అవుట్! ఐదో ఓవర్ మూడో బంతి ముగిసేసరికి టీమిండియా స్కోరు 21/4... అయితే రోహిత్, రింకూ భాగస్వామ్యం జట్టుకు భారీ స్కోరు అందించింది. 15 ఓవర్లు ముగిసేసరికి 109/4తో స్కోరు మరీ గొప్పగా ఏమీ లేదు. అయితే చివరి ఐదు ఓవర్లలో 22, 13, 10, 22, 36 స్కోర్లతో భారత్ ఏకంగా 103 పరుగులు సాధించింది. 6 ఫోర్లు, 5 సిక్సర్లతో రోహిత్ వీర విధ్వంసం ప్రదర్శించగా... 1 సిక్స్, 4 ఫోర్లతో రింకూ చెలరేగిపోయాడు. 64 బంతుల్లోనే శతకం అందుకొని అంతర్జాతీయ టి20ల్లో ఐదో సెంచరీ సాధించిన తొలి ఆటగాడిగా రోహిత్ నిలవగా... రింకూ ఖాతాలో రెండో అర్ధ సెంచరీ చేరింది. వీరిద్దరి దెబ్బకు అఫ్గాన్ కుదేలైంది. రోహిత్ తన శైలికి భిన్నంగా ఈసారి కొన్ని వైవిధ్యమైన షాట్లతో అలరించడం విశేషం. కరీమ్ వేసిన చివరి ఓవర్లో తొలి మూడు బంతుల్లో రోహిత్ 4, 6 (నోబాల్), 6 కొట్టగా... చివరి మూడు బంతుల్లో రింకూ 6, 6, 6 బాదాడు. అనంతరం అఫ్గాన్ ఓపెనర్లు గుర్బాజ్, ఇబ్రహీమ్ 66 బంతుల్లోనే 93 పరుగులు జోడించి తమ జట్టుకు శుభారంభం అందించారు. వీరు వెనుదిరగడంతో పరిస్థితి మారిపోయింది. ఆ తర్వాత గుల్బదిన్, నబీ (16 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కలిసి జట్టుకు విజయానికి చేరువగా తెచ్చారు. విజయం కోసం చివరి ఓవర్లో 19 పరుగులు అవసరం కాగా, అఫ్గాన్ 18 పరుగులు చేయడంతో స్కోరు సమమైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) నబీ (బి) ఫరీద్ 4; రోహిత్ (నాటౌట్) 121; కోహ్లి (సి) ఇబ్రహీమ్ (బి) ఫరీద్ 0; దూబే (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 1; సామ్సన్ (సి) నబీ (బి) ఫరీద్ 0; రింకూ (నాటౌట్) 69; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 212. వికెట్ల పతనం: 1–18, 2–18, 3–21, 4–22. బౌలింగ్: ఫరీద్ 4–0–20–3, అజ్మతుల్లా 4–0–33–1, ఖైస్ 4–0–28–0, సలీమ్ 3–0–43–0, షరాఫుద్దీన్ 2–0–25–0, కరీమ్ 3–0–54–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) సుందర్ (బి) కుల్దీప్ 50; ఇబ్రహీమ్ (స్టంప్డ్) సామ్సన్ (బి) సుందర్ 50; గుల్బదిన్ (నాటౌట్) 55; అజ్మతుల్లా (సి) రవి బిష్ణోయ్ (బి) సుందర్ 0; నబీ (సి) అవేశ్ (బి) సుందర్ 34; కరీమ్ (రనౌట్) 2; నజీబుల్లా (సి) కోహ్లి (బి) అవేశ్ 5; షరాఫుద్దీన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 212. వికెట్ల పతనం: 1–93, 2–107, 3–107, 4–163, 5–167, 6–182. బౌలింగ్: ముకేశ్ 4–0–44–0, అవేశ్ 4–0–55–1, బిష్ణోయ్ 4–0–38–0, సుందర్ 3–0–18–3, దూబే 2–0–25–0, కుల్దీప్ 3–0–31–1.

సూపర్ ఓవర్లలో ఇలా...

ముకేశ్ వేసిన తొలి సూపర్ ఓవర్లో అఫ్గానిస్తాన్ 1 సిక్స్, 1 ఫోర్‌తో 16 పరుగులు చేసింది. ఛేదనలో రోహిత్ 2 సిక్స్‌లు కొట్టినా చివరకు భారత్ కూడా 16 పరుగులకే పరిమితమైంది. అవసరమైతే చివరి బంతికి వేగంగా పరుగు తీయాల్సి వస్తుందనే ఆలోచనతో రోహిత్ ఐదో బంతి తర్వాత రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగి రింకూను పంపించాడు. అయితే ఆఖరి బంతికి యశస్వి 2 పరుగులు రాబట్టలేకపోయాడు. ఫరీద్ వేసిన రెండో సూపర్ ఓవర్లో రోహిత్ 4, 6తో భారత్ 11 పరుగులు చేసింది. అయితే బిష్ణోయ్ వేసిన ఈ ఓవర్ తొలి 3 బంతుల్లోనే అఫ్గాన్ 2 వికెట్లు కోల్పోవడంతో భారత్ గెలుపు ఖాయమైంది.

రిలీఫ్..!

'ఏంటి వీరూ... లెగ్‌బై ఇచ్చావా, బ్యాట్‌కు అంత బలంగా బంతి తగిలింది... అసలే ఇక్కడ రెండు సున్నాలు ఉన్నాయి'... తను ఆడిన తొలి బంతి లెగ్‌సైడ్ దిశగా ఆడి బౌండరీని తాకగా, అంపైర్ లెగ్‌బై ఇవ్వడంతో అంపైర్ వీరేందర్ శర్మతో రోహిత్ అన్న మాట ఇది! అతని దృష్టిలో ఆ పరుగులు ఎంత విలువైనవో ఇది చెబుతుంది. నిజంగానే టి20ల్లో చాలా కాలంగా రోహిత్ ఫామ్ బాగా లేదు. వన్డేల్లో అద్భుతంగా ఆడుతున్నా 2022 నుంచి అంతర్జాతీయ టి20ల్లో ఈ మ్యాచ్‌కు ముందు 31 ఇన్నింగ్స్‌లలో అతను 3 అర్ధ సెంచరీలే చేశాడు. ఐపీఎల్‌లో కూడా అంతంతమాత్రంగానే ఆడాడు. ఇటీవలి పరిణామాలు సహజంగానే అతడిని ఇబ్బంది పెట్టాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ పోవడంతో పాటు టీమిండియా కెప్టెన్సీపై కూడా సందేహాలు వచ్చాయి. అసలు వచ్చే టి20 వరల్డ్ కప్‌లో అతను ఆడతాడా అన్నట్లుగా కూడా చర్చ సాగింది. దానికి తోడు తొలి రెండు మ్యాచ్‌లలో డకౌట్. ఇలాంటి స్థితిలో ఈ ఇన్నింగ్స్ అతని స్థాయిని చూపించింది. అఫ్గాన్ మరీ బలమైన ప్రత్యర్థి కాకపోయినా... ఇక్కడా విఫలమైతే పరిస్థితి ఇంకా జటిలంగా మారేంది. ఈ నేపథ్యంలో సరైన లెక్కలతో చేసిన సెంచరీ రోహిత్‌కు ఊరటనిచ్చిందనడంలో సందేహం లేదు.

ప్రజ్ఞానంద అద్భుతం

- ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్‌పై 62 ఎత్తుల్లో విజయం
- ఆనంద్‌ను దాటేసి భారత నంబర్‌వన్‌గా తమిళనాడు టీనేజ్ గ్రాండ్‌మాస్టర్


ప్రజ్ఞానంద


డింగ్ లిరెన్

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): గత ఏడాది గొప్పగా రాణించిన భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద కొత్త సంవత్సరంలోనూ తన జోరు కొనసాగిస్తున్నాడు. ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో 18 ఏళ్ల ప్రజ్ఞానంద నాలుగో రౌండ్ గేమ్‌లో సంచలనం సృష్టించాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ డింగ్ లిరెన్ (చైనా)పై ప్రజ్ఞానంద గెలుపొందాడు. తమిళనాడుకు చెందిన ప్రజ్ఞానంద ఈ గేమ్‌లో నల్ల పావులతో ఆడుతూ 62 ఎత్తుల్లో డింగ్ లిరెన్‌ను ఓడించాడు. తాజా ఫలితంతో ప్రజ్ఞానంద లైవ్ రేటింగ్స్‌లో 2748.3 పాయింట్లకు చేరుకున్నాడు. దాంతో 2748 పాయింట్లతో భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్న దిగ్గజ ప్లేయర్ విశ్వనాథన్ ఆనంద్‌ను రెండో స్థానానికి పంపించి భారత కొత్త నంబర్‌వన్‌గా ప్రజ్ఞానంద అవతరించాడు. అంతేకాకుండా విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్‌ను ఓడించిన రెండో భారతీయ ప్లేయర్‌గానూ ప్రజ్ఞానంద ఘనత సాధించాడు. వాస్తవానికి ప్రతి నెలాఖరుకు అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) వరల్డ్ రేటింగ్స్‌ను విడుదల చేస్తుంది. టోర్నీ జరుగుతున్న సమయంలో లైవ్ రేటింగ్స్ మార్పులు ఉంటాయి. ప్రస్తుత టాటా స్టీల్ టోర్నీలోని తదుపరి రౌండ్‌లలో ప్రజ్ఞానంద తడబడితే మళ్లీ ఆనంద్ నంబర్‌వన్ అయ్యే అవకాశాలున్నాయి. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీని నిర్వహిస్తున్నారు. నాలుగో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా మూడో స్థానంలో ఉన్నాడు. భారత్‌కే చెందిన విదిత్ 2 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో, గుకేశ్ 1.5 పాయింట్లతో పదో ర్యాంక్‌లో ఉన్నారు. గత ఏడాది జనవరిలోనే జరిగిన టాటా స్టీల్ చెస్ టోర్నీలో డింగ్ లిరెన్‌పై ప్రజ్ఞానంద గెలిచాడు. ఆ తర్వాత ఏప్రిల్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో రష్యా గ్రాండ్‌మాస్టర్ నెపోమ్‌నిషిని ఓడించి డింగ్ లిరెన్ కొత్త ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు.

'అర్జున' అందుకున్న ఇషా



సాక్షి, న్యూఢిల్లీ: భారత మహిళా షూటింగ్ రైజింగ్ స్టార్, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ 2023 సంవత్సరానికిగాను జాతీయ క్రీడా పురస్కారం 'అర్జున అవార్డు'ను బుధవారం అందుకుంది. కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ అవార్డును ఇషా సింగ్‌కు బహూకరించారు. ఈనెల 9న రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. అయితే అదే సమయంలో ఇషా జకార్తాలో ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడుతుండటంతో ఆమె హాజరుకాలేకపోయింది. ఇషాకు 'అర్జున' అందించిన అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ పారిస్ ఒలింపిక్స్ నుంచి ఇషా పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

విండీస్ 188 ఆలౌట్



హాజల్‌వుడ్

అడిలైడ్: పేస్ బౌలర్లు హాజల్‌వుడ్ (4/44), ప్యాట్ కమిన్స్ (4/41) హడలెత్తించడంతో... ఆస్ట్రేలియాతో బుధవారం మొదలైన తొలి టెస్టులో వెస్టిండీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 188 పరుగులకే ఆలౌటైంది. కిర్క్ మెకంజీ (50; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... తొలి టెస్టు ఆడుతున్న షమర్ జోసెఫ్ (36; 3 ఫోర్లు, 1 సిక్స్) చివరి వికెట్‌కు కీమర్ రోచ్ (17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి 55 పరుగులు జోడించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 21 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు సాధించింది. తన 106వ టెస్టులో తొలిసారి ఓపెనర్‌గా వచ్చిన స్టీవ్ స్మిత్ (26 బంతుల్లో 12; 2 ఫోర్లు), లబుషేన్ (10; 1 ఫోర్)లను షమర్ జోసెఫ్ అవుట్ చేశాడు. ఉస్మాన్ ఖ్వాజా (30 బ్యాటింగ్; 4 ఫోర్లు), గ్రీన్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్ ఓటమి

- ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ
- ఇండియా ఓపెన్ టోర్నీ


శ్రీకాంత్

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలోని రెండో టోర్నమెంట్‌లోనూ భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీ నుంచి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. 47 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 22–24, 13–21తో ప్రపంచ 18వ ర్యాంకర్ లీ చెయుక్ యి (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీకంటే ముందు మలేసియా ఓపెన్‌లో ఆడిన శ్రీకాంత్ రెండో రౌండ్‌లో ఓటమి చవిచూశాడు. మరోవైపు పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 78 నిమిషాల్లో 21–15, 19–21, 21–16తో ఫాంగ్ చి లీ–ఫాంగ్ జెన్ లీ (చైనీస్ తైపీ) జోడీపై కష్టపడి గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో తనీషా క్రాస్టో–అశ్విని పొన్నప్ప (భారత్) జంట 5–21, 21–18, 11–21తో జాంగ్‌కోల్ఫన్–ప్రజోంగ్‌జాయ్ (థాయ్‌లాండ్) జోడీ చేతిలో ఓడిపోయింది.

అంద్రీవా సంచలనం

ఆరో సీడ్ జెబర్‌పై విజయం


అంద్రీవా


జెబర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో సంచలనాలు నమోదయ్యాయి. రష్యాకు చెందిన 16 ఏళ్ల మిరా అంద్రీవా అద్భుత ఆటతో ప్రపంచ ఆరో ర్యాంకర్, ఆరో సీడ్ ఆన్స్ జెబర్ (ట్యునీషియా)ను ఇంటిదారి పట్టించగా... ఎలీనా అవనెస్యాన్ (రష్యా) ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్)ను బోల్తా కొట్టించింది. కేవలం 54 నిమిషాల్లో ముగిసిన ఈ రెండో రౌండ్ మ్యాచ్‌లో అంద్రీవా 6–0, 6–2తో ఆన్స్ జెబర్‌పై, ఎలీనా 6–4, 6–4తో సాకరిపై గెలిచి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 6–3, 6–2తో ఫ్రువిర్తోవా (చెక్ రిపబ్లిక్)పై, నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 7–6 (7/2), 6–2తో డొలెహిడె (అమెరికా)పై, తొమ్మిదో సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో తమారా (జర్మనీ)పై గెలిచారు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ 3 గంటల 11 నిమిషాల్లో 6–3, 4–6, 7–6 (7/4), 6–3తో అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు.

అలెన్ 16 సిక్స్‌లు



డ్యూనెడిన్: పాకిస్తాన్‌తో జరిగిన మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. పాక్ బౌలర్ల భరతం పట్టిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలెన్ (62 బంతుల్లో 137; 5 ఫోర్లు, 16 సిక్స్‌లు) అంతర్జాతీయ టి20ల్లో రెండో సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో ఒకే టి20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన అఫ్గానిస్తాన్ బ్యాటర్ హజ్రతుల్లా జజాయ్ (16 సిక్స్‌లు; ఐర్లాండ్‌పై 2019లో) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును అలెన్ సమం చేశాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ అలెన్ వీర విధ్వంసంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 224 పరుగులు చేసింది. అనంతరం పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 179 పరుగులకే పరిమితం కావడంతో న్యూజిలాండ్ 45 పరుగులతో గెలిచింది. బాబర్ ఆజమ్ (37 బంతుల్లో 58; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. ఈ గెలుపుతో న్యూజిలాండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3–0తో సొంతం చేసుకుంది.

సినిమా

గ్రహాంతరవాసి వస్తున్నాడు


రకుల్, శివ కార్తికేయన్

తమిళ చిత్రం 'అయలాన్' తెలుగులో విడుదల కానుంది. శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా ఆర్. రవికుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'అయలాన్'. కోటపాడి జె. రాజేశ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న తమిళ్‌లో విడుదలైంది. ఈ నెల 26న తెలుగులో విడుదల చేయనున్నట్లు గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ప్రకటించింది. ''ఫ్యాంటసీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'అయలాన్'. ఏలియన్ (గ్రహాంతర వాసి) ప్రధాన పాత్రలో దక్షిణాది భాషల్లో వచ్చిన తొలి సినిమా మాదే. వీఎఫ్ఎక్స్ షాట్స్‌కి సుమారు రెండేళ్లు పట్టింది. తమిళ్‌లో కేవలం నాలుగు రోజుల్లో రూ. 50 కోట్లు వసూలు చేసింది. తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ సినిమా చూపించాలని ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కోటపాడి జె. రాజేశ్.

చావునే చెండాడు ధీరుడు...


మానుషీ చిల్లర్, వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన తొలి హిందీ చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మానుషీ చిల్లర్ హీరోయిన్‌గా నటించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్‌పై సందీప్ ముద్దా నిర్మించిన ఈ మూవీ తెలుగు, హిందీలో ఫిబ్రవరి 16న విడుదల కానుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'వందేమాతరం..' అంటూ సాగే తొలి పాటని అమృతసర్‌లోని వాఘా సరిహద్దులో విడుదల చేశారు. 'చూడరా సంగ్రామ శూరుడు.. మండె రా మధ్యాహ్న సూర్యుడు.. చావునే చెడాడు ధీరుడు.. నిప్పులు కురిశాడు.. వందేమాతరం..' అంటూ ఈ పాట సాగుతుంది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని తెలుగులో అనురాగ్ కులకర్ణి, హిందీలో సుఖ్వీందర్ సింగ్ ఆలపించారు. ''ఎయిర్ ఫోర్స్ యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా 'ఆపరేషన్ వాలెంటైన్' రూపొందింది. దేశ స్ఫూర్తిని చాటే దేశభక్తి గీతమైన 'వందేమాతరం..'ని వాఘా సరిహద్దులో విడుదల చేశాం. ఇక్కడ రిలీజ్ చేసిన తొలి పాటగా 'వందేమాతరం..' చరిత్ర సృష్టించింది'' అని మేకర్స్ తెలిపారు. ఈ పాట ఆవిష్కరణలో వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్‌తో సహా టీమ్ పాల్గొన్నారు.

ఎర దొరికింది


ధనుష్

'తెల్ల దొరలకి దొంగవి.. నీలాగ నేను కూడా ఒక హంతకురాల్ని అయ్యుంటే వాడ్ని నేనే చంపేదాన్ని.. నా కోసం వాడు చావాలి' అనే డైలాగ్స్‌తో 'కెప్టెన్ మిల్లర్' సినిమా ట్రైలర్ విడుదలైంది. ధనుష్ హీరోగా ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించగా, శివ రాజ్‌కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రల్లో నటించారు. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్, జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న తమిళంలో విడుదలైంది. ఈ సినిమాని ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ ఈ నెల 25న తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా ట్రైలర్‌ని హీరోలు నాగార్జున, వెంకటేశ్ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. 'ఆకలి మీద ఉన్న ఒక సింహానికి ఎర దొరికింది.. దాన్ని ఎలాగైనా సరే కొట్టేయాలని ఒక గాడిద పులి గుంపు కాచుకుని ఉంది.. అప్పుడు ఆ ఎరని తోడేళ్లు లాక్కెళితే... ఏమవుతుంది?' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

ఇటు గందరగోళం... అటు ఆశ్చర్యం


సెంథిల్ రామ్మూర్తి, విద్యా బాలన్, ప్రతీక్ గాంధీ, ఇలియానా

'ప్రేమ మిమ్మల్ని ఇటు గందరగోళానికి గురి చేస్తుంది.. అటు ఆశ్చర్యపరుస్తుంది' అని అంటున్నారు ఇలియానా. హిందీ చిత్రం 'దో ఔర్ దో ప్యార్' సినిమా గురించే ఇలియానా ఇలా అన్నారు. ఈ సినిమాలో ఇలియానాతో పాటు విద్యా బాలన్, ప్రతీక్ గాంధీ, సెంథిల్ రామ్మూర్తి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దర్శకురాలు శీర్షా గుహ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేసి, ఈ చిత్రాన్ని మార్చి 29న థియేటర్స్‌లో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని సమాచారం.

సస్పెన్స్‌తో భయం


వేదిక

'ముని, బాణం, కాంచన 3, రూలర్' వంటి పలు చిత్రాలతో తనకంటూ గుర్తింపు పొందిన హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో 'ఫియర్' సినిమా ఆరంభం అయింది. హరిత గోగినేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నటుడు అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి డైరెక్టర్ కరుణాకరన్ క్లాప్ ఇవ్వగా, నటుడు, నిర్మాత మురళీ మోహన్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. వేదిక మాట్లాడుతూ– ''సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలతో రూపొందుతోన్న చిత్రమిది'' అన్నారు. ''ప్రేక్షకులకు ఎలాంటి సినిమా నచ్చుతుందా అని ఆలోచించి ఏడాది కష్టపడి 'ఫియర్' (భయం) కథ రెడీ చేశాను'' అన్నారు హరిత గోగినేని. ''హరిత నా భార్య. మా సంస్థలో 'లక్కీ లక్ష్మణ్' సినిమాకు పని చేసింది. డైరెక్షన్ కూడా పర్ఫెక్ట్‌గా చేయగలననే నమ్మకంతో 'ఫియర్' చేస్తోంది'' అన్నారు ఏఆర్ అభి. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సహనిర్మాత: సుజాత రెడ్డి.

వేసవిలో పతంగ్


ప్రీతి పగడాల

ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'పతంగ్'. తన ఫొటోలు, వీడియోలు, అమెరికన్ యాక్సెంట్‌లో తెలుగు మాట్లాడుతూ ఎంటర్‌టైన్ చేస్తుంటారామె. 'పతంగ్'కి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహిస్తున్నారు. 'జీ సరిగమప' రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్, ప్రముఖ సింగర్ ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''సికింద్రాబాద్ బస్తీ నేపథ్యంలో రూపొందుతోన్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా ఇది. వినోదం, భావోద్వేగాలు.. ఇలా అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి. ప్రస్తుతం చివరి షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,628	71,501
నిఫ్టీ ▽	460	21,572

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,784	▽ 161
డోజోన్స్	37,237	▽ 124
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,446	▽ 112
డాక్స్	16,432	▽ 140
షాంఘై	2,834	▽ 60
నికాయ్	35,477	▽ 141

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,277	▽ 331
బంగారం (99.5 స్వచ్ఛత)	62,028	▽ 329
వెండి (కిలో)	71,171	▽ 475

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.77	106.34
€	యూరో	ఒకటి	89.28	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.85	57.12
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.75	55.67
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.21	62.67
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.74	23.53
¥	చైనా యువాన్	ఒకటి	10.43	12.51

టాటా పంచ్ ఈవీ వచ్చేసింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ పంచ్ ఎలక్ట్రిక్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూం ధర రూ.10.99 లక్షలతో మొదలై రూ.14.49 లక్షల వరకు ఉంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 9.5 సెకన్లలో చేరుకుంటుంది. రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్స్‌తో లభిస్తుంది. ఒకసారి చార్జింగ్‌తో 25 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 315 కిలోమీటర్లు, 35 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 421 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ వెల్లడించింది. 190 ఎన్ఎం టార్క్‌తో 120 బీహెచ్‌పీ, అలాగే 114 ఎన్ఎం టార్క్‌తో 80 బీహెచ్‌పీ వర్షన్స్‌లో తయారైంది. 6 ఎయిర్‌బ్యాగ్స్, 360 డిగ్రీ కెమెరా, ఏబీఎస్, ఈఎస్సీ, ఈఎస్‌పీ, క్రూజ్ కంట్రోల్, 360 లీటర్ల బూట్ స్పేస్ వంటి హంగులు ఉన్నాయి. ఎనిమిదేళ్లు లేదా 1,60,000 కిలోమీటర్ల వరకు వ్యారంటీ ఉంది. డెలివరీలు జనవరి 22 నుంచి ప్రారంభం.

ఏషియన్ పెయింట్స్ లాభం 34 శాతం అప్

క్యూ3లో రూ. 1,475 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఏషియన్ పెయింట్స్ లాభం 34 శాతం ఎగిసి రూ. 1,475 కోట్లకు చేరింది. ముడి వస్తువుల ధరలు తగ్గడం, సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం ఇందుకు తోడ్పడ్డాయి. గతేడాది క్యూ3లో కంపెనీ లాభం రూ. 1,097 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం 5 శాతం వృద్ధి చెంది రూ. 8,637 కోట్ల నుంచి రూ. 9,103 కోట్లకు చేరింది. కంపెనీ వ్యయాలు స్వల్పంగా పెరిగి రూ. 7,322 కోట్లకు చేరాయి. సుదీర్ఘ పండుగ సీజన్ సైతం ఆదాయ, లాభాల వృద్ధికి దోహదపడినట్లు ఏషియన్ పెయింట్స్ డైరెక్టర్ అమిత్ సింగ్లే తెలిపారు. దక్షిణాసియా, ఈజిప్ట్ వంటి కీలక మార్కెట్లలో స్థూల ఆర్థిక ప్రతికూలతలు నెలకొనడంతో అంతర్జాతీయ వ్యాపార విభాగం ఆదాయం దాదాపు గత క్యూ3 స్థాయిలో రూ. 779 కోట్లుగా నమోదైంది.



బుధవారం ఏషియన్ పెయింట్స్ షేరు 1.67 శాతం క్షీణించి రూ. 3,242 వద్ద ముగిసింది.

క్రాష్ మార్కెట్..!

18 నెలల్లో అతిపెద్ద పతనం
- 2% పైగా క్షీణించిన సెన్సెక్స్, నిఫ్టీ
- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- బ్యాంకింగ్, మెటల్, ఆయిల్ షేర్లలో అమ్మకాలు
- రూ. 4.69 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: స్టాక్ మార్కెట్‌పై బేర్ ప్రతాపం చూపింది. ఫలితంగా కొత్త ఏడాదిలో జీవితకాల గరిష్టాల వద్ద ట్రేడవుతున్న సెన్సెక్స్ గత, 18 నెలల్లో భారీ పతనాన్ని బుధవారం చవిచూసింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు(8.46%)పతనం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఆందోళనలు, అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం గతేడాది (2023) చైనా ఆర్థిక వృద్ధి నిరాశపరచడం తదితర పరిణామాలు ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్ ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్ఈలో రూ.4.69 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.370 లక్షల కోట్లకు దిగివచ్చింది. కాగా గడిచిన 2 రోజుల్లో రూ.5.73 లక్షల కోట్ల సంపద ఆవిరైంది.

హెచ్‌డీఎఫ్‌సీకి.. రూ.1.07 లక్షల కోట్ల నష్టం

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు నిరాశపరిచాయి. రుణ వృద్ధి, లిక్విడిటీ కవరేజ్ రేషియో(ఎల్‌సీఆర్)లపై ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రోకరేజ్ సంస్థలైన సీఎల్ఎస్ఏ, మోర్గాన్ స్టాన్లీలు షేరు రేటింగ్ తగ్గించాయి. దీంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు 8.46% నష్టపోయి రూ.1,537 వద్ద ముగిసింది. బ్యాంకు మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.1.07 లక్షల కోట్లు ఆవిరై రూ.11.66 లక్షల కోట్లకు దిగివచ్చింది.

అత్యంత విలువైన పీఎస్‌యూగా ఎల్ఐసీ

ఎల్ఐసీ కంపెనీ అరుదైన రికార్డు సృష్టించింది. ప్రభుత్వ రంగ లిస్టెడ్ కంపెనీల్లో అత్యంత విలువైనదిగా అవతరించింది. ఈ షేరు ఇంట్రాడేలో 3% లాభపడి రూ.919 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో 1% నష్టంతో రూ.887 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.5.60 లక్షల కోట్లకు చేరింది. ఎస్‌బీఐ షేరు 1.67% తగ్గింది. మార్కెట్ క్యాప్ రూ.5.58 లక్షల కోట్లుగా నమోదై రెండో స్థానానికి దిగివచ్చింది.

బ్యాంకింగ్, మెటల్, ఆయిల్ రంగ షేర్లు భారీగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

రోజంతా నష్టాల్లోనే ట్రేడింగ్

ఉదయం సెన్సెక్స్ 1,130 పాయింట్ల పతనంతో 71,999 వద్ద, నిఫ్టీ 385 పాయింట్ల నష్టంతో 21,647 వద్ద మొదలయ్యాయి. తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,699 పాయింట్లు క్షీణించి 71,429 వద్ద, నిఫ్టీ 482 పాయింట్లు దిగివచ్చి 21,550 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు పడ్డాయి. చివరికి సెన్సెక్స్ 1,628 పాయింట్లు నష్టపోయి 71,501 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 460 పాయింట్లు పతనమై 21,572 వద్ద స్థిరపడ్డాయి.

2022 జూన్ 13 తర్వాత సూచీలకిదే అత్యంత భారీ పతనం కావడం గమనార్హం.

- చైనా ఆర్థిక వృద్ధి రేటు 2023లో (5.2%) అంచనాలు అందుకోలేకపోవడం, డాలర్ ఇండెక్స్ నెల గరిష్టానికి చేరుకోవడంతో మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెయిల్ 5%, టాటా స్టీల్, నాల్కో, జిందాల్ స్టీల్ షేర్లు 4% పతనమయ్యాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో, ఎన్ఎండీసీ, వేదాంత, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 3%, హిందుస్థాన్ కాపర్, హిందాల్కో జింక్ షేర్లు 2.5% నుంచి ఒకశాతం చొప్పున నష్టపోయాయి.



కుప్పకూలింది ఇందుకే...

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పతన ప్రభావం

అధిక వెయిటేజీ కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (8.46%) నష్టం పతనం సూచీల భారీ పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. నిఫ్టీ కోల్పోయిన మొత్తం 460 పాయింట్లలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వాటాయే 235 పాయింట్లు కావడం గమనార్హం.

ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా ఆందోళన

యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ప్రభావం చూపించే అమెరికా డిసెంబర్ ద్రవ్యోల్బణ డేటా, ఉపాధి కల్పన గణాంకాలు అంచనాలకు మించి నమోదడవడంతో 'వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా' అంచనాలు తెరపైకి వచ్చాయి. దీంతో అమెరికాలో పదేళ్ల కాల పరిమితి కలిగిన బాండ్లపై రాబడులు(4.04%) ఒక్కసారిగా పెరిగాయి. విదేశీ పెట్టుబడులు ఈక్విటీల నుంచి బాండ్లలోకి తరలిపోతాయనే ఆందోళనలు అధికమయ్యాయి. అలాగే క్రూడాయిల్‌తో పాటు ఇతర కమోడిటీల ధరల పెంపునకు కారణమయ్యే డాలర్ ఇండెక్స్ సైతం నెలరోజుల గరిష్టానికి చేరడమూ ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల డీలా

ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు వడ్డీరేట్ల తగ్గింపు వాయిదా అంచనాలు, చైనా ఆర్థిక వ్యవస్థ బలహీన సంకేతాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. ఆసియా మార్కెట్లు 2% క్షీణించి నెల రోజుల కనిష్టానికి దిగివచ్చాయి. యూరప్ మార్కెట్లు 2 శాతం మేర క్షీణించాయి. అమెరికా ఒక శాతానికి పైగా నష్టంతో ట్రేడవుతున్నాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల పతన ప్రభావం దలాల్ స్ట్రీట్‌పైనా పడింది.

ఎన్‌పీసీఐతో గూగుల్ పే ఒప్పందం

భారత్ వెలుపల యూపీఐ చెల్లింపులకు వీలు



న్యూఢిల్లీ: గూగుల్ ఇండియా డిజిటల్ సర్వీసెస్, ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. దీంతో గూగుల్ పే తన యూపీఐ చెల్లింపుల సేవలను భారత్ వెలుపల కూడా ఆఫర్ చేసేందుకు వీలవుతుంది. ఈ ఒప్పందంతో భారతీయులు విదేశాలకు వెళ్లినప్పుడు గూగుల్ పే (జీపే)తో చెల్లింపులు చేసుకోవచ్చని, వెంట నగదు తీసుకెళ్లాల్సిన అవసరం కానీ, అంతర్జాతీయ పేమెంట్ గేట్‌వేల అవసరం ఉండదని గూగుల్ పే ప్రకటించింది. యూపీఐ ద్వారా విదేశాల నుంచి స్వదేశానికి నగదు బదిలీ సులభతరం అవుతుందని పేర్కొంది.

'బెంగళూరు గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్'లో మెరిసిన జీఆర్‌టీ కస్టమర్లు



బెంగళూరు: అతిపెద్ద గోల్డ్ షాపింగ్ పండుగ 'బెంగళూరు గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్'లో జీఆర్‌టీ జ్యువెలర్స్ కస్టమర్లు మెరిశారు. పండుగ సీజన్‌లో 'జ్యుయెలర్స్ అసోసియేషన్ బెంగళూర్' నిర్వహించిన బంపర్ ప్రైజ్, లక్కీ డ్రా పోటీల్లో 177 మంది జీఆర్‌టీ జ్యువెలర్స్ కస్టమర్లు 20 గ్రాముల బంగారం నాణేల నుంచి 1 కేజీ వెండి వరకూ బహుమతులు గెలుపొందినట్లు కంపెనీ తెలిపింది. విజేతలందకీ జీఆర్‌టీ జ్యువెలర్స్ సంస్థ ఎండీలు జీఆర్ ఆనంద్ అనంతపద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు.



జోయాలుక్కాస్‌కు అవార్డులు

'ద రిటైల్ జ్యువెలర్ గ్రూప్' ముంబైలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సినీ నటులు సన్యా మల్హోత్రా, జోయా అఫ్రోజ్‌ల చేతుల మీద 'బెస్ట్ డిజిటల్/సోషల్ మీడియా మార్కెటింగ్ ఆఫ్ ది ఇయర్, నేషనల్ రిటైల్ చైన్ ఆఫ్ ది ఇయర్' అవార్డులు అందుకుంటున్న జోయాలుక్కాస్ సంస్థ సీఎండీ జాయ్ అలుక్కాస్.

ఎన్‌కోర్-ఆల్కమ్ కొత్త ప్లాంట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అల్యూమినియం డోర్స్, విండోస్ తయారీ కంపెనీ ఎన్‌కోర్-ఆల్కమ్ రూ.60 కోట్లతో గుజరాత్‌లోని సూరత్ వద్ద అత్యాధునిక ప్లాంటు నెలకొల్పుతోంది. అల్యూమినియం డోర్స్, విండోస్ విభాగంలో భారత్‌లో తొలి ఆటో రోబోటిక్ ఫెసిలిటీ ఇదేనని సంస్థ ఫౌండర్, సీఎండీ అవుతు శివకోటిరెడ్డి బుధవారం తెలిపారు. '1,80,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలో అతిపెద్ద కేంద్రం ఇదే. జర్మనీ సాంకేతికతతో రోజుకు 30,000 చదరపు అడుగుల తయారీ సామర్థ్యంతో మార్చికల్లా రెడీ అవుతుంది. ఇప్పటికే సూరత్‌లో అల్యూమినియం డోర్స్, విండోస్ ప్లాంటు ఉంది. కస్టమర్ కోరుకున్నట్టు ఆర్కిటెక్చరల్ ఉత్పాదనలు మా ప్రత్యేకత. 60 కంపెనీలు క్లయింట్లుగా ఉన్నాయి. హైదరాబాద్ సమీపంలోని మోకిల వద్ద ఫ్యాబ్రికేషన్ యూనిట్, ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ మార్చికల్లా ప్రారంభం అవుతాయి.



ఎన్‌కోర్-ఆల్కమ్ ఫౌండర్ అవుతు శివకోటిరెడ్డి

ఎన్‌కోర్ ఇప్పటికే వుడ్ డోర్స్ తయారీలో ఉంది. దక్షిణాదిన ఎన్‌కోర్, ఉత్తరాదిన ఆల్కమ్ బ్రాండ్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నాం' అని వివరించారు. హైటెక్స్‌లో జనవరి 19 నుంచి జరిగే ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో విభిన్న ఉత్పత్తులను ప్రదర్శిస్తామని ఆల్కమ్ డైరెక్టర్ జయంతి భాయ్ మనుభాయ్ తెలిపారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ జ్యుడిషియల్ సర్వీస్‌లో సివిల్ జడ్జి పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడిషియల్ సర్వీస్‌లో సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)ఉద్యోగాల భర్తీకి అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది.
- » పోస్టు పేరు: సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్).
- » మొత్తం పోస్టుల సంఖ్య: 39(డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ -32, ట్రాన్స్‌ఫర్-7)
- » అర్హతలు:లాలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
- » వయసు: 35ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు ఐదేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో పదేళ్ల సడలింపు లభిస్తుంది.
- » వేతనం: నెలకు రూ.77840-రూ.1,36,520 పే స్కేల్ అందుతుంది.
- » ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్, రాత పరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్‌ల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- » ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:31.01.2024
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:01.03.2024
- » స్క్రీనింగ్ పరీక్ష తేది(కంప్యూటర్ ఆధారిత పరీక్ష): 13.04.2024
- » వెబ్‌సైట్: https://aphc.gov.in/recruitment.html

ఇండియన్ ఆర్మీలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 56వ కోర్సు

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 56వ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
- » కేటగిరీ వారీగా ఖాళీలు: ఎన్‌సీసీ పురుషులు-50, ఎన్‌సీసీ మహిళలు-05. ఈ రెండు విభాగాల్లోనూ 6(పురుషులు5, మహిళలు1) పోస్టులు యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు దక్కుతాయి.
- » అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం ఆఖరు సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ సి సర్టిఫికేట్‌లో కనీసం బీగ్రేడ్ పొంది ఉండాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సీసీ సి సర్టిఫికేట్ అవసరం లేదు. వయసు: 01.07.2024 నాటికి 19 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్ట్, స్టేజ్-1, స్టేజ్-2 టెస్టులు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » శిక్షణ, వేతనం: ఎంపికైన అభ్యర్థులకు ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ చెన్నైలో 49 వారాల శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్శిటీ ప్రదానం చేస్తుంది. వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:06.02.2024
- » వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in.

జీఎంయూ, గుజరాత్‌లో ఎంబీఏ, ఎల్ఎల్ఎం ప్రవేశాలు

గాంధీనగర్‌లోని గుజరాత్ మారిటైమ్ యూనివర్శిటీ (జీఎంయూ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు
- » ఎంబీఏ(షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్): 60 సీట్లు. అర్హత: ఏదైనా విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్(మారిటైమ్ లా అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లా): 30 సీట్లు. అర్హత: ఎల్ఎల్‌బీ/లాలో తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 05.06.2024.
- » ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్ తేది: 09.06.2024.
- » ఇంటర్వ్యూ తేదీలు:12.06.2024, 13.06.2024
- » వెబ్‌సైట్: gmu.edu.in

తెలంగాణ బీసీ గురుకులాల్లో 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ ప్రవేశాలు

మహాత్మా జ్యోతిబాపులే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే బీసీ గురుకుల పాఠశాలల్లో.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అర్హులైన తెలంగాణకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు.
- » అర్హత: విద్యార్థులు సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 లేదా 2023-24లో విద్యను అభ్యసించి ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ.1,50,000, పట్టణ ప్రాంత విద్యార్థులకు రూ.2,00,000కు మించకూడదు.
- » వయసు: 31.08.2024 నాటికి ఆరో తరగతికి పన్నెండేళ్లు, ఏడో తరగతికి పదమూడేళ్లు, ఎనిమిదో తరగతికి పద్నాలుగేళ్లు మించకూడదు.
- » ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.02.2024
- » హాల్ టికెట్ డౌన్‌లోడ్ తేది: 23.02.2024
- » ప్రవేశ పరీక్ష తేది: 03.03.2024.
- » అడ్మిషన్ ప్రక్రియ ముగింపుతేది: 31.07.2024
- » వెబ్‌సైట్: mjpabcwreis.cgg.gov.in

గేట్‌లో బెస్ట్ స్కోర్ ఇలా!

- » ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో గేట్ పరీక్ష
- » కొనసాగుతున్న హాల్ టికెట్ డౌన్‌లోడ్
- » వేగం, కచ్చితత్వంతో బెస్ట్ స్కోర్‌కు ఆస్కారం
- » రివిజన్‌పై దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

గేట్.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్! ఇది దేశంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు పరిచయం అక్కర్లేని పరీక్ష! ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీలో ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్!! దీంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు సైతం గేట్ స్కోర్ ప్రామాణికంగా నిలుస్తోంది. గేట్-2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో జరుగనుంది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షలో బెస్ట్ స్కోర్ సాధించేందుకు నిపుణుల సలహాలు..



ఎంట్రన్స్ టెస్ట్‌లైనా.. అకడమిక్ పరీక్షలైనా.. ఎన్ని రోజులు చదివాం అనేదాని కంటే.. పరీక్ష రోజు ఎలాంటి ప్రదర్శన ఇచ్చామన్నదే ముఖ్యం. నెలల తరబడి సాగించే ప్రిపరేషన్ ఒక ఎత్తైతే.. పరీక్షకు పది రోజుల ముందు చేసే రివిజన్, ప్రాక్టీస్ నిర్ణయాత్మకంగా మారుతోంది. అన్నింటికంటే ముఖ్యంగా పరీక్ష హాల్లో చూపే ప్రతిభ అత్యంత కీలకం అంటున్నారు నిపుణులు.

గేట్ పరీక్ష ఇలా

గేట్ పరీక్షలో 65 ప్రశ్నలు-వంద మార్కులకు ఉంటాయి. ఇందులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. అవి.. జనరల్ ఆప్టిట్యూడ్ , ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, సంబంధిత సబ్జెక్ట్. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.

రివిజన్

గేట్-2024 అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ పదిహేను రోజుల సమయాన్ని పూర్తిగా పునశ్చరణకే కేటాయించాలి. ఇప్పటి వరకు చదివిన అంశాలు, వాటికి సంబంధించిన ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలతో రూపొందించుకున్న సొంత నోట్స్‌ను పరిశీలిస్తూ వేగంగా రివిజన్ కొనసాగించాలి. దీనివల్ల తక్కువ సమయంలోనే ఇప్పటి వరకు చదివిన అన్ని అంశాలను మరోసారి రీక్యాప్ చేసేందుకు వీలవుతుంది.

వేగం, కచ్చితత్వం

గేట్ అభ్యర్థులు ప్రస్తుత సమయంలో వేగంగా సమాధానాలు ఇచ్చేలా ప్రాక్టీస్ చేయాలి. అదే సమయంలో కచ్చితత్వం ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం ముఖ్యమైన ఫార్ములాలతో రాసుకున్న నోట్స్‌ను పునరావలోకనం చేసుకోవడం మేలు. ఒక ప్రశ్నను చూస్తూనే.. దానికి సంబంధించిన మూల భావన మదిలో మెదిలేలా.. సంబంధిత ఫార్ములాలతో భిన్నమైన ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా మాక్ టెస్ట్‌లకు హాజరై.. పొరపాట్లకు కారణాలను విశ్లేషించుకోవాలి.

ఫార్ములాలు, కాన్సెప్టులు

గేట్ అభ్యర్థులు ప్రస్తుత సమయంలో ఆయా సబ్జెక్ట్‌లు, టాపిక్‌లకు సంబంధించి ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లను మరోసారి అవలోకనం చేసుకోవాలి. ముఖ్యంగా మెకానికల్, సీఎస్ఈ, ఈసీఈ అభ్యర్థులకు ఇది ఎంతో అవసరం. అదే విధంగా ఇతర సబ్జెక్ట్‌ల విషయంలోనూ ఈ విధానం పరీక్ష హాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చేందుకు ఎంతో దోహదం చేస్తుంది. ప్రిపరేషన్‌లో అప్లికేషన్ అప్రోచ్‌ను అనుసరిస్తే పరీక్ష హాల్లో ఎలాంటి ప్రశ్న అడిగినా.. సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది. తద్వారా మంచి స్కోర్ సాధనలో ముందంజలో నిలిచే ఆస్కారం ఉంటుంది.

మాక్ టెస్టులు

గేట్ అభ్యర్థులు ప్రస్తుత సమయంలో మాక్ టెస్ట్‌లకు హాజరై, వాటి ఫలితాలను విశ్లేషించుకోవాలి. ఏదైనా టాపిక్‌లో తక్కువ మార్కులు వచ్చినా.. కొత్తగా వాటిని చదివే ప్రయత్నం చేయడం సరి కాదు. దీనికి బదులు ఇప్పటికే బాగా పట్టున్న విభాగంలో మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలి. అదేవిధంగా అభ్యర్థులు గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న 'మాక్ టెస్ట్' సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఎందుకంటే.. అధికారిక వెబ్‌సైట్‌లోని మాక్ టెస్ట్‌లు.. పరీక్ష విధానంతోపాటు ప్రశ్నలు అడిగే తీరుపైనా అవగాహన పెంచుతాయి.

వర్చువల్ కాలిక్యులేటర్

మూడు గంటల వ్యవధిలో జరిగే గేట్ పరీక్షలో అంచెల వారీగా సాధన చేసి సమాధానం రాబట్టే ప్రశ్నలు కూడా ఉంటాయి. అంతేకాకుండా మొత్తం 65 ప్రశ్నల్లో అధిక శాతం ప్రశ్నలు కాలిక్యులేటర్‌ను వినియోగించాల్సిన విధంగా ఉంటున్నాయి. కాబట్టి వర్చువల్ కాలిక్యులేటర్‌ను వేగంగా వినియోగించే నైపుణ్యం పెంచుకోవాలి. ఫలితంగా ఒక ప్రశ్నకు వీలైనంత త్వరగా సమాధానం ఇచ్చే నేర్పు లభిస్తుంది.

పరీక్ష రోజు ఇలా

పరీక్ష రోజున అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్ణీత సమయాని కంటే ముందుగానే కేంద్రానికి వెళ్లాలి. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షకు..సంబంధిత పోర్టల్‌లో నిర్దిష్ట స్లాట్‌కు 20 నిమిషాల ముందుగానే లాగిన్ అయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఫలితంగా పరీక్షకు సంబంధించి ముఖ్యమైన నిబంధనలు చదివే సమయం లభిస్తుంది.

- పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యే ముందు.. ఆన్‌లైన్ విండోలో 'వ్యూ ఆల్ కొశ్చన్స్' ట్యాబ్ పై క్లిక్ చేయాలి. దీనివల్ల మొత్తం అన్ని ప్రశ్నలను చదివే అవకాశం ఉంటుంది. తద్వారా ఏ ప్రశ్న లేదా సెక్షన్‌ను ముందుగా ప్రారంభించాలి అనే అంశంపై స్పష్టత వస్తుంది. ముందుగా సులువైన లేదా తమకు బాగా అవగాహన ఉన్న సెక్షన్‌ను ఎంచుకుని.. వాటిని త్వరగా పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత క్లిష్టమైన సెక్షన్‌ల సాధన దిశగా అడుగులు వేయాలి.
- గేట్ పరీక్షలోని విభాగాల్లో.. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్ సెక్షన్స్ కొంత సులభంగా ఉంటాయి. అభ్యర్థులు ముందుగా వీటికి సమాధానాలు గుర్తించడం మేలు. ఫలితంగా ఈ సెక్షన్లను తక్కువ సమయంలో పూర్తి చేసుకుని.. ఆ తర్వాత సబ్జెక్ట్ ఆధారిత సెక్షన్లకు ఎక్కువ సమయం కేటాయించేందుకు వీలవుతుంది.
- మూడు గంటల పరీక్ష సమయంలో మొదటి గంటన్నరలో బాగా సులువైన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఏదైనా క్లిష్టమైన ప్రశ్న కనిపిస్తే దాన్ని వదిలేసి.. వేరే ప్రశ్నకు వెళ్లాలి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది కాబట్టి సమాధానం తెలియని ప్రశ్నలను వదిలేయడమే మేలు. అభ్యర్థులు సమాధానాల రివ్యూకు కూడా కొంత సమయం కేటాయించాలి. చివరల్లో అన్ని సమాధానాలను సరి చూసుకుని.. అవి సరైనవా? కాదా? అని పరిశీలించాలి. సమాధానాలిచ్చే క్రమంలో రఫ్ వర్క్ చేయడం కూడా మేలు చేస్తుంది. ముఖ్యంగా ఫార్ములా ఆధారిత ప్రశ్నలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్‌లోనే ప్రశ్నను చూస్తూ.. కేవలం ఆలోచన ఆధారంగా సమాధానాలివ్వడం ఒక్కోసారి తప్పు సమాధానాలకు దారి తీస్తుంది. కాబట్టి ఎగ్జామ్ హాల్లో అందించే స్క్రిబిల్ ప్యాడ్‌పై ప్రశ్నను సాల్వ్ చేసి.. ఆ సమాధానం కరెక్ట్ అనుకున్నప్పుడే దానికి సంబంధించిన ఆప్షన్ బటన్‌ను క్లిక్ చేయాలి.

నిబంధనలు-జాగ్రత్తగా

గేట్ అభ్యర్థులు పరీక్ష హాల్లోకి తీసుకెళ్లాల్సిన డాక్యుమెంట్స్‌ను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా సాధ్యమైనంత త్వరగా అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. గేట్ నిర్వాహక కమిటీ నిబంధనల ప్రకారం-అప్లికేషన్ సమయంలో పేర్కొన్న వ్యక్తిగత ఫోటో ఐడెంటిటీ కార్డ్ ఒరిజినల్ కాపీని పరీక్ష హాల్లో చూపించాల్సి ఉంటుంది. వాటిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. చివరి నిమిషంలో టెక్నికల్ ఎర్రర్స్, వెబ్‌సైట్ ట్రాఫిక్ పెరిగి వెబ్‌సైట్ ఓపెన్ అవకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి వీలైనంత ముందుగా దాన్ని డౌన్‌లోడ్ చేసుకోని ప్రింట్ తీసుకోవాలి.

గేట్‌తో ప్రయోజనాలెన్నో!

గేట్ స్కోర్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఐఐటీలు, ఎన్ఐటీలు, రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో చేరే అవకాశం లభిస్తుంది. దీంతో పాటు రాష్ట్రాల స్థాయిలో పీజీఈసెట్ కౌన్సెలింగ్‌లో గేట్ ర్యాంకర్లకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. గేట్ ర్యాంకు ఆధారంగా ఎంటెక్ సీటు ఖరారు చేసుకుంటే నెలకు రూ.12,400 స్టయిపండ్ అందుతుంది. ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, పీహెచ్‌డీ అభ్యర్థులకు నెలకు రూ.28 వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది. గేట్ స్కోర్ ఆధారంగా నవరత్న, మహారత్న, మినీరత్న తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇంజనీర్లుగా కొలువులు సొంతం చేసుకోవచ్చు.

గేట్-2024 ముఖ్య తేదీలు
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: జనవరి 3 నుంచి ప్రారంభం
- గేట్-2024 తేదీలు: ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో (ప్రతి రోజు రెండు సెషన్లు. మొదటి సెషన్ ఉదయం 9-12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2-5 గంటల వరకు).
- గేట్ పరీక్ష ఫలితాల వెల్లడి: మార్చి 16, 2024
- స్కోర్ కార్డ్ డౌన్‌లోడ్: మార్చి 23, 2024
- వెబ్‌సైట్: https://gate2024.iisc.ac.in

21 వరకు స్కూళ్లకు సెలవులు పొడిగింపు



సాక్షి, అమరావతి: సంక్రాంతి నేపథ్యంలో పాఠశాలలకు జనవరి 18 వరకు ఇచ్చిన సెలవులను మరో 2 రోజుల పాటు ప్రభుత్వం పొడిగించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 20వ తేదీ (శనివారం) వరకు సెలవులను పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఈ నిబంధన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. తిరిగి సోమవారం(22వ తేదీ) పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

నేడు వీఏహెచ్‌ఏ ఫలితాలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 1,896 పశుసంవర్ధక సహాయకుల(వీఏహెచ్‌ఏ) పోస్టుల ఫలితాలను గురువారం విడుదల చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు. https://apaha& recruitment.aptonline.in/ అనే వెబ్‌సైట్ ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చు. మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు జనవరి 25వ తేదీన నియామక పత్రాలు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీల్లో తరగతులు పునఃప్రారంభం

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో గురువారం నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులంతా వారి ఇళ్లకు వెళ్లారు. గురువారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఏపీకి ముగ్గురు ఐపీఎస్‌ల కేటాయింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు మరో ముగ్గురు ఐపీఎస్ అధికారులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. 2022వ బ్యాచ్‌కు చెందిన 200 మంది ఐపీఎస్‌లను దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు కేటాయిస్తూ కేంద్ర హోం శాఖ కార్యదర్శి అంజన్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడుకు చెందిన ఆర్.సుష్మిత, రాజస్థాన్‌కు చెందిన ఉమేశ్ మీనా, ఏపీకి చెందిన బొడ్డు హేమంత్‌లను ఏపీకి కేటాయించారు. తెలంగాణకు ఆయోషా ఫాతిమా, మంధారే సోహం సునీల్, మనాన్ భట్, రాహుల్ కాంత్, రుత్విక్ సాయి కొట్టె, పత్తిపాక సాయికిరణ్‌లను కేటాయించారు.

కమీషన్లు కాజేశాక చేతులెత్తేసింది మీ బాబే

- పోలవరంలో బాబు పాపాలను సీఎంపై నెట్టడానికి పాడిందే పాడుతున్న రామోజీ
- కమీషన్ల కక్కుర్తితో నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: పోలవరం పనుల్లో కమీషన్లు కాజేసి, పంచుకుతిన్నాక.. దానిని పూర్తి చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు పాపాలను సీఎం వైఎస్ జగన్‌పై నెట్టేందుకు 'ఈనాడు'లో పచ్చి అబద్ధాలను పాడిందే పాడుతున్నారు రామోజీరావు. కమీషన్ల కోసం పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని మోదీ ఆరోపిస్తే.. ట్రాన్స్‌ట్రాయ్ అధినేత రాయపాటి రంగారావు తాజాగా ఆ బాగోతాన్ని రట్టు చేశారు. సోమవారం పోలవారం పేరుతో ఎంతలా వసూళ్లు చేసిందీ బట్టబయలు చేశారు. అక్రమార్జన కోసం జీవనాడి పోలవరం జీవం తీస్తూ చంద్రబాబు చేసిన తప్పులను సీఎం జగన్ సరిదిద్దుతూ ప్రణాళికాయుతంగా ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారు. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆర్థిక ఇబ్బందుల్లోనూ స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున స్పిల్ వే మీదుగా మళ్లించి రికార్డు సృష్టించారు. పోలవరంను కేంద్రం తరపున రాష్ట్రం నిర్మిస్తోంది. చంద్రబాబు పాపాల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్‌పై తుది నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్రమే. ఆ నిర్ణయం ఆధారంగా డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించి.. ప్రధాన (ఈసీఆర్ఎఫ్) డ్యామ్‌ను పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లందించి పోలవరం ఫలాలను రైతులకు అందించేలా అడుగులు వేస్తున్న సీఎం జగన్‌పై ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ కర్షకుల్లో ఆదరణ మరింతగా పెరుగుతోంది. ఇది టీడీపీ ఉనికినే దెబ్బతీస్తుందనే ఆందోళనతో రామోజీరావు విషం చిమ్ముతూ తప్పుడు కథనాలు అచ్చేస్తున్నారు. ఆ క్రమంలోనే 'చేయలేక చేతులెత్తేశారు' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో కథనాన్ని అచ్చేశారు. ఆ కథనంలో సీఎం జగన్‌పై రామోజీరావుకు ఉన్న అక్కసు, అసూయ వ్యక్తం చేశారే తప్ప వీసమెత్తు నిజం లేదు. ఇవీ వాస్తవాలు..

ఈనాడు ఆరోపణ: పోలవరం ప్రాజెక్టు డీపీఆర్–2కు ఇంతవరకూ సీఎం జగన్ పెట్టుబడి అనుమతి సాధించలేదు.

వాస్తవం: విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించాలి. చంద్రబాబు సీఎంగా ఉండగా కమీషన్ల కక్కుర్తితో దానిని రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకున్నారు. 2013–14 ధరల ప్రకారమే పూర్తిచేస్తామని 2016 సెప్టెంబరు 7న నాటి సీఎం చంద్రబాబు అంగీకరించి పనులను దక్కించుకున్నారు. అప్పటి ధరల ప్రకారం పోలవరం వ్యయం రూ.20,398.61 కోట్లు ఇచ్చేందుకు అప్పట్లో కేంద్ర మంత్రివర్గం అంగీకరించింది. ఇందులో 2014 ఏప్రిల్ 1 నాటికి చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లు మినహాయించి మిగతాది అంటే రూ.15,667.91 కోట్లు ఇస్తామని తేల్చింది. 2014 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయంలో రూ.15,146.27 కోట్లు కేంద్రం విడుదల చేసింది. మిగిలింది రూ.521.63 కోట్లు మాత్రమే. కానీ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునారావాసానికే రూ.33,168.23 కోట్లు అవసరం. ఇదే అంశాన్ని సీఎం వైఎస్ జగన్ గుర్తుచేస్తూ.. 2017–18 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ ఖరారు చేసిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి, నిధులు విడుదల చేసి, ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని ప్రధాని మోదీతో సమావేశమైన ప్రతిసారీ కోరుతున్నారు. ఇందుకు ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు తొలిదశ పూర్తికి రూ.12,911.15 కోట్లు విడుదల చేసేందుకు జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించింది. విభాగాల వారీగా విధించిన పరిమితులను ఎత్తేసేందుకు సమ్మతి తెలిపింది. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 36 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడానికి సూత్రప్రాయంగా కూడా అంగీకరించింది. ఆ గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడానికి అదనంగా రూ.2,749.85 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ లెక్కగట్టింది. మొత్తం రూ.15,661 కోట్లను విడుదల చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖకు శుక్రవారం సిఫార్సు చేసింది. దీన్ని ఖరారు చేసేందుకు కేంద్ర జల్ శక్తి శాఖ ఏర్పాటుచేసిన ఆర్‌సీసీ (రివైజ్డ్ కాస్ట్ కమిటీ) దాన్ని ఆమోదించింది. నివేదిక ఇవ్వడం లాంఛనమే. ఆ నివేదికను చూసి కేంద్ర కేబినెట్‌కు జల్‌శక్తి, ఆర్థిక శాఖలు ప్రతిపాదన పంపనున్నాయి. దీనిపై కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేస్తే పోలవరం తొలిదశ పూర్తికి అవసరమైన నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుంది.





ఈనాడు ఆరోపణ: 2020 వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈ సమస్య పరిష్కారానికి సీఎం జగన్ చొరవ చూపలేదు.

వాస్తవం: గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేశాక ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్ నిర్మించాలి. కానీ.. నాటి సీఎం చంద్రబాబు కమీషన్ల కక్కుర్తితో వరద మళ్లింపు పనులు పూర్తి చేయకుండానే డయాఫ్రమ్‌వాల్ పనులను ఎల్ అండ్ టీ, బావర్ సంస్థలకు నామినేషన్‌పై సబ్ కాంట్రాక్టుకు అప్పగించారు. పనులు చేసిన ఆ సంస్థలకు రూ.400 కోట్లు బిల్లులు చెల్లించి.. కమీషన్లు వసూలు చేసుకున్నారు. ఆ తర్వాత రూ.2,917 కోట్ల విలువైన పనులను ఈనాడు రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు నామినేషన్‌పై కట్టబెట్టారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించి కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. పునరావాసం కల్పించే పనుల్లో కమీషన్లు రావనే నెపంతో కాఫర్ డ్యామ్‌లలో ఖాళీలు పెట్టి, ఆ తర్వాత చేతులెత్తేశారు. ఇదంతా చంద్రబాబు నిర్వాకమే. 2019, 2020లలో గోదావరి వరద కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాలగుండా అధిక ఒత్తిడితో ప్రవహించడం వల్ల డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. దీనికి చంద్రబాబు తప్పిదమే కారణమని హైదరాబాద్ ఐఐటీ నివేదిక ఇచ్చింది. డయాఫ్రమ్‌వాల్ భవితవ్యాన్ని తేల్చాలని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి షెకావత్‌ను అనేక సార్లు సీఎం జగన్ కోరారు. వాటికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి షెకావత్.. డయాఫ్రమ్‌వాల్ భవితవ్యాన్ని తొందరగా తేల్చాలని ఆ శాఖ సలహాదారు వెదిరె శ్రీరాంను ఆదేశించారు. కేంద్రం తీసుకునే నిర్ణయాల ఆధారంగా డయాఫ్రమ్‌వాల్‌పై ముందుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

ఈనాడు ఆరోపణ: ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం ఆలస్యమైంది. సీపేజీ అధికమైంది. ఫలితంగా వాటిని నిర్మించిన ఉద్దేశమే దెబ్బతింది.

వాస్తవం: ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణంలో జాప్యానికి చంద్రబాబే కారణం. 2018లో ఈ డ్యామ్‌ల పనులు ప్రారంభించి.. 2019 ఫిబ్రవరిలో చేతులెత్తేశారు. సీఎం జగన్ 2019 మే 30న అధికారం చేపట్టారు. 2019 జూన్‌లో గోదావరికి వరదలు వచ్చాయి. నవంబర్ వరకూ గోదావరి వరదెత్తింది. వరదలు తగ్గాక ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను సీఎం జగన్ పూర్తి చేశారు. కాఫర్ డ్యామ్‌లలో సీపేజీ సాధారణమే. సీపేజీ నీటిని దిగువకు తరలిస్తూ ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో దెబ్బతిన్న ఇసుక నేలను యథాస్థితికి తెచ్చే పనులను ప్రభుత్వం చేపట్టింది. డయాఫ్రమ్‌వాల్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోగానే.. దాని ఆధారంగా ప్రధాన డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది.

ఈనాడు ఆరోపణ: అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీ కోసం ఇప్పటిదాకా టెండర్లే పిలవలేదు. ఆ నిపుణులు వచ్చి నిర్ణయాలు తీసుకుంటే తప్ప పనులు ముందుకు సాగవు.

వాస్తవం: పోలవరం పనుల్లో సమస్యలు పరిష్కరించాలంటే అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీ సహకారం అవసరమని సీడబ్ల్యూసీ పేర్కొంది. ఆ ఏజెన్సీ కోసం టెండర్లు పిలుస్తామని పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిసెంబర్ 5న నిర్వహించిన సమావేశంలో పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తయితే ఏజెన్సీ అందుబాటులోకి వస్తుంది. ఆ ఏజెన్సీ నిర్ణయాల ఆధారంగా పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ఎంఎఫ్‌ఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

ముత్తుకూరులో 30న కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: ఏపీ మత్స్య విశ్వవిద్యాలయ పరిధిలోని నెల్లూరు జిల్లా ముత్తుకూరు మత్స్య కళాశాలలో 2023–24కు సంబంధించి మాస్టర్ ఆఫ్ ఫిషరీ సైన్స్, పీహెచ్‌డీ ప్రవేశానికి ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని వర్సిటీ వీసీ ఓ సుధాకర్ ప్రకటనలో తెలిపారు. 16 సీట్లు మాస్టర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ ప్రోగ్రామ్‌కు, రెండు సీట్లు పీజీ ప్రోగ్రామ్‌కు కేటాయించామని పేర్కొన్నారు. మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సుకు కేటాయించిన సీట్లలో ఆక్వాకల్చర్ విభాగానికి 3, ఆక్వాటిక్ అనిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్‌కు 2, ఆక్వాటిక్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్‌కు 2, ఫిషరీస్ ఇంజనీరింగ్‌కు 2, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌కు 4, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ విభాగానికి మూడు చొప్పున సీట్లు కేటాయించామని చెప్పారు. అలాగే పీహెచ్‌డీ కోర్సుకు కేటాయించిన రెండు సీట్లు ఆక్వాకల్చర్ విభాగానికి కేటాయించామన్నారు. మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సులో చేరేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ గుర్తించిన విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్స్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సు, పీహెచ్‌డీ కోర్సులో చేరేందుకు మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సును పూర్తి చేసి ఉండాలన్నారు. ఇప్పటి వరకు మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్‌కు సంబంధించి వివిధ విభాగాల్లో చేరేందుకు 19 దరఖాస్తులు అందాయన్నారు. ఈనెల 20లోగా ఆసక్తి, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 30వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

రూ.1.20 లక్షల చిల్లర నాణాలతో స్కూటీ కొనుగోలు

- లెక్కించేందుకు రెండు గంటలు శ్రమించిన సిబ్బంది
- షోరూంలోనే స్కూటీకి పూజలు చేసి తీసుకెళ్లిన అర్చకుడు

పలమనేరు(చిత్తూరు జిల్లా): స్కూటర్ కొనుగోలు చేసేందుకు ఓ అర్చకుడు చిల్లర ఇచ్చిన ఘటన బుధవారం పలమనేరు పట్టణంలోని ఓ బైక్ షోరూమ్‌లో చోటు చేసుకుంది. బైరెడ్డిపల్లికి చెందిన మురళీధర్ అనే అర్చకుడు స్కూటీ కొనాలని ఎన్నో ఏళ్లుగా నిర్ణయించుకున్నారు. నాలుగు, ఐదేళ్లుగా ఆలయంలో తనకు వచ్చిన చిల్లర కానులను ఇంట్లో దాచుకున్నారు. ఆ పైకం రూ.1.20 లక్షలు అవడంతో వాటిని సంచుల్లో నింపి ఆటోలో పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో ఉన్న ఓ బైక్ షోరూంకు వెళ్లి స్కూటీ కొనుగోలు నిమిత్తం వివరాలు వాకబు చేశారు. అనంతరం కొనుగోలు చేయగా, షోరూం యజమాని బిల్లు వేసి అర్చకునికి అందజేశారు. ఆటోలో తీసుకొచ్చిన 1, 2, 5 రూపాయల నాణాలు తెచ్చిన సంచులను మురళీధర్ లోనికి తీసుకొచ్చారు. దీన్ని చూసిన షోరూం నిర్వాహకులు అవాక్కయ్యారు. అనంతరం నవ్వుకుని చిల్లర నాణాలను సిబ్బంది లెక్కించడం ఆరంభించారు. ఇందుకోసం దాదాపు రెండు గంటలు పట్టింది. ఇంత చిల్లరతో స్కూటీ కొన్ని తొలి వ్యక్తి మీరేనంటూ మురళీధర్‌ను అభినందించి, ఆయనకు స్కూటీ తాళాన్ని అందజేశారు. అనంతరం మురళీధర్, ఆయన భార్య, కుమారుడు కలిసి షోరూంలోనే స్కూటీకి పూజలు చేసి, కేక్‌కట్‌చేసి సిబ్బందికి అందజేశారు. అనంతరం షోరూమ్ వారికి మురళీధర్ ఆశీస్సులు అందజేశారు. ఈ విషయం పలమనేరులో హాట్‌టాపిక్‌గా మారింది.


అర్చకుడు ఇచ్చిన చిల్లరను లెక్క పెడుతున్న షోరూం సిబ్బంది

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No.TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

విభిన్న సంస్కృతితో దేశం సుసంపన్నం



వివిధ వేషధారణలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంప్లి: విభిన్న సంస్కృతి ద్వారా దేశం సుసంపన్నమైందని హృద్రోగ నిపుణులు డాక్టర్ విఠల్ అభిప్రాయ పడ్డారు. సండూరులోని కృష్ణానగర బీకేజీ గ్లోబల్ సమూహ సంస్థలో జరిగిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ దేశం అనేక భాషలు, విద్య, ఆచార, వేషభూషణలతో మహోన్నతమైందన్నారు. రామాయణ, మహాభారత భగవద్గీలో శ్రీకృష్ణుడి సందేశం తమ దేశాన్ని ఉత్తమంగా రూపొందించుకునేందుకు వరం అయిందన్నారు. విద్యార్థులు ఫేస్‌బుక్‌లకు దూరంగా ఉండాలన్నారు.

గర్భిణులకు సీమంతం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్, వైద్యాధికారులు

కంప్లి: ఇంటి పనులు, కుటుంబ నిర్వహణ లాంటి ఒత్తిళ్ల నడుమ తమ ఆరోగ్యం వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎన్టీ శ్రీనివాస్ గర్భిణులకు సూచించారు. తాలూకా ఆస్పత్రి ఆధ్వర్యంలో పట్టణ తాలూకా వైద్యాధికారి కార్యాలయ సభాంగణంలో గర్భిణులకు, పిల్లలకు వచ్చే వ్యాధులపై ఏర్పాటు చేసిన జాగృతి, సీమంతం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు పిల్లల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలన్నారు.

పేర్లు వేరైనా దేవుడు ఒక్కడే



అయోధ్యకు బయలుదేరిన శ్రీరామ భక్తులు

కంప్లి: పేర్లు వేరైనా దేవుడు ఒక్కడే అని, నమ్ముకున్న తమకు శ్రీరాముడు ప్రియమైన దేవుడని ఎంపీ లతా మల్లికార్జున అభిప్రాయం వ్యక్తం చేశారు. హరపనహళ్లి పట్టణం నుంచి శ్రీరామ భక్తుడు శశికుమార్ బృందం 51 అడుగుల పొడవు గల ధ్వజాన్ని సిద్ధం చేసి ప్రత్యేక పూజలు జరిపి అయోధ్యకు చేపట్టిన ప్రయాణాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.


రాజీవ్‌గాంధీ సేవా కేంద్రం పరిశీలన



వీక్షిస్తున్న సీఈఓ తదితర అధికారులు

హొసపేటె: హరపనహళ్లి తాలూకా హరకనాళు జీపీలో నరేగ పథకం కింద రూ.35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రాజీవ్‌గాంధీ సేవా కేంద్రం భవనాన్ని బుధవారం జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు పరిశీలించారు. ఈ భవనంపై జీపీఎల్ఎఫ్ భవనాన్ని నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా హరకనాళు జీపీ అధికారులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న దృశ్యం

కంప్లి: ధరల పెరుగుదల, ఉద్యోగ సృష్టి, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఒత్తిడి చేస్తూ సీఐటీయూ సంఘం తరపున రాష్ట్ర స్థాయిలో 2 కోట్ల సంతకాల సేకరణను చేపట్టారు. బుధవారం సండూరు విజయ సర్కిల్ వద్ద జిల్లా శాఖ కార్యదర్శి సీఎం చెన్నబసయ్య స్వామి సంతకాల సేకరణను ప్రారంభించి మాట్లాడారు. జీపీ ఉద్యోగుల సంఘం ప్రముఖులు కృష్ణానాయక్, దేవదాసి మహిళా విమోచన సంఘం అధ్యక్షురాలు హెచ్.దుర్గమ్మ, కొండాపుర గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

హుబ్లీ: తాలూకాలోని బ్యాహట్టి పీర్లాపుర రోడ్డులో ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో ఓ బాలుడు మృతి చెందాడు. మృతుడిని లక్ష్మణ్(11)గా గుర్తించారు. బైక్‌లో చిదానంద, ఆయన భార్య కావేరి, కుమారుడు లక్ష్మణ్‌తో కలిసి వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు హుబ్లీ గ్రామీణ పోలీసులు తెలిపారు.

భక్తుల కొంగుబంగారం..దత్తాత్రేయ మందిరం

- కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు
- వేధిస్తున్న కనీస సదుపాయాల కొరత

సాక్షి,బళ్లారి: త్రిమూర్తుల అంశావతారం వెలసిన మహాపుణ్యక్షేత్రం గాణగాపుర భక్తుల సందడితో నిత్యం విరాజిల్లుతోంది. గురువులకే ఆది గురువైన శ్రీదత్తాత్రేయుడి దివ్య పాదుకలను దర్శించుకోవడానికి భక్తుల సందడి కొనసాగుతోంది. శ్రీమహావిష్ణువు దశావతార పరంపరలో భాగంగా అత్రి, అనసూయ దంపతులకు మార్గశిర పౌర్ణమి రోజున శ్రీహరి శ్రీదత్తాత్రేయుడుగా జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. భక్త రక్షణ కోసం యుగాల పర్యంతం నిలిచి ఉండటానికి శ్రీదత్తాత్రేయ క్షేత్రంలో నిత్యం భక్తులు వేనోళ్ల కీర్తించే గురుదైవం శ్రీదత్తాత్రేయులు, వారి నిండైన విగ్రహాలు గాణగాపురలో వెలసి ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురిని ఏకకాలంలో దర్శించుకుంటున్నామా అని భక్తులు పరవశించిపోయే మహాపుణ్యక్షేత్రమిది.

పాదుకల దర్శనానికి భక్తుల తాకిడి

శ్రీదత్తాత్రేయుడి పాదుకలను దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి తరలి వచ్చే భక్తులతో నిత్యం కిటకిటలాడుతోంది. దివ్యపాదుకలతో పాటు శ్రీకల్లేశ్వర ఆలయం, సంగమ భీమా దర్శనాలు ఇక్కడి విశేషత. శ్రీదత్త శరణం మమా అంటూ నిత్యం ఇక్కడికి స్మరించుకోవడానికి భక్తులు తరలి వస్తుంటారు. దక్ష క్షేత్రంగా ప్రసిద్ధిపొందిన గాణగాపురలో ఉడిపిలో శ్రీకృష్ణుని దర్శనం మాదిరిగానే దత్తాత్రేయుడు శ్రీగురు పాదుకలను ఒక గవాక్షిలో దర్శనం చేసుకుంటూ భక్తులు పునీతులవుతుంటారు. భీమా, అమర్జా అనే రెండు నదుల సంగమం కూడా ఇక్కడ ఉంది. శ్రీదత్తాత్రేయుడు రెండో అవతారమైన శ్రీనరసింహస్వామి అని కూడా భక్తుల నమ్మకం.



లింగాకారంలో వెలసిన మహాశివుడు



గాణగాపురలో వెలసిన దత్తాత్రేయ ఆలయం

ఆలయం ఎక్కడ ఉందంటే..

సంగమ భీమా దర్శనం, గవాక్షి ద్వారా గురుపాదుకలను, కల్లేశ్వర, శనిమందిరం, ఆంజనేయ స్వామి, పంచముఖ గణపతిని, అశ్వర్థ వృక్షాన్ని, నరసింహ సరస్వతి ఆలయం, మేడిచెట్టును దర్శించుకునే శ్రీదత్తాత్రేయ ఆలయం కర్ణాటకలోని కలబుర్గి జిల్లా అఫ్జలపుర తాలూకాలోని గాణగాపురలో వెలసి ఉంది. మహాపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహామహిమాన్వితమైన, పవిత్రమైన గాణగాపురలో దత్తాత్రేయ ఆలయ పరిసరాల్లో సమస్యలు తిష్ట వేసినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్షాత్తు బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు కొలువుదీరారని భక్తులు విశ్వసించే, పురాణాలు ఘోషించే శ్రీదత్తాత్రేయ ఆలయ ముఖ ద్వారం ముందే రోడ్లు గుంతలమయంగా కనిపిస్తున్నాయి.

అస్తవ్యస్తంగా రోడ్లు, సమస్యల తిష్ట

శ్రీకల్లేశ్వర, శనశ్వరాలయానికి వెళ్లే దారి ఎక్కడో మారుమూల పల్లెటూరు, అడవిలో ఉన్న రోడ్ల మాదిరిగా అధ్వానంగా, కంకర, గుంతలమయంగా ఉంది. దీంతో రెండు కిలోమీటర్ల దూరం ఆలయం వద్దకు చేరుకునే ముందు దుస్థితిలో ఉండడంతో పాటు ఈ క్షేత్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం భక్తులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా గాణగాపురను దర్శించుకోవాలని భక్తులు ఆశించే మహిమాన్విత ప్రదేశంలో సదుపాయాలను కల్పించడంపై ఆలయ కమిటీ నిర్వాహకులు కూడా దృష్టి పెట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

అశ్లీల సందేశాలు.. యువకుడికి దేహశుద్ధి

హుబ్లీ: యువతుల మొబైల్ నెంబర్ తీసుకొని వారికి అశ్లీల సందేశాలను పంపుతున్న యువకుడిని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం నగరంలో జరిగింది. ధార్వాడ జూబ్లీ సర్కిల్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్ అంగడిలో పని చేస్తున్న ఫయాజ్ అనే నిందితుడు తన అంగడికి వచ్చే వినియోగదారుల ఫోన్ నెంబర్ తీసుకొని వీడియో కాల్, మెసేజ్ పంపేవాడని, అందుకే దేహశుద్ధి చేశామని, యువతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని భజరంగదళ్ కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదుపై ధార్వాడ ఉపనగర పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

గంగావతి: శెనగ కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం కొప్పళలోని జిల్లాధికారి కార్యాలయం ముందు నిరసనను వ్యక్తం చేశారు. క్వింటాల్ శెనగల ధర రూ.7 వేల నుంచి రూ.4 వేలకు తగ్గిందని, గతంలో ఉన్న ధర కన్నా మరింత పెంచి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేశారు. లేకుంటే తమ ఆందోళనను కొనసాగిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం తమ వినతిపత్రాన్ని జిల్లాధికారికి అందజేశారు.

ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి



నిరసన తెలుపుతున్న సంఘం నేతలు

గంగావతి: వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐడీవైఓ ఆధ్వర్యంలో బుధవారం బస్టాండ్ సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు. సంఘం జిల్లాధ్యక్షుడు రమేష్ వంకలకుంట మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో సంగీత, చిత్రలేఖన, రంగస్థల, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జనరల్ ఉపాధ్యాయ పోస్టులతో వీటిని ప్రభుత్వం భర్తీ చేయాలని ఒత్తిడి చేశారు. తమ సమస్యను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి దుర్మరణం

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలైన ఘటన మంగళవారం సాయంత్రం రాయచూరు విశ్వవిద్యాలయం వద్ద జరిగింది. ప్రమాదంలో యరగేరకు చెందిన మహ్మద్ ఫర్హాన్(19) అనే విద్యార్థి మరణించగా, మరో విద్యార్థికి గాయాలయ్యాయి. రాయచూరు నుంచి మంత్రాలయం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్ మార్గమధ్యంలో యరగేర వద్ద అదుపు తప్పి బైక్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన సంభవించింది. యరగేర పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడ్డ విద్యార్థిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

గణతంత్రానికి అన్ని ఏర్పాట్లు చేయండి

హొసపేటె: జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు జిల్లాధికారిణి అనురాధ వివిధ శాఖల అధికారులకు సూచించారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయ హాలులో ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత వహించి ఆమె మాట్లాడారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా నగరంలోని జిల్లా స్టేడియంలో గణతంత్ర దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఇందు కోసం ఇప్పటికే వివిధ కమిటీలను ఏర్పాటు చేసి ఆయా కమిటీల్లోని అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అతిథులు, స్వాతంత్య్ర సమరయోధులు, ప్రముఖులు, పాత్రికేయులకు సరైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. లౌడ్‌స్పీకర్, స్టేడియం పరిశుభ్రత, లైటింగ్ వ్యవస్థను నిర్వహించాలన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా అలంకరణ చేయాలని, పోలీసు శాఖ, హోంగార్డ్స్, పౌర కార్మికులు, గ్రామ కాయక మిత్ర, ఎన్‌సీసీ, భారత్ సేవాదళ్, పాఠశాల, కళాశాలల విద్యార్థులు క్రమశిక్షణతో పంథ సంచలన నిర్వహించాలన్నారు. ఇందు కోసం ముందుగా సరైన సన్నాహకం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లాధికారిణి అనురాధ

ట్యాంకర్ లారీ పట్టివేత

- రూ.52 లక్షల నకిలీ మద్యం స్వాధీనం

హుబ్లీ: బోగస్ బిల్లులు సృష్టించి లక్షలాది రూపాయల విలువ చేసే నకిలీ మద్యాన్ని రవాణా చేస్తున్న నకిలీ నెంబర్ ప్లేట్‌తో ఉన్న ట్యాంకర్ లారీని బుధవారం సరుకుతో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ధార్వాడ నరేంద్ర టోల్ వద్ద తనిఖీ చేసి పట్టుకున్నారు. వివరాలు.. నిందితులు వేస్ట్ అయిల్‌ను నింపుకెళ్లే ట్యాంకర్‌లో రాయల్‌బ్లూ పేరుతో ఉన్న నకిలీ మద్యం బాక్స్‌లను రవాణా చేస్తున్నారు. ఈ కృత్యానికి ఉపయోగించిన ట్యాంకర్ లారీ నెంబర్ ప్లేట్ కూడా నకిలీదేనని అధికారులు తెలిపారు. కాగా ఈ నకిలీ మద్యం విలువ రూ.52 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. బెంగళూరు నుంచి ధార్వాడ మీదుగా బెళగావి వైపునకు వెళుతున్న ఈ ట్యాంకర్ లారీలో బెంగళూరు సోమాని ట్రేడర్స్ పేరున రాజస్తాన్ నిశాంత్ లూబ్రికెంట్స్ వేస్ట్ ఆయిల్ రవాణాకు సంబంధించి నకిలీ బిల్లు సృష్టించినట్లుగా దర్యాప్తులో వెలుగు చూసింది. అధికారులు దాడి చేస్తుండగానే లారీ డ్రైవర్ మోహన్ లాల్ పరారయ్యాడు. కాగా స్వాధీనం చేసుకున్న మద్యం ట్యాంకర్ లారీని ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఆ శాఖ ఏసీ విజయ్ కుమార్ సనది, డిప్యూటీ ఏసీ బాలప్ప సంపగాంవ్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనపరచుకున్న ట్యాంకర్ లారీ ఇదే

కృష్ణా వంతెనపై ట్రాఫిక్ నిలిపివేత

రాయచూరు రూరల్: తాలూకా సరిహద్దులో శక్తినగర్ వద్ద కృష్ణా నదిపై వంతెన అధ్వానస్థితికి చేరుకోవడంతో మరమ్మతు పనుల కోసం 45 రోజుల పాటు రాకపోకలను జిల్లా యంత్రాంగం స్తంభింపజేసింది. దీంతో వాహనదారులు బుధవారం నుంచి ప్రత్యామ్నాయ రహదారులను అనుసరించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య కృష్ణా వంతెనపై వాహనాల రాకపోకలను నిషేధించారు. దీంతో రాయచూరు నుంచి కలబుర్గికి వెళ్లేవారు దేవదుర్గ, శహాపుర, జేవర్గి, యాదగిరి మీదుగా, హైదరాబాద్ వెళ్లేవారు యరగేర, అయిజ, గద్వాల్, బీచుపల్లి మీదుగా ప్రయాణించడానికి వీలుగా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.

రూ.5 లక్షల పరిహారం అందజేత

సాక్షి, బళ్లారి: ప్రముఖ కన్నడ సినీ నటుడు యశ్ పుట్టిన రోజు సందర్భంగా కటౌట్లు కడుతూ గదగ్ జిల్లా సూరణగికి చెందిన ముగ్గురు అభిమానులు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నేపథ్యంలో మృతుల కుటుంబాలకు యశ్ ఆర్థిక చేయూత అందించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మురళి, నవీన్, హనుమంతు అనే ముగ్గురు అభిమానుల కుటుంబాలకు ఆయన ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల చెక్‌ను తమ అభిమానులతో పంపించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మహనీయుల బాట అనుసరణీయం



చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి దయానంద బేలూరు తదితరులు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ మహనీయుల ఆదర్శాలను అనుసరించాలని అదనపు జిల్లా న్యాయమూర్తి దయానంద బేలూరు అన్నారు. ఆయన బుధవారం నగరంలోని కేఈబీ పాఠశాలలో స్వామి వివేకానంద, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, బసవణ్ణ అనుభవ మంటపర రెండూ ఒక్కటేనన్నారు. అనంతరం అంబేడ్కర్ పుస్తకాలను పంపిణీ చేశారు. డీడీపీఐ బడిగేర్, శివకుమార్, చంద్రశేఖర్, బసవరాజ్, లావణ్య, ఉదయ్‌కుమార్, రాజశేఖర్‌లున్నారు.

ఎయిమ్స్‌పై సర్కార్లతో చర్చిస్తాం



వినతిపత్రం అందిస్తున్న శివరామేగౌడ

రాయచూరు రూరల్: నగరంలో ఎయిమ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా సర్కార్లతో చర్చిస్తామని కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివరామేగౌడ పేర్కొన్నారు. ఆయన బుధవారం మహాత్మాగాంధీ మైదానంలో చేపట్టిన ఆందోళనకు మద్దతు పలికి సమితి అధ్యక్షుడు బసవరాజ కళసతో కలిసి మాట్లాడారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కేంద్ర మంత్రులతో చర్చించి రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించేలా చూస్తామన్నారు. ప్రజాప్రతినిధులు ఈ విషయంలో మౌనం వహించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి నిరసన గళం విప్పాలన్నారు.

కర్ణాటకలో మహారాష్ట్ర జోక్యం ఏంటి?

- సీఎం సిద్దరామయ్య

రాయచూరు రూరల్: కర్ణాటక సరిహద్దుల్లో మహారాష్ట్ర జోక్యం చేసుకోరాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మహారాష్ట్ర సర్కార్‌కు సూచించారు. బుధవారం బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా సైనిక పాఠశాలలో సంగొళ్లి రాయణ్ణ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటక సరిహద్దులోని 865 గ్రామాల్లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న విషయంపై ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు. సైనిక పాఠశాలలో కన్నడిగులకు 65 శాతం, ఇతరులకు 35 శాతం సీట్లు కేటాయించామన్నారు. గుణాత్మక విద్యతో పాటు దేశభక్తిని పిల్లల్లో పెంచుతామన్నారు. సంగొళ్లి రాయణ్ణ జ్ఞాపకార్థం 110 ఎకరాల్లో ప్రభుత్వం నుంచి రాక్ పార్క్, వస్తు సంగ్రహాలయ నిర్మాణం చేపడుతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లలో గెలుపొందితే ఐదేళ్లు సీఎంగా ఎవరు కొనసాగుతారో పార్టీ తీర్మానం చేస్తుందన్నారు. బ్రిటిష్‌లపై పోరాడిన నేత సంగొళ్లి రాయణ్ణ కాగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దన్నారు.

బీజేపీ చేసిందేం లేదు

దేశం కోసం బీజేపీ చేసిందేమీ లేదని సీఎం ఆరోపించారు. రాయణ్ణను మోసంతో మన వాళ్లే బ్రిటిష్‌లకు అప్పగించారన్నారు. దేశ భక్తులంటే ప్రజలను ప్రేమించే వారన్నారు. నేడు బీజేపీ కులాలు, మతాల మధ్య ఘర్షణలు రాజేసిందని విమర్శించారు. బసవణ్ణ, అంబేడ్కర్‌లు కుల, మత, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అందరూ సమానమనే భావనలు కలిగిన వారన్నారు. మనిషి ద్వేషం వీడాలన్నారు. నేడు మసీదులు ధ్వంసం చేయమని సలహాలు ఇచ్చేవారున్నారన్నారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో నైపుణ్యతను సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పంచ గ్యారెంటీలతో అందరికీ మేలు జరిగిందన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు సహజమన్నారు. వాటిని లెక్కచేయకుండా ఉచిత పథకాలను ప్రజలకు అందించడం తమ కర్తవ్యమన్నారు. ఉత్సవాల్లో స్వామీజీలు గురులింగ శివాచార్య, మడివాళ రాజయోగీంద్ర, నిరంజనానందపురి, మంత్రులు సతీష్ జార్కిహోళి, శివరాజ్ తంగడిగి, బైరతి సురేష్, శాసన సభ్యులు మేటి, అశోక్ పట్టణశెట్టి, మాజీ ఎమ్మెల్యేలు రేవణ్ణ, అంజలి నింబాళ్కర్, ప్రకాష్ హుక్కేరిలున్నారు.



సంగొళ్లి రాయణ్ణ విగ్రహాన్ని ఆవిష్కరించి పటానికి నమస్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య

కొత్త చట్టాన్ని విరమించుకోవాలని సమ్మె



లారీలను నిలిపి ఆందోళన చేస్తున్న యజమానులు

గంగావతి: రవాణా శాఖ అమలు చేసిన హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే వాపసు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం అర్ధరాత్రి నుంచి కారటగిలో లారీ యజమానులు సరుకు రవాణా వాహనదారుల క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో వాహనాలను నిలిపివేయడం ద్వారా సమ్మెను ప్రారంభించారు. సంఘం అధ్యక్షులు పరసప్ప మాట్లాడుతూ ఈ కొత్త చట్టం వల్ల లారీ నడపడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ చట్టాన్ని తక్షణం ప్రభుత్వం వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని వాపసు తీసుకునేంత వరకు తమ సమ్మెను కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బసవరాజ్, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా వారు బూదుగుంప రోడ్డు నుంచి కారటగి ఏపీఎంసీ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం వాహనాలను నిలిపివేశారు.

వైద్యాధికారిని సస్పెండ్ చేయరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరు ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) కళాశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్‌ను సస్పెండ్ చేయాలని కర్ణాటక రణధీర పడె డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. ఆస్పత్రిలో చెవి, గొంతు, ముక్కు వ్యాధి నిపుణుడు రాజశేఖర్ రోగులకు సకాలంలో చికిత్స చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఆయనను సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

డ్రైవర్లపై కొత్త చట్టం రుద్దడం తగదు

రాయచూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన హిట్ అండ్ రన్ కొత్త చట్టాన్ని డ్రైవర్లపై రుద్దడం తగదని కర్ణాటక లారీ డ్రైవర్ల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం టిప్పుసుల్తాన్ పార్క్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. లోక్‌సభలో అంగీకరించిన ఈ చట్టంతో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని దారి మధ్యలోనే వదిలేసి వెళ్లినా, ఆస్పత్రికి తీసుకెళ్లకపోయినా, ప్రమాదానికి గురి చేసి పారిపోయినా ఈ అశాస్త్రీయ చట్టం వల్ల డ్రైవర్లపై రూ.10 లక్షల వరకు జరిమానా విధించవచ్చన్నారు. అందువల్ల ఈ కొత్త చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. కాగా అంతకు ముందు ఈ చట్టం తేవడాన్ని వ్యతిరేకిస్తూ నగరంలో దుకాణాల మూసివేతకు దిగి వాహనాలను అడ్డగించి సమ్మెకు మద్దతు పలకాలని ర్యాలీ చేపట్టారు. యజమానులు, డ్రైవర్లు తమ లారీలను స్తంభింపజేసి నిరసన వ్యక్తం చేశారు.



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

అంబేడ్కర్ మృతిపై కూడా కాంగ్రెస్ రాజకీయం

కోలారు: అంబేడ్కర్ జీవించి ఉండగా, మరణించినప్పుడు కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేసి ఆయనను అవమానం పాల్జేసిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సిమెంట్ మంజు తెలిపారు. బుధవారం నగరంలోని ప్రైవేటు కళ్యాణ మంటపంలో నిర్వహించిన భీమా సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు చేసిన అవమానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అంబేడ్కర్‌కు మరణానంతరం భారతరత్న అవార్డును కాంగ్రెస్సేతర ప్రభుత్వం వచ్చిన తరువాతే ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంబేడ్కర్‌కు సంబంధించిన ఐదు స్థలాలను అభివృద్ధి చేశారని, దీనిపై ప్రజల ముందుకు తీసుకు వెళ్లాల్సి ఉందన్నారు. అంబేడ్కర్ కాంగ్రెస్ పార్టీ రగులుతున్న ఇల్లు అని అనాడే వ్యాఖ్యానించారన్నారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఎస్.మహేష్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ వ్యవస్థ బలపడకుంటే దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికార అవధిలో దళితులకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. దారిద్ర్య రేఖ కంటే దిగువన దళితులు, మైనారిటీలు ఉన్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి భవిష్యత్తులో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు చేసిన అవమానాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నడుచుకుంటోందన్నారు. ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు బీపీ వెంకటమునియప్ప, వై సంపంగి, బాలరాజ్, బీపీ మహేష్, రాము పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆ ఎంపీ వ్యాఖ్యలు హేయం

రాయచూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ముర్కి రామయ్యగా ఎద్దేవా చేసిన లోక్‌సభ సభ్యుడు అనంత కుమార్ హెగ్డేను అరెస్ట్ చేయాలని షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు అయ్యన్న మాట్లాడారు. లోక్‌సభ సభ్యుడిగా హెగ్డే నీచమైన భాషలో ఏకవచనంలో విమర్శలు చేయడం తగదన్నారు. ఉన్నత హోదాలోని వ్యక్తిని నిందించిన ఎంపీని పార్టీ నుంచి తొలగించాలని, ఆయనను అరెస్ట్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివరాజ్, ఈశప్ప, రాములున్నారు.



ఆందోళన చేస్తున్న దృశ్యం